ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
శ్రీకాకుళం
: fb.com/vaartha Digital
Published from Srikakulam ,Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem
14-4-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 73 పేజీలు: 16 వెల: 6.50

డీలిమిటేషనే అసలు సమస్య: సోనియాగాంధీ
పోలింగ్ కేంద్రాల్లో బయోమెట్రిక్ విధానం!
5

## హార్ముజ్ నౌకల దిగ్బంధం

158 ఇరాన్ నౌకలను ముంచేశాం

వచ్చేపోయే అన్ని నౌకలను అడ్డుకుంటున్నాం: ట్రంప్

మరింత పెరిగిన ఉద్రిక్తతలు

అమెరికా చర్యలను దీటుగా ఎదుర్కొంటున్నాం: ఇరాన్

సముద్ర దొంగలా మారిన అమెరికాను వదలం: సయ్యద్ మాజిద్

2



## 'క్వాంటం'తో ఏపికి కొత్త చరిత్ర

రెండు క్వాంటం కంప్యూటర్ టెస్ట్‌బెడ్స్‌కు నేడు శ్రీకారం

ప్రారంభించనున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఏప్రిల్ 13, ప్రభాత వార్త ప్రతినిధి:** ప్రపంచ క్వాంటం డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాజధాని వేదికగా చారిత్రత్మక ఘట్టం ఆవిష్కృతమవుతుంది. అమరావతి క్వాంటం వ్యాలీలో భాగంగా ఈ నెల ఏప్రిల్ 14వ తేదీన ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, మేధా టవర్స్‌లో రెండు వేర్వేరు క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్స్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. అమరావతి కేంద్రంగా ఇన్నోవేట్ అవుతున్న క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీతో టెక్ శకంలో నూతన >>2

# పర్మిషన్లు సరళం

పారిశ్రామిక అనుమతులకు 800పైగా ఉన్న నిబంధనలు 100లోపు తగ్గింపు

వేధింపులులేని థర్డ్‌పార్టీ తనిఖీలు

అటవీ చట్టాలు సవరించాలని కేంద్ర బృందానికి సూచన

స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ బృందంతో సిఎం చంద్రబాబు భేటీ



సోమవారం అమరావతిలో సిఎం చంద్రబాబుతో భేటీ అయిన స్టీల్ సెక్రటరీ బృందం

**విజయవాడ,ఏప్రిల్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలకు ప్రయోజనం కలిగించే సరళతరమైన సాంకేతిక విధానాలను తమ ప్రభుత్వం అమలు చేస్తుందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.ఆ క్రమంలోనే ప్రతి ప్రయోజితరంగంలో సంస్కరణలను తీసుకుని రావడంతో పాటు టెక్నాలజీని వినియోగిస్తున్నామన్నారు. మే నెలాఖరులోగా డిరెగ్యులేషన్ ఫేజ్2 అమల్లోకి వచ్చేలా చూడాలని ఆ మేరకు ఆర్డినెన్సులు తీసుకురావాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని కేంద్ర ప్రతినిధి బృందంతో సీఎం భేటీ అయ్యారు. కేంద్ర ప్రతిపాదిత డీరెగ్యులేషన్ ఫేజ్2 విధానాలపై సమీక్షి ంచారు. పరిశ్రమల ఏర్పాటులో వేగం, అనుమతుల్లో సులభతరం అనవసరపు పర్మి షన్ల నియంత్రణపై చర్చించారు. కేంద్రం రూపొందించిన ప్రతిపాదనలను స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ సీఎం చంద్రబాబు ముందు ఉంచారు. స్టీల్ సెక్రటరీ ప్రతిపాదనలపై రాష్ట్రానికి చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారుల తోనూ సమీక్షి ంచారు. 800కిపైగా ఉన్న నిబంధనలను 100 లోపునకు తీసుకురావాలని సీఎస్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. పర్మిషన్లు, లైసెన్సులను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయాలని సూచనలు చేశారు. ప్రజల భద్రత, పర్యావరణం వంటి అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. వేధింపులు లేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. అటవీ చట్టాలను వీలైనంత మేరకు సరళీకరించాలని కేంద్ర బృందానికి సూచనలు చేశారు. ఫైర్ సేఫ్టీకి సంబంధించి నేషనల్ బిల్డింగ్ >>2



సోమవారం శ్రీకాకుళంలో జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

## 'హంసఫర్' కదిలింది..

శ్రీకాకుళం- తిరుపతి రైలు ప్రారంభించిన కేంద్రమంత్రి రామ్మోహన్

ఆమదాలవలస దాకా భారీ బైక్‌ర్యాలీలో పాల్గొన్న మంత్రి

**ఆముదాలవలస (శ్రీకాకుళం జిల్లా), ఏప్రిల్ 13 ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లా చరిత్రలో నూతన అధ్యాయానికి శ్రీకారం చూడుతూ చరిత్రలో నిలచే రోజుగా సోమవారం నిలుస్తుందని కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. సోమవారం శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్‌లో శ్రీకాకుళం నుండి తిరుపతి హంసఫర్ రైలును పి.యు.సి ఛైర్మన్ కూన రవికుమార్, ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్, డి.ఆర్.ఎం లలిత్ బోహ్రాతో కలసి ప్రారంభించారు. అంతకుముందు శ్రీకాకుళం నగరంలోని తన క్యాంప్ కార్యాలయం నుండి అమదాలవాలస రైల్వే స్టేషన్ వరకు ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో జరిగిన భారీ బైక్ ర్యాలీ కార్యక్రమంలో కేంద్రమంత్రి స్వయంగా ద్విచక్ర వాహనం నడుపుతూ పాల్గొన్నారు. శ్రీకాకుళంలో ప్రారంభం అయింది మొదలు ఆమదాలవలస వరకు ప్రజలు ఈ ర్యాలీలో రామ్మోహన్ నాయుడుకు బ్రహ్మ రథం పట్టారు. చరిత్రలో నిలిచే గొప్ప పని చేసారంటూ నినదించారు.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రామ్మోహన్ నాయుడు ఎన్నో ఏళ్ల కల సాకారం అయ్యిందంటూ తనదైన శైలిలో ప్రసంగాన్ని ప్రారంభించారు. 75 ఏళ్ల సిక్కోలు చరిత్రలో ఇలాంటి రోజు కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నామని రామ్మోహన్ నాయుడు అన్నారు. తాను పార్లమెంటు సభ్యునిగా అడుగు పెట్టిన మొదటి రోజు నుండి ఇదే లక్ష్యాన్ని ఎంచుకుని తీవ్ర స్థాయి ప్రయత్నాలను ప్రారంభించానని తెలిపారు. ఎన్నో సమావేశాల్లో ఇదే విషయం మాట్లాడానని, ప్రతీ రైల్వే మంత్రిని కలసి అవసరాన్ని ఒకటికి రెండుసార్లు గుర్తు చేశానని అన్నారు. వెంకన్న ఆశీస్సులు ఉన్నాయి కాబట్టే ఇది సాదయమైందని అన్న రామ్మోహన్ నాయుడు భవిష్యత్‌లో హైదరాబాద్‌కు సైతం ఇక్కడి నుండే రైలు ప్రారంభమయ్యేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. హంసఫర్ రైలు విషయంలో మూడు రోజుల క్రితం బుకింగ్స్ ప్రారంభిస్తే 97 శాతం సీట్లు రిజర్వు అవ్వడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ప్రధాని మోడి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇలా అందరి ఆలోచనలు జిల్లా ప్రగతిపై సమిష్టిగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్‌కు ముఖద్వారంగా శ్రీకాకుళం చేయాలని వారి ఆలోచన అని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ప్రపంచంలో, దేశంలో ఎక్కడికి వెళ్ళినా సిక్కోలు ప్రజలు మనకు కనిపిస్తారని పొట్టకూటి కోసం వెళ్ళే పరిస్థితులు మారి జిల్లాలోనే వారికి ఉపాధి లభించేలా చేయాలనేది తన సంకల్పం అని రామ్మోహన్ నాయుడు అన్నారు. మూలపేట పోర్టు, ఎయిర్ పోర్ట్, జాతీయ రహదారులు, రైల్వేలు, ఇలా అన్నీ రంగాలను అభివృద్ధి చేసుకుంటూ లాజిస్టిక్ హబ్ గా వృద్ధిలోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమదాలవలస శాసన సభ్యులు కూన రవి కుమార్, శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాలలు తెరిచేలోగా పూర్తి వసతులతో ప్రభుత్వ హాస్టళ్లు

## ఎక్కడా మంచినీరు, పారిశుధ్యం, వీధి దీపాల సమస్య రాకూడదు: సిఎం చంద్రబాబు

**విజయవాడ , ఏప్రిల్ 13. ప్రభాతవార్తప్రతినిధి:** పాఠశాలలు పునః ప్రారంభం నాటికి ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లన్నీ పూర్తి వసతులతో సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతీ హాస్టల్ గాడిలో పడాలని.అన్ని రకాల వసతులు ఉండాలని స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కనుంచి క్షేత్రస్థాయిలో వివిధ శాఖల పనితీరుపై సమీక్షి ంచారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."జూన్ లో స్కూళ్ల రీఓపెనింగ్ నాటికి హాస్టళ్లు అన్నీ చక్కగా ఉండాలి. విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండాలి. టాయిలెట్లు.. ఆర్వో ప్లాంట్లు సిద్ధంగా ఉండాలి. హాస్టళ్లకు సంబంధించి వసతులపై ఎలాంటి ఫిర్యాదులు కూడా రాకూడదు. హాస్టళ్లల్లో వసతులు మెరుగుపరిచేందుకు నిధులు కేటాయించాం. సాస్కీ నిధులతో ఈ పనులు చేపడుతున్నాం. నిధులు అందించిన తర్వాత కూడా ఇంకా ఫిర్యాదులు వస్తే అది అధికారుల తప్పిదమే అవుతుంది. వసతులను ఏర్పరచడమే కాకుండా... వాటిని సక్రమంగా నిర్వహించేలా కూడా చూడాలి. ఈ మేరకు నిరంతర పర్యవేక్షణ చేపడుతూనే ఉండాలి. హాస్టళ్లలో ఆహారం, నీటి సరఫరా విషయంలో లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు... పారిశుద్ధం విషయంలో తేడా రాకుండా చూసుకోవాలి. ఆయా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాస్టళ్లను నిరంతరం తనిఖీలు చేస్తూ ఉండాలి. ఇక నగరాలు, పట్టణాల్లో మౌలిక సదుపాయాల్లో ఎలాంటి లోపాలూ కన్పించకూడదు. తాగునీటి సరఫరా, వీధి దీపాల విషయంలో ఫిర్యాదులు రాకూడదు. అర్బన్ ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు ఉండడానికి వీల్లేదు. ప్రత్యేకంగా మౌలిక సదుపాయల కల్పన విషయంలో ఫిర్యాదులు రాకూడదు. తాగునీటి సరఫరా విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలి. తాగునీటిని అందించడంతోపాటు.. స్వచ్ఛమైన తాగునీరును... కలుషితం లేని నీటిని ప్రజలకు అందించేలా చూడాలి. తాగునీటి పైప్ లైన్లల్లో డ్రైనేజీ నీరు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తరుచూ నీటి శాంపిళ్లను కలెక్ట్ చేసి ల్యాబుల్లో టెస్ట్ చేయించాలి. వీధి దీపాలు నిరంతరం పని చేస్తూనే ఉండాలి. సెన్సిటివ్ ప్రాంతాల్లో వీధి దీపాల సమస్య ఉండకూడదు. పట్టణ ప్రాంతాల్లో చెత్త సేకరణ ఎక్కడా ఆగకూడదు. పట్టణ ప్రాంతాల్లో తాగునీరు, వీధి లైట్లు, డ్రైనేజీ, చెత్త సేకరణ వంటి అంశాల్లో ఫిర్యాదులు వచ్చిన వెంటనే పరిష్కరించే మెకానిజం ఉండాలి. పని పూర్తి చేశాక స్థానికుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి. ఫిర్యాదు చేసిన వెంటనే ప్రభుత్వం స్పందించింది... మున్సిపల్ అధికారులు స్పందించారనే భావన ప్రజలకు కలిగేలా చేయాలి. మున్సిపల్ కమిషనర్లకు స్పష్టమైన గైడ్ లైన్స్ జారీ చేయాలి. ఈ మేరకు మున్సిపల్ అధికారుల పనితీరును ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షి స్తూ ఉండాలి. స్వచ్ఛ సర్వేక్షణ్ వంటి కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆ ఫలితాలు స్పష్టంగా పట్టణాల్లో కన్పించాలి. తాడిపత్రి పట్టణంలో పారిశుద్ధం చక్కగా నిర్వహిస్తారు. అక్కడి నాయకులు చొరవ తీసుకుని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. నేతలు చొరవ తీసుకున్న చోట మంచి ఫలితాలు కన్పిస్తున్నాయి. స్వచ్ఛత విషయంలో తాడిపత్రి రోల్ మోడల్."అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. శాంతి భద్రతలను పాటించే విషయంలో నేరాలను కట్టడి చేసే సందర్భంలో ఏ మాత్రం రాజీ పడొద్దు. తప్పు చేసిన వారిని త్వరితగతిన అరెస్ట్ చేయడమే కాదు... వారికి శిక్షలు పడేలా చూడాలని సిఎం సూచించారు.

# అమరావతి బిల్లు ఆమోదంపై రాష్ట్రపతికి మంత్రి లోకేష్ కృతజ్ఞతలు

**విజయవాడ,ఏప్రిల్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజముద్ర వేయడం చరిత్రాత్మకమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షను నెరవేర్చిన రాష్ట్రపతికి కృతజ్ఞతలు తెలిపేందుకు, మంత్రి లోకేశ్ నేతృత్వంలోని ఎన్డీఏ ఎంపీల బృందం సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ చారిత్రక నిర్ణయంతో "మా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్మా రాజధాని అమరావతి" అని ప్రతి ఆంధ్రుడు గర్వంగా చెప్పుకునేలా చేశారని వారు హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన తర్వాత రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ తీవ్రంగా నష్టపోయిందని రాష్ట్రపతికి వివరించారు. ఐదు కోట్ల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రూపుదిద్దుకున్న అమరావతికి చట్టబద్ధత కల్పించడంపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. అమరావతికి శంకుస్థాపన చేసింది ప్రధాని నరేంద్ర మోదీయేనని, 2024లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయన నాయకత్వంలోనే పనులు తిరిగి ప్రారంభమయ్యాయని గుర్తుచేశారు.



సోమవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్ముతో భేటీ అయిన మంత్రి లోకేష్

అనంతరం, అమరావతి చరిత్ర, సంస్కృతి, రైతుల ఉద్యమం, మాస్టర్ ప్లాన్, పర్యావరణ హిత నిర్మాణాల విశేషాలతో కూడిన పుస్తకాన్ని రాష్ట్రపతికి అందజేశారు.

**రైతుల త్యాగఫలం అమరావతి**

రాజధాని నిర్మాణం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుతో రైతులు కేవలం 58 రోజుల్లో 34 వేల ఎకరాల భూములను స్వచ్ఛందంగా త్యాగం చేశారని లోకేశ్ రాష్ట్రపతికి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో వారిపై దాడులు జరిగినా, అక్రమ కేసులు బనాయించినా వెనకడుగు వేయకుండా శాంతియుతంగా ఉద్యమం కొనసాగించారని వివరించారు.

మంత్రి లోకేశ్, ఎంపీల బృందం చెప్పిన విషయాలను సావధానంగా విన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, అమరావతి చట్టం తన హయాంలో రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంపై ప్రేమతో రైతులు తమ భూములను త్యాగం చేయడాన్ని ఆమె ప్రశంసించారు. "పోరాడి సాధించుకున్నది చిరస్థాయిగా గుర్తుండిపోతుంది" అని ఆమె వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక విజనరీ లీడర్ అని, ఆయన దూరదృష్టితో రాష్ట్రాన్ని, రాజధానిని అద్భుతంగా అభివృద్ధి చేస్తారన్న విశ్వాసం తనకుందని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో పయనించాలని, రాజధాని నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగాలని రాష్ట్రపతి ఆకాంక్షి ంచారు.

# అందరికీ ఆహార భద్రత, అందుబాటులోకి 62 గ్రామీణ అన్న క్యాంటీన్లు..

## రేపు ధరణికోటలో ప్రారంభించనున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ ఏప్రిల్ 13, ప్రభాతవార్తప్రతినిధి:** కార్మికులు, కూలీలు, గ్రామీణులు వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చే ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదన్న సంకల్పంతో 207 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిన ప్రజా ప్రభుత్వం... తాజాగా మరికొన్ని అన్న క్యాంటీన్లు అందుబాటులోకి తీసుకొస్తోంది. రూ.5లకే పేదలకు కడుపునిండా నాణ్యమైన భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ఈ సేవలను గ్రామీణ ప్రాంతాలకూ విస్తరిస్తామని చెప్పిన సర్కార్... ఆ హామీని ఆచరణలో పెడుతోంది. మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 204 అన్న క్యాంటీన్లను కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేయగా 3 క్యాంటీన్లు గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా 62 క్యాంటీన్లను గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. రెండవ విడత అన్నక్యాంటీన్లను ఈ నెల 15న ముఖ్యమంత్రి చంద్రబాబు పెదకూరపాడు నియోజకవర్గం, ధరణికోటలో ప్రారంభిస్తారు.

గత ప్రభుత్వం కక్షగట్టి మూసివేసిన అన్నక్యాంటీన్లను కూటమి అధికారంలోకి వచ్చాక పున: ప్రారంభించింది. ఈనెల 15వ తేదీన ప్రారంభించబోయే 62 క్యాంటీన్లతో ఈ సంఖ్య 269 కు పెరుగనుంది. రుచి, శుచితో కూడిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని పేదలకు ప్రభుత్వం అందిస్తోంది. క్యాంటీన్ల పున:ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా పేదలు 8.80 కోట్ల భోజనాలు చేశారు. ఒక్కో అన్న క్యాంటీన్‌లో సగటున రోజుకు 1,013 మంది చేసే భోజనాలకు రూ.26,250 ఖర్చు అవుతోంది. 207 అన్న క్యాంటీన్ల ద్వారా రోజుకు 2.10 లక్షల మంది భోజనాలు చేస్తున్నారు. ఇందుకు రోజుకు రూ.54 లక్షలకు పైగా వ్యయం అవుతుండగా... సబ్సిడీ కోసం ప్రభుత్వం ఇప్పటి వరకూ రూ.243 కోట్లు వెచ్చింది. కొత్తగా ఏర్పాటు చేసే గ్రామీణ అన్న కాంటీన్ల సబ్సిడీకి ఏడాదికి రూ.58 కోట్లు వ్యయం అవ్వనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం పల్నాడు జిల్లా, పెదకూరపాడు నియోజకవర్గం, ధరణికోటలో పర్యటిస్తారు. మధ్యాహ్నం 12.40 గంటలకు ఉండవల్లి నుంచి బయలుదేరి ఒంటిగంటకు ధరణికోటకు చేరుకుంటారు. 01.30 గంటలకు అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి భోజనం చేస్తారు. కార్యక్రమాన్ని ముగించుకుని 02.45 గంటలకు ఉండవల్లికి చేరుకుంటారు.

## వారం - వర్జ్యం

14-04-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, అశ్విని కార్తె
ద్వాదశి రా.12.08
శతభిష సా.4.00
వర్జ్యం : రా.10.12-రా.11.46
దు.ఉ.8.22-ఉ.9.12,
2) రా.11.22-రా.12.12
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. పాత బాకీలు వసూలవుతాయి.బంధువుల కలయిక.

**వృషభం:** జీవితభాగస్వామి నుండి ధనలాభం పొందుతారు. ఆస్తి వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. క్రయ విక్రయాలలో నిదానం వహించండి. ఆస్తి వివాదాలు తీర లబ్ధిని పొందుతారు.

**కర్కాటకం:** ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. సంగీత, సాహిత్యాల పట్ల ఆసక్తి చూపుతారు. ఖర్చులను అదుపుచేస్తారు.

**సింహం:** కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది.

**కన్య :** మిత్రులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి. స్థలాలు, భూములు కొనుగోలు చేస్తారు. వాహనసౌఖ్యం.

**తుల :** జీవిత భాగస్వామి సలహాలు పదే పదే తీసుకుంటారు, వాటిని అనుసరిస్తారు. వివాదాలకు దూరంగా వుండండి.

**వృశ్చికం:** అనుకోని అతిథులను కలిసి ఆనందంగా గడుపుతారు. సంఘంలో విశేష గౌరవం లభిస్తుంది.శుభకార్యాలు పాల్గొంటారు.

**ధనుస్సు:** మీ మాటకు విలువ పెరుగుతుంది. విదేశాల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. ఋణాలు తీరుతాయి.

**మకరం:** పారిశ్రామిక, రాజకీయ రంగాలలోని వారికి ప్రభుత్వపరంగా ఆహ్వానాలు అందుకుంటారు.

**కుంభం:** సాంకేతిక లోపాలవలన అతి తక్కువ వ్యవధిలో అధిక లాభాలు కలిగే విషయ వ్యవహారాలకు భంగం కలుగదు.

**మీనం:** దూర ప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. ఆలోచనలకు కార్యరూపం ఇస్తారు.వస్త్రలాభం కలదు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 21వ శతాబ్దం మహిళలదే

## అత్యంత కీలక సంస్కరణలు తీసుకొస్తున్నాం.. మద్దతు ఇవ్వండి

## 'నారీ శక్తి వందన్ సమ్మేళనం'లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపు



సోమవారం న్యూఢిల్లీలో 'నారీ శక్తి వందన్ సమ్మేళనం'లో అభివాదం చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** భారతదేశపు 'నారీ శక్తి' తమ కఠోర శ్రమ, ధైర్యం, ఆత్మవిశ్వాసం ద్వారా సరికొత్త శిఖరాలను అధిరోహించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. మహిళలకు మరిన్ని అవకాశాలను కల్పించడం ద్వారా వారిని సాధికారత దిశగా నడిపించేందుకు అందరూ ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం న్యూఢిల్లీలో నిర్వహించిన 'నారీ శక్తి వందన్ సమ్మేళనం'లో ప్రసంగిస్తూ, భారతదేశం 21వ శతాబ్దపు అత్యంత భారీ నిర్ణయాలలో ఒకదానిని తీసుకోబోతోందని, ఈ నిర్ణయం పూర్తిగా మహిళా సాధికారతకే అంకితమని మోడీ తెలిపారు. పార్లమెంటు ఒక సరికొత్త చరిత్రను సృష్టించే అంచున ఉందని, గత, భవిష్యత్ తరాల ఆకాంక్షలను నెరవేర్చే చరిత్ర అవుతుందని ఆయన అన్నారు. రాష్ట్ర శాసనసభల నుండి దేశ పార్లమెంటు వరకు, దశాబ్దాలుగా కొనసాగుతున్న సుదీర్ఘ నిరీక్షణ ఈ నెల 16, 17, 18 తేదీలలో ముగియనుందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. 2023లో, నూతనంగా నిర్మించిన పార్లమెంటు భవనంలో, ఈ చట్టం సకాలంలో అమలు అయ్యేలా చూసేందుకు ప్రభుత్వం 'నారీ శక్తి వందన్ అధినియం' రూపంలో తొలి అడుగు వేసిందని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన ఆవశ్యకతను ప్రధానమంత్రి మోడీ పునరుద్ఘాటించారు. "మహిళల భాగస్వామ్యం దేశ ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. స్వాతంత్ర్య పోరాటం నుండి రాజ్యాంగ సభ నిర్ణయాల వరకు, స్వతంత్ర భారతదేశపు పునాదులను నిర్మించడంలో భారతీయ మహిళలు అపారమైన కృషి చేశారు" అని ప్రధాని పేర్కొన్నారు. దేశంలో రాష్ట్రపతి నుండి ప్రధానమంత్రి వరకు ఏ ఉన్నత పదవిలో మహిళలు బాధ్యతలు చేపట్టినా, వారు తమదైన ప్రత్యేక ముద్రను, వారసత్వాన్ని సృష్టించుకున్నారని మోడీ వివరించారు. వారు దేశ గౌరవాన్ని, కీర్తిని రెండింటినీ ఇనుమడింపజేశారని ఆయన పేర్కొన్నారు. మహిళా నాయకత్వానికి పంచాయతీరాజ్ సంస్థలు ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి అభివర్ణించారు. నేడు భారతదేశంలోని స్థానిక ప్రభుత్వ సంస్థలలో 14 లక్షల మందికి పైగా మహిళలు విజయవంతంగా సేవలందిస్తున్నారని మోడీ తెలిపారు. వివిధ అధ్యయనాలను ప్రస్తావిస్తూ, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలలో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడు, అది వ్యవస్థలలో సున్నితత్వాన్ని తీసుకువస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణ దేవి, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, మాజీ కేంద్ర మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్, రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి, వివిధ రంగాల నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

# 'క్వాంటం'తో ఎపికి కొత్త చరిత్ర

>> అధ్యాయానికి తొలి అడుగు పడనుంది.విజన్ నుంచి క్యూబిట్స్ వరకు ఆంధ్రప్రదేశ్ భారత్ క్వాంటమ్ భవిష్యత్తును నిర్మిస్తోందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు.ప్రపంచ క్వాంటమ్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో దేశంలోనే తొలి స్వదేశీ, ఓపెన్ యాక్సెస్ క్వాంటమ్ కంప్యూటర్లు - అమరావతి ఐఎస్, అమరావతి ఐక్యూ -ను ప్రారంభించనున్నారని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. దీంతో అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రపంచ స్థాయి కేంద్రంగా అవతరించబోతోందని తెలిపారు. భవిష్యత్తు ఇక్కడే ఉందన్నారు. అమరావతిలో భారత్‌లో నిర్మితమై, భారతదేశానికి అందుబాటులో, ప్రపంచానికి సేవ చేసేందుకు సిద్ధంగా ఉందని ప్రకటించారు. క్వాంటమ్ ప్రారంభోత్సవానికి సంబంధించిన వీడియోను లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మంగళవారం గన్నవరంలోని మేధా టవర్స్‌తో పాటు రాజధానిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ క్యాంపస్‌లో ఏర్పాటు అవుతున్న 1ఎస్, 1 క్యూ పేరిట రెండు వేర్వేరు క్వాంటం టెస్టింగ్ రిఫరెన్సు ఫెసిలిటీలను ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. దీంతో దేశంలోనే క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఏపీ అవతరించనుంది. దేశీయంగా తయారైన ఈ క్వాంటం రిఫరెన్స్ టెస్ట్ ఫెసిలిటీతో క్వాంటం కంప్యూటర్ హార్డ్ వేర్‌ను పరీక్షి ంచి సర్టిఫై చేసే సామర్థం అమరావతి క్వాంటం వ్యాలీకి రానుంది. మేధాటవర్స్‌లో క్యూబిటెక్ సంస్థ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తున్న ఈ క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీ టెస్ట్ బెడ్‌లు క్వాంటం హార్డ్ వేర్ తయారీలో కీలకం కానున్నాయి. ఈ రెండు చోట్లా మైనస్ 273 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలో పనిచేసే ఈ మినీ క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్‌లు క్వాంటం ఉపకరణాలను పరీక్షి ంచేలా తోడ్పాటు అందించనున్నాయి. క్వాంటం కంప్యూటర్ ఉపకరణాలు తయారు చేసే కంపెనీలతో పాటు పరిశోధకులు, విద్యార్థులు, నిపుణులకు ఉపయోగపడేలా ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఓపెన్ యాక్సెస్ రిఫరెన్సు ఫెసిలిటీని ఏర్పాటు చేశారు. అమరావతిలో ఏర్పాటు చేస్తున్న ఈ రెండు క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీల్లోనూ పూర్తిగా స్వదేశంలో తయారైన ఉపకరణాలనే ఉపయోగించారు. మేధాటవర్స్‌లో క్యూబిటెక్ సంస్థ 1 క్యూ పేరిట క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్‌ను ఏర్పాటు చేసింది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 1 ఎస్ పేరిట సూపర్ కండక్టింగ్ టెక్నాలజీతో క్వాంటం టెస్ట్ బెడ్‌ను నిర్మించారు. ఈ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీల ఏర్పాటులో టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెం టల్ రీసెర్చ్ సహా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, డీఆర్డీఓ లాంటి సంస్థలు సహకారం అందించాయి.

# పర్మిషన్లు సరళం

>> కోడ్ స్థానంలో రాష్ట్ర నిబంధనలు పెట్టాలని డబుల్ లైసెన్సింగ్ తరహా పద్ధతులను తప్పించాలని చెప్పారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవిత కాలం చెల్లుబాటు కావాలని అన్నారు. దరఖాస్తు నుంచి అనుమతుల వరకూ మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేయాలని సీఎం తెలిపారు. ఫేజ్2 అమలు తర్వాత పరిశ్రమల అనుమతులకు ఏర్పాటుకు ఇప్పుడున్న ప్రక్రియలో 40 శాతం మేర సమయం తగ్గాలని అన్నారు. పరిశ్రమలకు అనుమతులు, నిబంధనలను సడలించే విషయంలో తమ ప్రతిపాదనలకంటే రాష్ట్రం చాలా ముందుందని కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ అభిప్రాయపడ్డారు. తాము ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్థానంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అమలు చేస్తున్నామని కేంద్ర బృందానికి వివరించారు. ప్రజలకు సేవలు అందించడం కోసం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాన్ని అవలంభిస్తున్నట్టు సీఎం వెల్లడించారు. డిరెగ్యులేషన్ ఫేజ్3ను చేపడుతున్నారా అని స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్‌ను సీఎం చంద్రబాబు అడిగారు. జూన్ నుంచి ఫేజ్3పై పని చేస్తామని స్టీల్ సెక్రటరీ చెప్పారు. ఫేజ్3లో టెక్నాలజీ అనుసంధానం, ఏఐ టూల్స్ వినియోగానికి పెద్ద పీట వేయాలని స్టీల్ సెక్రటరీకి సీఎం సూచనలు చేశారు. డేటా లేక్, రియల్ టైం డేటా, సీఎఫ్ఎంఎస్, అవేర్2.0, వాట్సాప్ గవర్నెన్స్ వంటి వ్యవస్థలను తాము వినియోగిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. వేధింపులు లేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.అటవీ చట్టాలను వీలైనంత మేరకు సరళీకరించాలని కేంద్ర బృందానికి సీఎం చంద్రబాబు సూచించారు.ఫైర్ సేఫ్టీకి సంబంధించి నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్ర నిబంధనలు పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.డబుల్ లైసెన్సింగ్ తరహా పద్ధతులను తప్పించాలని సీఎం సూచించారుజఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవిత కాలం చెల్లుబాటు కావాలని ముఖ్యమంత్రి సూచించారు,మే నెలాఖరులోగా డిరెగ్యులేషన్ ఫేజ్2 అమల్లోకి వచ్చేలా చూడాలన్న సీఎం చంద్రబాబు... ఆ మేరకు ఆర్డినెన్సులు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించారుదరఖాస్తు నుంచి అనుమతుల వరకూ మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేయాలని సీఎం అన్నారు.ఫేజ్2 అమలు తర్వాత పరిశ్రమల అనుమతులకు,ఏర్పాటుకు ఇప్పుడున్న ప్రక్రియలో 40 శాతం మేర సమయం తగ్గాలని సీఎం చంద్రబాబు అన్నారు. పరిశ్రమలకు అనుమతులు, నిబంధనలను సడలించే విషయంలో తమ ప్రతిపాదనలకంటే రాష్ట్రం చాలా ముందుందన్న కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.తాము ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్థానంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అమలు చేస్తున్నామని కేంద్ర బృందానికి ముఖ్యమంత్రి వివరించారు..ప్రజలకు సేవలు అందించడం కోసం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాన్ని అవలంభిస్తున్నట్టు సీఎం వెల్లడి. డిరెగ్యులేషన్ ఫేజ్3ను చేపడుతున్నారా అని స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ ను సీఎం చంద్రబాబు అడిగారు.జూన్ నెల నుంచి ఫేజ్3పై పని చేస్తామని స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ తెలిపారు.ఫేజ్3లో టెక్నాలజీ అనుసంధానం, ఏఐ టూల్స్ వినియోగానికి పెద్ద పీట వేయాలని స్టీల్ సెక్రటరీకి ఈ సందర్భంగా సీఎం బాబు నాయుడు సూచంచారు. డిరెగ్యులేషన్ ఫేజ్2 అమలుకు అవసరమైన ఆర్డినెన్సులు తీసుకురావాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశిం చారు. పరిశ్రమలు, వ్యాపారాల కోసం ప్రస్తుతం 82 రకాల అనుమతులు తీసుకోవాల్సి ఉందని... ఆ సంఖ్యను దశలవారీగా 57 వరకు తగ్గించాలని సీఎం సూచించారు. బిల్డింగ్ ప్లాన్ ఆమోదాలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు వంటి కీలక అనుమతులు 30 వరకు ఉన్న ప్రక్రియలను 18కు తగ్గించేలా చూడాలన్నారు. ఒకేశాఖలో ఉన్న అనుమతు లను విలీనం చేయడం, పర్మిషన్లు కాకుండా.. ప్రభుత్వానికి సమాచారం ఇచ్చే విధానం వంటి వాటిని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ వినియోగానికి సంబంధించిన క్లిష్టతను తగ్గించేందుకు భూ వినియోగ మార్పు అవసరాన్ని తొలగించడం, నాలా చట్టాన్ని రద్దు చేయడం వంటి నిర్ణయాలు ఇప్పటికే తీసుకోగా, భవిష్యత్తులో డిమాండ్ ఆధారిత జోనింగ్ విధానాన్ని అమలు చేసేలా లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని సీఎం స్పష్టం చేశారు. పరిశ్రమల పార్కులు, క్లస్టర్లలో భూమి వినియోగాన్ని మరింత సులభతరం చేసి, పెట్టుబడి దారులకు వేగంగా భూమి కేటాయించే విధానాన్ని బలోపేతం చేయాలని ఆదేశించారు. ఒకే నోడల్ ఏజెన్సీద్వారా అన్ని అనుమతులను ఇవ్వాలనే దిశగాఆలోచన చేయాలని సీఎం సూచించారు. ఫైర్ సేఫ్టీ, పర్యావ రణం,విద్యుత్ విద్య, ఆరోగ్య రంగాల్లోకూడా అనుమతుల సరళీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు.

# ఎపిలో ఆస్తి పన్ను చెల్లించని వారికి సువర్ణావకాశం

**విజయవాడ,ఏప్రిల్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** పట్టణ ప్రాంతాల్లో ఆస్తిపన్ను బకాయిలపై ఆస్తిపన్ను బకాయిలపై ప్రభుత్వంకీలక నిర్ణయం తీసుకుంది. 31 మార్చి 2026 నాటికి ఉన్న బకాయిలపై వడ్డీలో 50 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ రాయితీని పొందాలంటే బకాయి మొత్తం(ప్రిన్సిపల్) పూర్తిగా చెల్లించి, మిగిలిన 50 శాతం వడ్డీని ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఆస్తిపన్ను చెల్లించని వారికి గోల్డెన్ ఛాన్స్ అని చెప్పుకోవాలి.సీడీఎంఏ కమిషనర్ సంపత్ కుమార్ సూచనల మేరకు.. ఈ రాయితీ అమలు ఏప్రిల్ 30, 2026 వరకు మాత్రమే ఉండనుంది. 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలపై మాత్రమే 50 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుంది. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వెంటనే వినియోగించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నును ఏప్రిల్ 30, 2026 లోపు ముందస్తుగా మొత్తం చెల్లించేవారికి 5 శాతం అదనపు రాయితీ కూడా లభిస్తుంది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలోనూ రాయితీ అమలులో ఉండనుంది. పట్టణాభివృద్ధికి పన్నులు చెల్లించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఆలస్యం చేయకుండా వెంటనే సమీప మున్సిపల్ కార్యాలయం, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఆస్తి పన్ను చెల్లించి ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

# 18న ఇంటర్ ఫలితాలు!

**విజయవాడ,ఏప్రిల్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ పరీక్షలు ఫలితాలను ఈ వారంలోనే విడుదల చేసేందుకు ఇంటర్ బోర్డు సన్నాహాలు చేస్తోంది.తాజా సమాచారాన్ని అనుసరించి ఈ నెల 18న ఫలితాలు విడుదలయ్యే అవకాశం ఉంది.తప్పితే ఆ మరుసటి రోజైనా ఫలితాలు విడుదల చేయాలని ఇంటర్‌బోర్డు అధికార యంత్రాంగం భావిస్తోంది.ఇప్పటికి లభించిన సమాచారం మేరకు ఇంటర్ రెండు సంవత్సరాల ఫలితాలు ఒక్క రోజే విడుదలయ్యే అవకాశం ఉంది.ఫిబ్రవరి 23వ తేదీ నుంచి మొదలైన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 23వ తేదీ వరకు జరిగాయి.. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా పరీక్షల నిర్వహణకు నెల సమయం పట్టింది. దీంతో మూల్యాంకనం పూర్తి కావడంతో కొద్దిగా ఆలస్యమైంది. తాజాగా ఈ ప్రక్రియ పూర్తికావడంతో ఫలితాలను అతి త్వరలోనే ప్రకటించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. మూల్యాంకనం పూర్తవడంతో ఫలితాల విడుదలకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ప్రాసెస్ ఈనెల 16వ తేదీ నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. ఏపీ ఇంటర్ ఫలితాలతో పాటు దీనికి సంబంధించిన మరిన్ని వివరాలను ఈనాడు.నెట్‌లో ఎప్పటికప్పుడు స్పష్టంగా తెలుసుకోవచ్చు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఈనెల 18 లేదా 19వ తేదీల్లో విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# హార్ముజ్ నౌకల దిగ్బంధం

## 158 ఇరాన్ నౌకలను ముంచేశాం

## వచ్చేపోయే అన్ని నౌకలను అడ్డుకుంటున్నాం: ట్రంప్

## సముద్ర దొంగలా మారిన అమెరికాను వదలం: సయ్యద్ మాజిద్

**టెహ్రాన్ /వాషింగ్టన్, ఏప్రిల్ 13:** పాకిస్తాన్‌లో చర్చలు విఫలమైన వెనువెంటనే ట్రంప్ తన యుద్ధ కార్యాచరణ మళ్లీ షురూచేసారు. హార్ముజ్‌ను ముట్టడించాలని అమెరికా నౌకదళాలను ఆదేశించారు. జలసంధిలోకి వచ్చే నౌకలు కానీ, జలసంధినుంచి వెళ్లే నౌకలు అన్నింటినీ అడ్డుకుంటామని ట్రూత్‌సోషల్‌మీడియా పోస్టులో హెచ్చరించారు. ఇప్పటికే ఇరాన్‌కు చెందిన 158 నౌకలు ముంచివేసామని, అవి సముద్రజలాల్లో అట్టడుగున ఉన్నాయని గుర్తుచేసిన ట్రంప్ ఫాస్ట్ అటాక్ షిప్స్ అనేవి తమ టార్గెట్‌కాదని, అవి కేవలం స్వల్పసంఖ్యలోనే ఉన్నాయని పేర్కొన్నారు. నేవల్‌బ్లాకేడ్ పరిధిలోకిఈ నౌకలు వస్తే వాటినిసైతం ధ్వంసంచేయడం లేదా ముంచివేయడంజరుగుతుందని పేరొనకన్నారు. డ్రగ్ డీలర్లపై ఎలాంటి కఠిన కార్యాచరణ తీసుకున్నామో ఇపుడు ఇరాన్ నౌకలపైనా అదే చర్యలు తీసుకుంటామని అన్నారు. సముద్రమార్గాల మీదుగా అమెరికాకు డ్రగ్‌రవాణాను పూర్తిగా నిర్మూలించామని ఇపుడు హార్ముజ్‌లో ఇరాన్‌నౌకలపైనా అదే వైఖరి ఉంటుందన్నారు. ఇపుడు 98.2శాతం సముద్రమార్గంలో డ్రగ్స్ రవాణా ఆగిపోయిందని, ఇపుడు చమురుపరంగా ఇరాన్‌పైనా అదే చర్యలు తప్పవని హెచ్చరించారు.సోమవారం మధ్యాహ్నం నుంచి నేవల్‌బ్లాకేడ్‌ప్రారంభించారు. ఇరాన్ లోని పోర్టుల్లోకి వచ్చేనౌకలు కానీ,ఇరాన్‌నుంచి వెళ్లేనౌకలను కాని అన్నింటినీ అడ్డుకుంటామ న్నారు. అన్నిదేశాల నౌకలపైనా ఈ ఆంక్షలు అమలుచేస్తామని అరేబిన్ గల్ఫ్‌లోని అన్ని ఇరాన్ పోర్టుల్లోను తమ నేవల్‌బ్లాకేడ్ అమలవుతుందని సెంట్‌కామ్‌ప్రకటించింది. ఇరానేతర పోర్టులకు వెళ్లే నౌకలను హార్ముజ్ జలసంధిలో అడ్డుకోబోమని చెప్పారు.

**ఎలాంటి చర్యలకైనా మేం సిద్ధమే...ఇరాన్ రక్షణమంత్రి**

హార్ముజ్ జలసంధిని దిగ్బంధించేందుకు అమెరికా ప్రయత్నిస్తున్న వేళఇరాన్ గట్టి హెచ్చరిక జారీ చేసింది. అమెరికా అలాంటి చర్యలకు దిగితే, తాము కూడా పర్షియన్ గల్ఫ్ తీరంలోని పోర్టులను దిగ్బంధిస్తామని హెచ్చరించింది. పర్షియన్‌గల్ఫ్, ఒమన్ సముద్ర తీరంలో భద్రత ఉంటే అందరికీ ఉండాలని, లేకపోతే ఎవరికీ ఉండకూడదని పేర్కొంది. ప్రాంతీయ సముద్ర జలాల్లో రక్షణ అందరికీ ఒకేలా ఉండాలని అభిప్రాయపడింది. హార్ముజ్‌ను అమెరికా దిగ్బంధిస్తే గల్ఫ్ తీరంలోని ఏ ఒక్క పోర్టుకు రక్షణ ఉండబోదని ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ హెచ్చరించింది. తమ పోర్టుల్ని అమెరికా టార్గెట్ చేస్తే తాము గల్ఫ్ దేశాల పోర్టుల్ని టార్గెట్ చేస్తామని స్పష్టం చేసింది. ఇరాన్ రక్షణమంత్రి బ్రిగేడియర్ జనరల్ సయ్యద్‌మాజిద్ ఇబ్లిన్‌రెజా మాట్లాడుతూ ఇరాన్ ఎలాంటి పరిస్థితికైనా సిద్ధమేనని మా సాయుధదళాలు అత్యంత సామర్థ్యంతో సంసిద్ధంగా ఉన్నాయన్నారు. శత్రువులు ఎలాంటి హెచ్చరికలుచేసినా ఖాతరుచేయబోమని అన్నారు. ట్రంప్ చేస్తున్న ప్రకటనలు మిలిటరీ బ్లాకేడ్, నేవల్ బ్లాకేడ్ అనేవి అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని, నిబంధనలను ఉల్లంఘిస్తోందని, ఒకవిధంగా చెప్పాలంటే సముద్రపు దొంగగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

# తిరుమల సమాచారం



## శాస్త్రోక్తంగా భాష్యకారుల ఉత్సవం

తిరుమల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో భాష్యకారుల ఉత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. 19 రోజుల పాటు ఈ ఉత్సవం జరుగనుంది. ఏప్రిల్ 22న భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. భగవద్ రామానుజులు విశిష్టాద్వైత సిద్ధాంత పరంగా మీమాంస గ్రంథానికి "శ్రీభాష్యం" పేరుతో వ్యాఖ్యానం చేశారు. అందుకే భాష్యకారులుగా పేరొందారు. రామానుజులవారు జన్మించిన అరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాదీ శ్రీవారి ఆలయంలో భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. భాష్యకారుల ఉత్సవాల మొదటిరోజున సోమవారం శ్రీవారి ఆలయంలో మొదటి గంట అనంతరం రామానుజుల వారిని బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయ్యంగార్లు దివ్యప్రబంధ గోష్టి చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పారుపత్తేదార్ హిమత్‌గిరి, జీయర్‌స్వాములు పాల్గొన్నారు.





## గణనీయంగా పెరిగిన భక్తులు

## క్యూలైన్లలోనే దేవుడు కనిపిస్తున్నాడు

తిరుమల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య ఏటేటా పెరుగుతున్నారు, గత రెండేళ్లుగా రోజుకు సరాసరి 70 వేల మంది భక్తులు దర్శనం చేసుకోగా, ఈ ఏడాది ఆ సంఖ్య 80వేలవరకు చేరింది. సుమారు 4.57 శాతం వృద్ధి నమోదైంది. ప్రధానంగా వైకుంఠ ఏకాదశి వంటి పర్వదినాల్లో పది రోజుల వ్యవధిలోనే గతంతో పోలిస్తే అదనంగా 1.40 లక్షల మందికి దర్శనం కల్పించడం విశేషం. గత రెండేళ్లతో పోలిస్తే 2025-26లో శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2023-24, 2024-25 సంవత్సరాల్లో రోజుకు సగటున 65 వేల మంది స్వామివారిని దర్శించుకోగా, 2025-26లో ఈ సంఖ్య రోజుకు సగటున 73 వేలకు చేరింది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో రోజువారీ భక్తుల సంఖ్య 90 వేల వరకు చేరడం విశేషం. వేసవిసెలవులకు ముందే తిరుమలలో సోమవారం రద్దీ కొనసాగుతుండటంతో వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. భారీగా భక్తులు తమిళనాడు, కర్నాటక, తెలుగురాష్ట్రాలు, మహారాష్ట్రనుండి తరలిరావడంతో తిరుమలలోని వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయాయి. సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు భక్తులకు 8గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనాల భక్తులకు ఆరు గంటలు సమయం కేటాయిస్తున్నారు.





## శ్రీవారి ఆశీస్సులుండాలి

తిరుమల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగురాష్ట్రాల ప్రజలందరికీ శుభాలు కలగాలని ప్రముఖులు తెలిపారు. సోమవారం మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ వేర్వేరుగా విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారిని దర్శించుకుంటే అన్నీ శుభాలు కలుగుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ప్రజలందరికీ శ్రీవారి ఆశీస్సులు కలగాలి





తిరుమల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలని న్యాయమూర్తులు ఆకాంక్షించారు. సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ కుటుంబం, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమచక్రవర్తి కుటుంబం వేర్వేరుగా విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు వీరికి దర్శనం చేయించి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.1.01 కోట్లు విరాళం

తిరుమల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి నిర్వహిస్తున్న ప్రాణదానట్రస్ట్‌కు దాతలు విరాళాలందిస్తున్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ కు చెందిన వర్మ స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు 1,01,01,116 కోట్ల రూపాయలు విరాళంగా అందించింది. ఆ సంస్థ ఎండీ అల్లూరి వర్మ శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి విరాళం డిడిని అందజేశారు.

# పుర పోరుకు రెడీ




● వార్డులు, డివిజన్‌ల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ ప్రారంభం ● 13 నగర పాలక సంస్థలు, 87 పురపాలిక సంఘాలకు ఎన్నికలు ● ఈ నెలాఖరులోగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నియామకం ● ఆగస్టు లేదా సెప్టెంబర్‌లో నిర్వహణకు ప్రణాళిక

విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో నగర పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం పూర్వరంగం సిద్ధం చేస్తుంది. ఇప్పటికే 13 నగరపాలక సంస్థలు, 87 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో డివిజన్లు, వార్డుల పునర్‌వ్యవస్థీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. పాత, కొత్త డివిజన్లు, వార్డులకు 4 వైపులా హద్దులు నిర్ణయించాక ప్రాథమికంగా నోటిఫికేషన్ ఇచ్చి ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తారు. ఆపై మార్పులు, చేర్పులతో కలెక్టర్ ద్వారా ప్రభుత్వ తుది ఆమోదానికి పంపనున్నారు. పునర్విభజనతో డివిజన్లు, వార్డుల సంఖ్య 3,942కి పెరగనుంది. కొత్తగా 772 అందుబాటులోకి రానున్నాయి మొత్తం 87 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ప్రస్తుత వార్డుల సంఖ్య 2,445 కాగా పునర్విభజన తరువాత వార్డుల సంఖ్య 3020కి చేరనుంది. మొత్తం 575 వార్డులు పెరగనున్నాయి. 13 నగరపాలక సంస్థల్లో ప్రస్తుతం 172 డివిజన్లు ఉండగా పునర్విభజన తర్వాత వాటి సంఖ్య 922 కానుంది. రాష్ట్రంలో 23 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీలకు సంబంధించి కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నందున వాటికి ప్రస్తుతానికి ఎన్నికలు నిర్వహించకపోవచ్చని తెలుస్తోంది.

చుట్టూ పంచాయతీలు, గ్రామాలను పుర, నగరపాలక సంస్థల్లో గత పుర ఎన్నికల ముందు విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ పలువురు కోర్టుల్లో కేసులు వేశారు. ఇవి పరిష్కారమయ్యాక వీటిలో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేకంగా నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా ఎవర్ని నియమిస్తారన్న దానిపైనా ఆసక్తి నెలకుంది. త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్న ఒక ఐఏఎస్ పేరు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. నెలాఖరులోగా కొత్త కమిషనర్‌ను నియమించే అవకాశాలున్నాయి. రాష్ట్రంలో 12 నగరపాలక సంస్థలు, 75 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం ఈ ఏడాది మార్చి 17తో ముగిసింది. మరో నగరపాలక సంస్థ, ఇంకో 12 పురపాలక, నగర పంచాయతీల్లో పాలకవర్గం పదవీకాలం నవంబరులో ముగియనుంది. పురపాలక ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది. ఆగస్టు, సెప్టెంబరులో ఎన్నికలు నిర్వహించాలన్న యోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే డివిజన్లు, వార్డుల పునర్విభజనకు నోటిఫికేషన్లు వేర్వేరుగా ఇటీవల జారీ చేసింది. ముందు నిర్ణయించిన ప్రకారం ఈ నెలాఖరుతో ప్రక్రియ పూర్తి చేయాలి.

అధికారులు, సిబ్బంది జనగణన ఏర్పాట్లలో ఉన్నారన్న పురపాలక, నగరపాలక సంస్థల విజ్ఞప్తిపై వచ్చే నెలాఖరు వరకు గడువు పెంచారు. పునర్విభజనపై కొన్ని చోట్ల క్షేత్రస్థాయిలో రెండు రోజుల క్రితం పరిశీలన ప్రారంభమైంది. మిగిలిన చోట్ల రెండు, మూడు రోజుల్లో మొదలు కానుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రస్తుత ఒక్కో డివిజన్, వార్డుని రెండుగా విభజించొచ్చని అంచనా. విశాఖ పట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి, కడప నగరపాలక సంస్థల్లో డివిజన్లు కొత్తగా 20 వరకు పెరగనున్నాయి. బిసిల గణన కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ వచ్చే నెలలో నివేదిక ఇవ్వనుంది. దీని ఆధారంగా వార్డులు, డివిజన్ స్థానాలకు ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. వార్డులు, డివిజన్ల వారీగా ఓటర్ల జాబితాల తుది ప్రచురణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలు నెలాఖరులోగా కొలిక్కి రానున్నాయి. ఓటర్ల జాబితాల 2026 మార్చి 9న ప్రచురించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం పురపాలకశాఖను ఆదేశిస్తూ ఫిబ్రవరి 6న నోటిఫికేషన్ ఇచ్చింది. కొంత సమయం కావాలన్న ఆ శాఖ విజ్ఞప్తిని రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతించింది. ఓటర్ల జాబితాల ప్రచురణకు మరోసారి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది.

# జగన్ రాజకీయ అస్థిరతకు మావిగన్ నూతన నాటకం

● మంత్రి సత్యకుమార్ యాదవ్



అనంతపురం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త బ్యూరో: రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయ ధోరణిపై ఘాటుగా స్పందించారు. రాష్ట్ర భవిష్యత్తుతో ముడిపడిన రాజధాని అంశంలో స్థిరత్వం లేకుండా వ్యవహరించడం దురదృష్టకరమని మంత్రి పేర్కొన్నారు. అసెంబ్లీ సాక్షిగా అమరావతినే రాజధానిగా ప్రకటించిన జగన్‌రెడ్డి, అనంతరం మూడు రాజధానుల పేరుతో గందరగోళానికి తెరతీసి, ఇప్పుడు మావిగన్ అనే కొత్త భావనను ముందుకు తేవడం ఆయనలోని అస్థిరతకు నిదర్శనమని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. మావిగన్ వంటి అసంబద్ధమైన ఆలోచనలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతోందని, ఇది రాష్ట్రాన్ని హాస్యాస్పదంగా మారుస్తోందని మంత్రి ఆక్షేపించారు. ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ విధానాలపై చర్చ జరుగుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రతిష్ట దెబ్బతింటోందని పేర్కొన్నారు. మూడు రాజధానుల పేరుతో ఉత్తరాంధ్రకు ఎలాంటి అభివృద్ధి జరగలేదని మంత్రి విమర్శించారు. విశాఖ పట్నంలో రూ.500 కోట్ల ప్రజాధనంతో వ్యక్తిగత నివాసం నిర్మించుకోవడం తప్ప, ఒక్క పరిశ్రమ కూడా రాకపోవడం దురదృష్టకరమన్నారు. అదే విధంగా రాయలసీమకు జ్యుడీషియల్ క్యాపిటల్ పేరుతో ఇచ్చిన హామీలు అమలు కాలేదని, హైకోర్టు తరలింపు లేదా బెంచ్ ఏర్పాటుపై కేంద్రానికి ఎలాంటి ప్రతిపాదనలు పంపకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సూచిస్తోందన్నారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధి విషయంలో కూడా జగన్‌రెడ్డి విఫలమయ్యారని, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, మౌలిక వసతులపై ఎటువంటి పురోగతి లేకపోవడం ప్రజలను నిరాశకు గురిచేసిందన్నారు. గండికోట నిర్వాసితులకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకపోవడం ఆయన పాలనలోని అసమర్థతను బయటపెడుతుందని మంత్రి విమర్శించారు. ఇక అమరావతి నిర్మాణం వేగంగా సాగుతుండటాన్ని జీర్ణించుకోలేక, దానిని అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని మంత్రి ఆరోపించారు.

## నేడు విజయవాడలో అంబేడ్కర్ జయంతి రాష్ట్ర స్థాయి వేడుకలు

విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా. బి.ఆర్. అంబేడ్కర్ 135 వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏప్రిల్ 14, 2026 మంగళవారం ఉదయం 11.30 గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళా క్షేత్రంలో రాష్ట్ర స్థాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు బి. లావణ్య వేణి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తోపాటు ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొని డా. అంబేడ్కర్ కి నివాళులు అర్పించనున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో కూడా అంబేడ్కర్ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు బి. లావణ్య వేణి ఆ ప్రకటనలో తెలియజేశారు.

# ముగిసిన నిందితుల పోలీస్ కస్టడీ

● 20 వరకు రిమాండ్ పొడిగింపు ● ఉగ్ర లింక్‌ల కేసు

● మరింత సమాచారం కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు

విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో కలకలం రేపిన ఉగ్రవాద సంబంధాల కేసులో ఆరుగురు నిందితుల పోలీస్ కస్టడీ నేటితో ముగిసింది. గత ఐదు రోజులుగా పోలీసుల విచారణలో ఉన్న నిందితులను అధికారులు క్షుణ్ణంగా ప్రశ్నించి, కీలక సమాచారాన్ని సేకరించినట్టు సమాచారం. నిందితులను ఐదు రోజుల పాటు ప్రత్యేక బృందాలు విచారించాయి. ఈ విచారణలో ప్రధానంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌ల ద్వారా ఉగ్రవాద భావజాలాన్ని ఎలా వ్యాప్తి చేస్తున్నారు, ఎవరెవరిని సంప్రదిస్తున్నారు అనే అంశాలపై ఆరా తీసినట్టు తెలుస్తోంది. ఈ కార్యకలాపాలకు నిధులు ఎక్కడి నుండి అందుతున్నాయి? విదేశీ లింకులు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో విచారణ సాగినట్టు సమాచారం. వారి తదుపరి ప్రణాళికలు ఏమిటి? రాష్ట్రంలో ఏవైనా విచ్ఛిన్నకర చర్యలకు ప్లాన్ చేశారా? అన్న విషయాలపై పోలీసులు ప్రశ్నలు కురిపించారు. కస్టడీ గడువు ముగియడంతో, పోలీసులు నిందితులను వైద్య పరీక్షల అనంతరం విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. నిందితుల నుంచి సేకరించిన ప్రాథమిక ఆధారాలను, విచారణ నివేదికను పోలీసులు న్యాయమూర్తికి సమర్పించారు.

పోలీసుల వాదనలను విన్న న్యాయస్థానం, నిందితులకు ఏప్రిల్ 20 వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పోలీసులు వారిని తిరిగి జైలుకు తరలించారు. ఈ కేసులో మరింత సమాచారం కోసం నిందితుల డిజిటల్ పరికరాలను (ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు) ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు తెలుస్తోంది. విజయవాడ చేరుకునే సరికే బాగా ఆలస్యమైంది. దీంతో మొదటి రోజు పోలీసులు ప్రాథమిక వివరాల సేకరణకే పరిమితమయ్యారు. నిందితుల కుటుంబ నేపథ్యం గురించి తొలుత అడిగి తెలుసుకున్నారు. వారి కార్యకలాపాలు ఇంట్లో వారికి తెలుసా? అని ప్రశ్నించినట్లు సమాచారం. జిహాదీ భావజాలానికి అనుకూలంగా ఎందుకు పోస్టులు పెట్టారని వారిని ప్రశ్నించారు.

ఇస్లాం రాజ్య స్థాపన కోసం పోరాడాలన్న విదేశీ హ్యాండ్లర్ల మాటలు తమను ప్రభావితం చేశాయని విచారణలో వెల్లడించారు. బెనెక్స్ గ్రూప్ ఏర్పాటు, క్రియాశీలకంగా వ్యవహించిన ఢిల్లీకి చెందిన లక్కీ అహ్మద్‌ను పలు ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయి? ఆన్‌లైన్‌లో ఉగ్ర భావజాలం వ్యాప్తి కోసం డబ్బులు అందాయా? అని ప్రశ్నించారు. షకూర్‌తో ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయన్నది నిందితులను అడిగి తెలుసుకున్నారు. అతని నుంచి ఎటువంటి ఆదేశాలు వచ్చేవి? అన్నది పోలీసులు, సిఐ సెల్ అధికారులు ప్రశ్నించి జవాబులు రాబట్టారు. అరెస్టు అయిన నిందితుల్లో ఒక మైనర్ కూడా ఉన్నాడు. ప్రస్తుతం విజయవాడ శివారులోని జువైనల్ హోమ్‌లో ఉన్నాడు.

# తిరుమల లగేజీ కేంద్రాల్లో వసూల్‌రాజాలు

## - భక్తుడి ఫిర్యాదుతో తొలగింపు

తిరుమల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: భక్తులకు సేవాభావంతో సేవలందించాల్సిన కొందరు ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేతివాటం చూపుతున్నారు. ఇప్పటికే తిరుమలలో కల్యాణకట్టలో ఓ అధికారి ఏకంగా వసూల్‌రాజా అవతారమెత్తి పై అధికారుల వరకు వసూలుచేసిన ముడుపులు అందుతూన్నాయనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఏడేళ్ళుగా ఆ అధికారి అక్కడే తిష్టవేసినా అడిగే వారే లేరంటే టిటిడిలో తిరుమలలో విజిలెన్స్ విభాగం పనితీరు ఏపాటిదో అర్థమవుతుంది. తాజాగా తిరుమలలోని లగేజీ కౌంటర్ లో భక్తుల నుండి డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని విధుల నుండి తొలగించడంతో సంచలనంగా మారింది. తిరుమలలో లగేజీ సెంటర్‌లో నరసింహారెడ్డి అనే వ్యక్తి భక్తుల నుండి డబ్బులు వసూలు చేసినట్లు భక్తులు టిటిడి దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో అతనిని విధుల నుండి తొలగించారు. లగేజీ డిపాజిట్, తిరిగి ఇచ్చే సేవలను టిటిడి పూర్తిగా ఉచితంగా అందిస్తోంది. భక్తులెవ్వరూ తమ లగేజీ కోసం డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని టిటిడి విజ్ఞప్తి చేస్తోంది. నిబంధనలను అతిక్రమించి ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే విజిలెన్స్ కంట్రోల్ నెంబర్ 98668 98630కు ఫిర్యాదు చేయాల్సిందిగా భక్తులకు విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా తిరుమలతో పాటు కాలినడక మార్గాల్లో కలిపి



మొత్తం 80 లగేజీ కౌంటర్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 394 మంది సిబ్బంది మూడు షిఫ్టుల్లో నిరంతరంగా సేవలందిస్తున్నారు. భక్తులు దర్శనం, సేవలు, కాలినడక యాత్ర సమయంలో తమతో తీసుకువచ్చే లగేజీ, బ్యాగులు, సెల్ ఫోన్లను భద్రంగా ఉంచుకునేందుకు ఈ కౌంటర్లు అందుబాటులో ఉన్నాయి.

## నిధి పోర్టల్ ద్వారానే పెన్షన్ ప్రాసెసింగ్

## కీలక ఉత్తర్వులు జారీ!

విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షన్ల మంజూరు ప్రక్రియలో పారదర్శకతను పెంచేందుకు, జాప్యాన్ని తగ్గించేందుకు మరో కీలక అడుగు వేసింది. ఇకపై రాష్ట్రంలోని అన్ని రకాల పెన్షన్ కేసులను నిధి పోర్టల్ ద్వారా మాత్రమే ప్రాసెస్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫిజికల్ అప్లికేషన్లకు స్వస్తి చెప్పి, మే 1 నుంచి ఈ కొత్త రూల్ అమలు చేయబోతోంది. ప్రస్తుతం కొనసాగుతున్న కాగితపు దరఖాస్తుల విధానానికి ప్రభుత్వం గడువు విధించింది. ఏప్రిల్ 30, 2026 వరకు అందిన ఫిజికల్ పెన్షన్ ప్రపోజల్స్‌ను మాత్రమే అధికారులు అంగీకరిస్తారు. మే 1, 2026 నుంచి ఎటువంటి పేపర్ అప్లికేషన్లను స్వీకరించబోమని ప్రభుత్వం చెప్పింది. ఆ తేదీ తర్వాత వచ్చే పెన్షన్ దరఖాస్తులన్నీ తప్పనిసరిగా నిధి పోర్టల్ ద్వారానే ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. వివిధ శాఖల్లో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఫిజికల్ దరఖాస్తులన్నింటినీ ఏప్రిల్ 30లోపు సంబంధిత కార్యాలయాలకు సమర్పించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. పెన్షన్ ప్రాసెసింగ్‌లో వేగం పెంచడమే లక్ష్యంగా తెచ్చిన ఈ డిజిటల్ విధానం వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయి. ఫైల్ ఏ స్టేజ్‌లో ఉందో అభ్యర్థులు ఆన్‌లైన్‌లోనే తెలుసుకోవచ్చు. కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, డిజిటల్ పద్ధతిలో వేగంగా ఆమోదం పొందే అవకాశం ఉంటుంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు సేవలు అందుతాయి. ఈ కొత్త విధానంపై అన్ని ప్రభుత్వ శాఖల అధిపతులకు, జిల్లా అధికారులకు ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. ఉద్యోగులు పదవీ విరమణ పొందే ముందే వారి పెన్షన్ పేపర్లను నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది రిటైర్డ్ ఉద్యోగులకు, పెన్షనర్లకు మేలు చేకూరనుంది. పెన్షన్ మంజూరులో ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులను తొలగించి, సిస్టమ్‌ను మరింత బలోపేతం చేయడమే ఈ ఉత్తర్వుల ప్రధాన ఉద్దేశంగా పేర్కొన్నారు.

## ఖాళీ గోనె సంచుల సేకరణకు ఈటెండర్ల ఆహ్వానం

తిరుమల, ఏప్రిల్ 13 ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయం,ఇతర అనుబంధ ఆలయాలలో ఏప్రిల్ 1 నుండి 2027 మార్చి 31వ తేదీ వరకు వినియోగించిన ఖాళీ గోనె సంచుల సేకరణకు ఆసక్తి గల వ్యక్తులు, సంస్థల నుండి ఈటెండర్లు ఆహ్వానిస్తుంది. టెండర్‌లో పాల్గొనదలచిన వారు ఈకొనుగోలు పోర్టల్ ద్వారా 75వేలు ఇఎండి చెల్లించి తమ దరఖాస్తులను ఏప్రిల్ 22వ తేదీ సాయంత్రం 5 గం.లలోపు సమర్పించాలి. పూర్తి వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. కొనుగోలు. ఎపి. జివొవి.ఇన్ వెబ్‌సైట్‌లలో గానీ, కార్యాలయ సమయాల్లో తిరుపతిలోని మార్కెటింగ్ విభాగం జనరల్ మేనేజర్(వేలం) ఫోన్ నెంబర్ 0877 2264429లో గానీ సంప్రదించగలరు.

## మిరాకిల్ భూ ఆక్రమణలపై విచారణ జరిపించండి

● జిల్లా కలెక్టర్‌కు ముంజేరు వాసి ఫిర్యాదు

బొబ్బిలి/విజయనగరం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముంజేరు గ్రామంలో ఉన్న మిరాకిల్ సాఫ్ట్వేర్ సొల్యూషన్ సంస్థ యాజమాన్యం భూఆక్రమణలకు పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డికి ముంజేరు గ్రామవాసి పిడుగు నాగరాజు ఫిర్యాదు చేశారు. ప్రస్తుత నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే లోకం నాగమాధవి గతంలో స్థానికులకు ఉపాధి కల్పిస్తామని చెబుతూ మిరాకిల్ సంస్థ పేరుతో కారు చౌకగా రైతులు వద్ద నుంచి కొన్ని వందల ఎకరాల భూములను కొట్టేసారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రైతుల వద్ద నుంచి కారు చౌకగా కొట్టేసిన భూములలో సహజ సిద్ధంగా ఉన్న వాగులు, గెడ్డలు ప్రజలు ఉపయోగించే రస్తాలను సైతం వదలకుండా మిరాకిల్ సంస్థ తన గుప్పెట్లోకి తీసుకుందని, వివిధ అనుబంధ కంపెనీల పేర్లను అడ్డుపెట్టుకొని కోట్లు విలువచేసే సుమారు 14.50 ఎకరాల భూములను స్వాహా చేశారని అందులో పేర్కొన్నారు. ప్రజా అవసరాలకు వినియోగించాల్సిన వాగులు, రస్తాలను ఆక్రమించి సామాన్యులకు ఇబ్బంది కలిగిస్తున్న మిరాకిల్ సంస్థ పై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులతో ప్రభుత్వ ఆక్రమిత భూములపై సమగ్ర విచారణ జరిపించి, ఆక్రమిత భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని జిల్లా కలెక్టర్‌తో పాటు సిఎం పేషీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ మంత్రి, సిసిఎల్ఏ అధికారులకు ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కుంభకోణంపై ప్రభుత్వం ఏ రకంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నిట్ నెం. 01/2026-27/ఇ.ఇ/గి.సం./డి.బి/ తేది: 07.04.2026
శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం, పలాస గ్రామములో GTW PMH మరుగుదొడ్ల నిర్మాణ పనికి అంచనా విలువ : రూ.12.00 లక్షలకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్ షెడ్యూలు ప్రారంభ తేది: 16.04.2026, సా.4.00గం.ల తరువాత. ఇతర వివరాలను www.apeprocurement.gov.in లో చూడవచ్చును. ఫోన్ నెం. 9440378568.
సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు, గిరిజన సంక్షేమము, సీతంపేట.
DIPR.NO. 20101/CL/ADVT/1/1/2022-23 తేది: 13.04.2026

BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
Gr. & 1st Floor, Sri Narayana Bhavan, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.
O.A. 165/2026
Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (procedure) Rules, 1993.
Indian Bank, Srikakulam Branch
Vs
Sri Putta Venkata Giri and Others
To:
D1 - Sri Putta Venkata Giri, S/o Satyanarayana, resident of D.No.72-2, Visakha A Colony, Peddapadu Road, Srikakulam-532001.
D2 - Smt Putta Sireesha, W/o Putta Venkata Giri, D.No.72-2, Visakha A Colony, Peddapadu Road, Srikakulam-532001.
D3 - Sri Polaki Suryanarayana, S/o Late Bheema Rao, resident of Flat No-403, Tiruamala Enclave, Visakha B Colony, Srikakulam.
PAPER PUBLICATION
WHEREAS, O.A. No.165 / 2026 is listed before Hon'ble Presiding officer/ Registrar on 13.05.2026.
WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons / notice on the said Application under Section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs.38,79,836/- (application along with copies of documents etc., annexed)
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:-.
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) To disclosed particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original applications;
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Presiding Officer/Registrar on 13-05-2026 at 10:30 A.M. failing the application shall be heard and decided in your absence.
Given under my hand and the seal of this Tribunal on this 10th day of April, 2026 at Visakhapatnam
Sd/- Signature of the Officer
Authorised to issue Summons
Registrar, Debts Recovery Tribunal, Visakhapatnam

## 5 ఏటిఎంలలో రూ.87 లక్షలు చోరీ

● సిఎంఎస్ కస్టోడియన్ దొంగలించినట్లు ఫిర్యాదు

● కేసు నమోదు... దర్యాప్తు చేస్తున్న పిడుగురాళ్ల సిఐ



నిందితుడు నరేష్

పిడుగురాళ్ల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: ఏటీఎం లలో నగదు ఏర్పాటు చేసే ఉద్యోగి ఆ నగదును దొంగలించిన వైనం సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. సంఘటనకు సంబంధించి పిడుగురాళ్ల పట్టణ సిఐ శ్రీరామ్ వెంకట్రావు తెలిపిన వివరాల మేరకు పిడుగురాళ్ల పట్టణ లోనే ఎస్బిఐ బ్రాంచ్ కు చెందిన నాలుగు ఏటీఎంలలో అలాగే సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కు చెందిన ఒక ఏటీఎంలో మొత్తం ఐదు ఏటీఎంలలో శుక్రవారం రూ. 48 లక్షలు ఉదయం సమయంలో తోటి సిబ్బందితో సిఎంఎస్ గుంటూరు బ్రాంచ్ కు చెందిన కస్టోడియన్ మామిడి నరేష్ అనే ఉద్యోగి డిపాజిట్ కోసం ఏటీఎంలో నగదును పెట్టారు. అతనితోపాటు తోటి ఉద్యోగులు కూడా ఉండటంతో తెలివిగా ఏటీఎంలలో నగదును ఏర్పాటు చేసి వాటికి లాక్ వేయకుండా తోటి ఉద్యోగుల తో పాటు తిరుగు ప్రయాణం అయ్యాడు. ఇంతలోనే వేరే పని ఉందని చెప్పి గుంటూరుకు వెళ్లకుండా మార్గమధ్యంలోనే దిగాడు. తోటి ఉద్యోగులు గుంటూరు వెళ్లిపోయారు. ఆ తరువాత మామిడి నరేష్ అనే కస్టోడియన్ తిరిగి ఏటీఎంలకు వచ్చి ఎస్ బి ఐ బ్రాంచ్ కు చెందిన నాలుగు ఏటీఎంలలో, సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా కు చెందిన ఒక ఏటీఎంలో, మొత్తం ఐదు ఏటీఎంలో ఉన్న రూ. 87 లక్షల కు పైగా నగదును ఏటీఎంలలో నుంచి తీసుకొని పురారయ్యాడు. ముందుగా ఏటీఎంలో ఏర్పాటుచేసిన రూ. 48 లక్షలు, అంతకుముందు ఏటీఎంలో ఉన్న మిగిలిన నగదుతో కలిపి మొత్తం రూ.87 లక్షలకు పైగా ఉన్న నగదును అపహరించి పరారయ్యాడు. ఏటీఎంలకు అన్నిటికీ లాక్కులు వేయకుండా ముందుగానే పథకం రచించుకున్న నరేష్ అతని పథకం ప్రకారం తిరిగి వచ్చి ఏటీఎంలలో ఉన్న నగదు మొత్తాన్ని అపహరించి కూడా ఉడాయించాడు. ఏటీఎంలో నగదు రాకపోవడంతో పలువురు బ్యాంకు కస్టమర్లు ఆయా బ్యాంకు మేనేజర్లకు సమాచారం ఇవ్వడంతో వారు గుంటూరు కు చెందిన సిఎంఎస్ బ్రాంచ్ మేనేజర్కు సమాచారం తెలిపారు. దీంతో ఏటీఎంలో ఉన్న నగదు ఏమయ్యాయని పరిశీలించడంతో ఏటీఎంలో ఉన్న సీసీ ఫుటేజ్ ఆధారంగా సిఎంఎస్ కస్టోడియన్ మామిడి నరేష్ నగదును అపహరించినట్లు సిసిఫుటేజిలో కనిపించిందని తెలిపారు. సమాచారం తెలుసుకున్న సిఎంఎస్ కంపెనీకి చెందిన గుంటూరు బ్రాంచ్ మేనేజర్ సిహెచ్ అనిల్ కుమార్ పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్కు వచ్చి కస్టోడియన్ నరేష్ పై ఫిర్యాదు చేశారు. సిఎంఎస్ కంపెనీ గుంటూరు బ్రాంచ్ మేనేజర్ ఫిర్యాదు మేరకు పట్టణ సిఐ శ్రీరామ్ వెంకట్రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## డబ్బులు దొంగలించిన కేసులో నిందితుడికి యేడాది జైలు

విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: అమాయక ప్రజలను ఏమార్చి డబ్బులను దొంగలించిన కేసులలో నిందితునికి ఏడాది సాధారణ జైలు శిక్ష,జరిమానా న్యాయస్థానం విధించింది.ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్ పరిధిలోని వన్ టౌన్ స్టేషన్ పరిదిలోని వస్త్రాలత కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ఎస్.బి.ఐ.ఏ.టి.ఎం దగ్గర ఈ ఘటన జరిగింది. ఇదే తరహాలో మరో రెండు ప్రదేశాలలో ఘటనలు చోటు చేసుకున్నారు.భవానీపురం పోలీస్ స్టేషన్ కేసులలో విజయవాడ ఇబ్రహీంపట్నం ఏ కాలని గ్రామానికి చెందిన పుసులూరు సురేష్ బాబు నిందితుడిగా గుర్తించారు.అతని పై నేరం ౣరుజువు కావడంతో సోమవారం చీఫ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి బెజవాడ, రాధా రాణి ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష., రూ.2000/- జరిమానా విధిస్తూ తీర్పునివ్వడం జరిగింది. నిందితుడు విజయవాడ ఇబ్రహీంపట్నం ఏ.కాలని గ్రామానికి చెందిన పుసులూరు సురేష్ బాబు ఏ.టి.ఎం.ల వద్ద డబ్బులు తీసుకునేవాడిలాగా ఉంటూ ఏ.టి.ఎం. ల వద్దకు వచ్చిన అమాయక ప్రజల ఏ.టి.ఎం కార్డులను మార్చి వాటిల్లోని నగదును కొట్టేస్తుంటాడు. ఈ క్రమంలో వన్ టౌన్ భవానీపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో ముగ్గురు వ్యక్తులు ఏ.టి.ఎంల వద్ద డబ్బులు తీసుకోవడానికి రాగా వారిని ఏమార్చి వారి ఏ.టి.ఎం కార్డులను మార్చి వారి డబ్బులను కొట్టేసాడు. ఈ దర్యాప్తులో భాగంగా నిందితుడు పుసులురు సురేష్ బాబును 24.01.2019 తేదీన అరెస్ట్ చేసి న్యాయస్థానం నందు హాజరుపరిచిన పోలీసులు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.శివ ప్రసాద్ సి.యమ్.ఎ06.08.2018 తేదీనస్.ఇన్స్పెక్టర్ పి.జగదీశ్వరరావు, ప్రస్తుత వన్ టౌన్ ఇన్స్పెక్టర్ గుణారామ్, భవానీపురం ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వర రావు, సి.ఎం.ఎస్. సిబ్బంది పర్యవేక్షణలో 16 మంది సాక్షులను విచారించడం జరిగింది.

## సిపిని కలిసిన నూతన ట్రాఫిక్ ఎసిపి వేధా

విజయవాడ ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సాధారణ బదిలీల నేపథ్యంలో డి.జి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డా.వేధాని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లోని ట్రాఫిక్ ఏ.సి.పి.గా బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం డా.వేధా ఆమె కార్యాలయం నందు బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్.వి. రాజశేఖర బాబు, ఐ.పి.ఎస్‌ని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించినారు.

## శుభకార్యానికి వెళ్లి వస్తూ... ఒకరి మృతి

విజయవాడ ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై ఉయ్యూరు వద్ద సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండవల్లి మండలం కానుకొల్లు గ్రామానికి చెందిన 8 మంది హైదరాబాద్‌లోని ఓ శుభకార్యానికి వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో వీరి కారు ఉయ్యూరు వ్ద రోడ్డు పక్కన ఉన్న స్తంభాలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పెద్దింటి సూరి అక్కడిక్కడే మృతి చెందగా మరో ఏడుగురికి గాయాలయ్యాయి. వీరిలో కీర్తన, మధు అనే మహిళల పరిస్థితి విషమయంగా ఉంది. క్షతగాత్రులను చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఉయ్యూరు పట్టణ ఎస్సై లోకేశ్వరి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బాధితుల పరువు గురించి ఆలోచించరా?: టిజెఆర్

విజయవాడ ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు అన్నారు. ప్రత్యర్థి పార్టీల వారిని వేధించడానికే అన్నట్టుగా ఆ వ్యవస్థ నడుస్తోందని ఆరోపించారు. డీజీపీ, కొందరు ఎస్పీలు, సీఐలు పనిగట్టుకుని మరీ జులుం ప్రదర్శిస్తున్నారని చెప్పారు. తాడేపల్లిలో టీజేఆర్ సుధాకర్ బాబు మాట్లాడు తూ చినేరస్థులను వదిలేసి వైఎస్సార్‌సీపీ క్యాడర్ వెంట పడుతున్నారు. రాష్ట్రంలో గుడ్ గవర్నెన్స్ అనేదే లేకుండా పోయింది. గత రెండేళ్లుగా రాజకీయ కక్షసాధింపులు జరుగుతూనే ఉన్నాయి. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి, వేధిస్తున్నారు. బాధితుల మనోభావాలు, పరువు-ప్రతిష్ట గురించి ఆలోచించరా? పోలీసు వ్యవస్థను జేబు సంస్థగా మార్చుకున్న చంద్రబాబు చెంపలేసుకోవాలి. కోర్టు ఆదేశాలను సైతం పోలీసు అధికారులు పట్టించుకోవటం లేదు. పోలీసులకు చిత్తశుద్ధి ఉంటే మహిళను మోసం చేసిన అరవ శ్రీధర్ ను ఎందుకు అరెస్టు చేయలేదు? ఎస్పీ ఆఫీసులో దూరిన ఎమ్మెల్యే అరవిందబాబుపై ఎందుకు చర్యలు తీసుకోలేదు?“ అని నిలదీశారు.

## రాష్ట్ర కేబినెట్ అజెండా తయారీ, మెమోల సమర్పణకు

# నూతన టైమ్‌లైన్స్

### - ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర మంత్రివర్గ సమావేశాల నిర్వహణలో పారదర్శకత, సమయ పాలనను పెంచే దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్ర కేబినెట్ ఎజెండా తయారీ, మెమోల సమర్పణకు సంబంధించి నూతన టైమ్‌లైన్స్‌ను విధిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై కేబినెట్ సమావేశం జరగడానికి ఒకరోజు ముందు ఉదయం 11 గంటల లోపు అన్ని శాఖల మంత్రులు/అధికారులు తమ ప్రతిపాదనలను సమర్పించాల్సి ఉంటుంది. నిర్ణీత గడువు దాటిన తర్వాత వచ్చే ఎటువంటి ప్రతిపాదనలను ఎజెండాలో చేర్చబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది. శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం, ముఖ్యమంత్రి ఆమోదంతో కేబినెట్ ఎజెండాను ఫైనలైజ్ చేస్తారు. అత్యంత అసాధారణమైన లేదా అత్యవసరమైన అంశాలను మాత్రమే ముఖ్యమంత్రి అనుమతితో టేబుల్ ఐటమ్స్ గా చివరి నిమిషంలో చర్చకు అనుమతిస్తారు. ప్రభుత్వ రహస్యాల భద్రత, పారదర్శకతను దృష్టిలో ఉంచుకుని, ఎజెండా పంపిణీ విధానంలో పెను మార్పులు చేశారు. ఇకపై కేబినెట్ ఎజెండాను వాట్సాప్ లేదా ఇతర సోషల్ మీడియా గ్రూపుల ద్వారా పంపిణీ చేయకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. పూర్తి సమాచారాన్ని ఈ - క్యాబినెట్ పోర్టల్ ద్వారా మాత్రమే మంత్రులకు, సంబంధిత అధికారులకు అందుబాటులో ఉంచుతారు. గతంలో ఎజెండా తయారీలో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు ఈ కఠిన నిబంధనలు అమలులోకి తెచ్చారు. దీనివల్ల మంత్రులకు కూడా చర్చించాల్సిన అంశాలపై ముందుగానే పూర్తి అవగాహన ఏర్పడే అవకాశం ఉంటుంది. పాలనలో వేగం పెంచడం, సాంకేతికతను జోడించడం ద్వారా నిర్ణయాల ప్రక్రియను మరింత పటిష్టం చేయడమే ఈ మార్పుల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. అన్ని శాఖల కార్యదర్శులు ఈ నూతన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని ప్రభుత్వం మెమోలో ఆదేశించింది.

## నూతన యుగం దిశగా అమరావతి 'క్వాంటమ్'

● ముఖ్యమంత్రి కలల సాకారం... చరిత్రాత్మక దినం: మంత్రి సత్యకుమార్

సచివాలయం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: భవ్య రాజధాని నిర్మాణం దిశగా వడివడిగా అడుగులు వేస్తున్న అమరావతి ఆధునిక యుగానికి అత్యంత కీలకమైన క్వాంటమ్ కంప్యూటింగ్ దిశగా బలమైన అడుగులు వేయనుండడం పట్ల వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ దిశగా ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు క్వాంటమ్ రిఫరెన్స్ ఫెలిసిటీలను ప్రారంభించడం దేశ చరిత్రలోనే మరో చారిత్రాత్మక సంఘటన అని మంత్రి అభివర్ణించారు. రాష్ట్ర, దేశ ప్రజల ప్రయోజనాల కోసం ఎంతో ముందు చూపుతో అమరావతిని క్వాంటమ్ వ్యాలీగా రూపొందించాలని సంకల్పించిన ముఖ్యమంత్రి అనతికాలంలోనే ఆ దిశగా రెండు క్వాంటమ్ బెడ్లను ప్రారంభించి, ప్రపంచ వ్యాప్తంగా స్వదేశీ విజ్ఞాన పటిమను, అమరావతి ఖ్యాతిని ఎలుగెత్తి చాటనున్నారని మంత్రి ప్రశంసించారు. ఈ శీఘ్ర ప్రగతిని ఎవరూ ఊహించలేదని మంత్రి వ్యాఖ్యానించారు. అకుంఠిత దీక్షతో, నిబద్ధతతో ఈ విజయాన్ని సాధించి చూపినందుకు ముఖ్యమంత్రిని మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు. తెలుగు ప్రజలు గర్వించదగిన శుభదినం అని ఆయన అన్నారు. రాష్ట్రానికి సహకరించిన ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి, పలు సంస్థలకు, శాస్త్రవేత్తలకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు.

## పండగలా కొండపల్లి బొమ్మల మేళా

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి లక్ష్మీశ

విజయవాడ ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: ఎన్టీఆర్ జిల్లా సాంస్కృతిక వైభవానికి నిలిచే కొండపల్లి బొమ్మల మేళా ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు. ఈ మేళాను ప్రతి సంవత్సరం నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ఆయన వెల్లడించారు. కలెక్టర్ లక్ష్మీశ సోమవారం కొండపల్లి బొమ్మల ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో కొండపల్లి బొమ్మల మేళాపై మీడియా సమావేశం నిర్వహించారు. కొండపల్లిబొమ్మలు రాష్ట్రానికి మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన సంప్రదాయ కళలలో ఒకటని ప్రపంచ వారసత్వ దినోత్సవం అయిన ఈ నెల 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కొండపల్లి బొమ్మల మేళాను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రకటన శాఖ అధికారి ఎ.శిల్ప, కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఆర్‌టీఐహెచ్ విజయవాడ సీఈవో జి.కృష్ణన్, జిల్లా అటవీ శాఖ అధికారి సతీష్, వివిధ శాఖల అధికారులు, కొండపల్లి ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలప్పుడే మహిళా బిల్లు గుర్తుకొచ్చిందా?

### - సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలోనే ఆకస్మాత్తుగా మహిళా రిజర్వేషన్ల అమలు గుర్తుకు వచ్చిందా? అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. 2023లోనే చట్టమైన ఈ బిల్లు మూడేళ్ల తర్వాత గుర్తుకు వచ్చిందని, ఇది మహిళాలను మోసం చేయడమేనని చెప్పారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆ పార్టీ కేంద్రకమిటీ సభ్యులు కె. లోకనాథంతో కలిసి శ్రీనివాసరావు సోమవారం విలేకరులతో మాట్లాడారు. 2024 ఎన్నికల నుండి మహిళా ర్రిర్వేషన్లు అమలు చేయాలని 2023లో చట్టమవుతున్న సమయంలోనే సిపిఎం డిమాండ్ చేసిందని గుర్తుచేశారు. నియోజకవర్గాల పునర్విభజన, సీట్లు పెంపు, జనాభా లెక్కల సేకరణ తర్వాత చేస్తామని ఆ సమయంలో కేంద్రం దాటవేసిందని గుర్తు చేశారు. చట్టం చేసి మురిపించి అమలు జరపకుండా ఉద్దేశపూర్వకంగానే ప్లాన్ ప్రకారం కేంద్రంలోని బిజెపి వాయిదా వేసిందని గతంలోనే తమ పార్టీ తీవ్రంగా విమర్శించిందని చెప్పారు. ప్రస్తుత ఏడాదిలో జనాభా లెక్కలు జరుగుతున్నా, వీటిని కాకుండా 2011 లెక్కలను తీసుకుంటామని కేంద్రం చెబుతోందన్నారు. డిలీమిటేషన్ చేసి లోక్‌సభ 816 సీట్లు చేస్తామంటున్నారని, అయితే దీనిపై అనేక రాష్ట్రాల నుంచి వ్యతిరేకత వచ్చిందన్నారు. జనాభా ప్రాతిపదికన చేస్తే కుటుంబ నియంత్రణ అమలు చేస్తున్న రాష్ట్రాలు, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు చాలా ఎక్కువగా నష్టపోతాయని చెప్పారు. సీట్లు దామాషా ప్రకారం చేయాలని అనేక రాష్ట్రాలు ప్రతిపాదించాయని చెప్పారు. దీనిపై ఇప్పటివరకు కేంద్రప్రభుత్వం సమావేశం నిర్వహించి చర్చ జరపలేదని, కనీసం ప్రభుత్వం స్పందించలేదన్నారు. డిలీమిటేషన్ కు ముడిపెట్టి 2011 జనాభా లెక్కల ప్రకారం చేస్తామంటే ప్రజలను మోసం చేయటమేనని విమర్శించారు. మరోసారి దీన్ని వాయిదా వేయడానికే ఇది దారితీస్తుందన్నారు. రానున్న తమిళనాడు, బెంగాల్ ఎన్నికలను ద ష్టిలో పెట్టుకుని మహిళా ఓట్లు రాబట్టుకోవడం చేస్తున్న దుర్మార్గమైన వ్యవహారం తప్ప మరోకటి కాదన్నారు.

**మిట్టల్‌కు దోచిపెట్టొద్దు:** కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం మాట్లాడుతూ ఆర్సెల్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు దాదాపు 40వేల ఎకరాలకు పైగా పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్‌రాయవరం ప్రాంతాల రైతుల నుంచి తీసుకున్నారని, వీరికి ఇప్పటి వరకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. భూములు తీసుకుంటూ నిర్వాసితులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వారి కనీస అవసరాలను తీర్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిట్టల్ సేవలో రాష్ట్రప్రభుత్వం ఉండి రాయితీలు, భూములు అప్పగించే ప్రయత్నం చేస్తోందన్నారు. క్షేత్రస్థాయిలో రాష్ట్రప్రభుత్వం పరిశీలించి రైతులు, కూలీలకు న్యాయం చేయాలని లేదంటే ప్రతిఘటన తప్పదని కేంద్రకమిటీ సభ్యులు కె. లోకనాథం హెచ్చరించారు.



## జగన్ పర్యటన ఏర్పాట్లు పనులు పరిశీలన

బిట్రగుంట (నెల్లూరు), ఏప్రిల్ 13, ప్రభాతవార్త: కావలి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డితో కలిసి మత్స్యకార కుటుంబాలకు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సందర్శనకు వస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా హెలిప్యాడ్ నిర్మాణం, సభాస్థలి ఏర్పాట్లలోని పనుల పురోగతిని సోమవారం పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు, వైఎస్ఆర్సిపి నాయకులు రఘురాం, వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, నాయకులు, పాల్గొన్నారు.

## చర్లపల్లి రైల్వేస్టేషన్ ఆత్మహత్యల కేసులో కొత్త ట్విస్ట్

**ప్రాణభయం ఉందని పోలీసులను ఆశ్రయించిన విజయశాంతిరెడ్డి భర్త**



**హైదరాబాద్ (ఉప్పల్), ఏప్రిల్ 13, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఐటీ ఉద్యోగిని విజయశాంతి రెడ్డి కేసులో తాజాగా మరో ట్విస్ట్ చోటుచేసుకుంది. మృతురాలు విజయ శాంతిరెడ్డి భర్త సురేందర్‌రెడ్డి తన ప్రాణాలకు హాని ఉందని మేడిపల్లి పోలీసులను ఆశ్రయించడం చర్చనీయాం శంగా మారింది. విజయారెడ్డి తల్లి, సోదరులు ఆస్తి కోసం ఎంతకైనా తెగిస్తారని తన ఫిర్యాదులో పేర్కొనడం తీవ్ర కలకలం రేపింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత జనవరి 31న బోడుప్పల్ చెంగిచర్ల హరితవనం కాలనీలో నివాసం ఉంటున్న పిన్నింటి విజయ అలియాస్ విజయశాంతిరెడ్డి (38), కూతురు చైతన్యరెడ్డి (18), కొడుకు విశాల్‌రెడ్డి (17) ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. రాత్రి తమ కారులో చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లిన ముగ్గురు అనంతరం సనత్‌నగర్ వైపు వెళ్తున్న గూడ్స్ రైలుకు ఎదురుగా వెళ్లి అప్పట్లో ఆత్మహత్య చేసుకున్నారు. అయితే, విజయారెడ్డి చనిపోయాక ఆస్తి వివాదాలు తలెత్తాయి. ఈ క్రమంలో విజయా రెడ్డి తల్లితో సహా ఆమె సోదరుడిపై సురేందర్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సొంత వాళ్లే నా కుటుంబాన్ని నాశనం చేశారని, నా భార్య, పిల్లలు ఆత్మహత్య చేసుకు నేంత పిరికివాళ్లు కాదన్నారు. వాళ్లు చనిపోయిన 25 రోజులకే నన్ను కూడా ఆస్తి కోసం బెదరించారని తెలిపారు. తన అత్త విజయారెడ్డి తల్లి, బామ్మర్ది చిరంజీవి, అతని భార్య వేధింపులు, ఆస్తి కోసం వాళ్ల ఒత్తిడి చేయటం వల్లే విజయారెడ్డి పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు. తాను చనిపోతే ఆస్తులు తన తల్లిదండ్రులకు లేదా ట్రస్టుకు రాస్తానని ఆయన తెలిపారు. వారితో నాకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ కేసు మరోసారి చర్చనీయాం శంగా మారింది.

## అమరావతి మోయలేని గుదిబండ: పేర్ని నాని

విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి అవినీతి, అత్యాశ వల్ల అమరావతి మోయలేని గుదిబండగా మారిందని మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. సోమవారం పేర్నినాని తాడేపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఏపీ రాజధాని అంశంలో చంద్రబాబునాయుడు వ్యవహరిస్తున్న తీరుపై మండిపడ్డారు. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు మధ్య రాజధాని ఏర్పాటు చేస్తే ఇబ్బంది ఏంటి? బాధ్యతగా వ్యవహరించాల్సిన మంత్రులతో బూతులు తిట్టిస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై అసత్య ప్రచారాలు చేయిస్తున్నారు. చంద్రబాబు అంతులేని అవినీతితో రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారు.

రాష్ట్రానికి రాజధాని అనేది సిరిసంపదలతో తూగేలా ఉండాలి. అంతేగానీ, రాష్ట్రాన్నీ దివాళా తీసే విధంగా రాజధాని ఉండకూడదు. ఏది బాగుంటుందో ఇవాళ రాష్ట్ర ప్రజలు ఆలోచించే పరిస్థితి వచ్చింది. మావిగన్ అనే ప్రతిపాదనతో రాజధాని తక్కువ ఖర్చుతో నిర్మితమవుతుంది. ప్రజలు అమాయకులేం కాదు అన్నీ ఆలోచిస్తారు. చంద్రబాబుకు విశ్వాసంలేదని ఎన్టీఆర్ విమర్శించారు.

224 మంది ఎమెమ్యేలలను కాసులతో కొనుకున్నారని ఎన్టీఆర్ అన్నారు. వెనునపోటు పొడిచారని స్వయంగా ఎన్టీఆర్ అన్నారు. కేబినెట్‌లో ఉన్న తొమ్మిది మంది మంత్రులే చంద్రబాబును తిట్టని తిట్టు తిట్టారని వ్యాఖ్యానించారు.

## జెఎల్ ప్రొవిజనల్ ఎంపిక జాబితా విడుదల

విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: జూనియర్ లెక్చరర్ల ప్రొవిజనల్ ఎంపిక జాబితా విడుదల ఎపిపిఎస్సిచేసింది. ఈ జాబితాను అనుసరించి అభ్యంతరాలు, ఇతర అంశాలపై ఎపిపిఎస్సిని సంప్రదించాల్సి ఉంటుంది. జాబితా విడుదల సందర్భంలో అవసరమై పత్రాలను ఎపిపిఎస్సి తెలియచేయాల్సి ఉంది.

## రేపు నెల్లూరుకు మంత్రి లోకేష్ రాక



నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, ఆర్‌టీజీ శాఖ మంత్రి నారా లోకేష్ 15వ తేదీన నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ (బుధవారం) సాయంత్రం 5.00 గంటలకు తిరుపతి జిల్లా చంద్రగిరి నుండి రోడ్డు మార్గాన బయలుదేరి, సాయంత్రం 6.30 గంటలకు నెల్లూరులోని వి.పి.ఆర్ కన్వెన్షన్స్‌కు చేరుకుంటారు. అనంతరం సాయంత్రం 6.30 గంటల నుండి 7.00 గంటల వరకు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి కుమారుని వివాహ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 7.00 గంటలకు నెల్లూరు నుండి రోడ్డు మార్గాన బయలుదేరి తిరిగి గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామంలోని నివాసానికి బయలుదేరి వెళ్తారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆ ప్రకటనలో తెలిపారు.

## దుర్గమ్మవారి ఆలయం పాలకమండలి సమావేశం

# పలు తీర్మానాలు ఆమోదం



ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో సోమవారం జరిగిన పాలకమండలి సమావేశంలో పలు తీర్మానాలకు ఆమోదాలు తెలిపారు. శ్రీ అమ్మవారి ప్రసాదములు తయారీ, అన్నదాన ప్రసాదం తయారీకి 6నెలలకు ఆమోదం తెలిపారు. శ్రీఅమ్మ వారి ఆలయ గోపురానికి ఐరన్ స్కాఫోల్డింగ్ ఏర్పాటుకు, కుంభాభిషేక ములకు రు.19,50,000లను మంచి నీరు సప్లయి చేసిన సాయి వైష్ణవి ఏజన్సీస్‌కు చెల్లింపుకు, దేవస్థానంలో 33కెవి హెచ్‌టి స్విచ్చార్డ్ ఏర్పాటుకు, లడ్డూ, పులిహోర, చక్రపొంగలి, తదితర ప్రసాదాల తయారీ, కౌంటర్లకు చేరవేసే కాంట్రాక్టుకు, తదితర పలు టెండర్లకు పాలకమండలి ఆమోదం తెలిపారు.

**నిత్య అన్నదానమునకు విరాళం:** దుర్గమ్మ వారి ఆలయంలో నిర్వహించే ఉచిత ప్రసాద పంపిణీకి విజయవాడకు చెందిన పి హరినాతబాబు తన తండ్రి వేంకట సుబ్బయ్య జ్ఞాపకార్థం రు. 1లక్ష, తల్లి నాగమణి పేరిట రు.1లక్ష చొప్పున సోమవారం విరాళముగా అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



## రేపు కాంగ్రెస్ నేతృత్వంలో అఖిలపక్షం: ఖర్గే

బెంగళూరు, ఏప్రిల్ 13: ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో ప్రతిపాదించనున్న మహిళా రిజర్వేషన్ల బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. మహిళా బిల్లుతోపాటు నియోజక వర్గాల పునర్విభజన ప్రతిపాదనను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం బెంగళూరులో మీడియా సమావేశంలో ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ చట్టం అమలుకు దేశవ్యాప్తంగా విస్తృత పరిణామాలు ఉన్నందున, దానిపై విస్తృత చర్చలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. సంబంధిత వర్గాలన్నిటితో సమగ్ర సంప్రదింపులు జరిపేందుకు కేంద్రం సిద్ధంగా లేదని ఖర్గే ఆరోపించారు. తమ పార్టీ మహిళా రిజర్వేషన్ల చట్టానికి పూర్తి మద్దతు ఇస్తుందని పునరుద్ఘాటించారు. మహిళా రిజర్వేషన్ చట్టం అమలుపై చర్చించేందుకు బుధవారం (ఏప్రిల్ 15) కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఖర్గే తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజన అత్యంత ప్రమాదకరమైనదిగా అభివర్ణించారు. లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచే ఏ పునర్విభజన అయినా కేవలం సంఖ్యాపరంగానే కాకుండా, రాజకీయంగా కూడా సమానంగా ఉండాలని అభిప్రాయపడ్డారు.



ఎన్‌కౌంటర్‌లో రూపి మృతి చెందడంతో రోదిస్తున్న తల్లి, చెల్లెళ్లు

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. మహిళా మవోయిస్టు నేత మృతి

మిరుదొడ్డి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామానికి చెందిన మోస్ట్ వాంటెడ్ నక్సల్స్ ఏరియా కమాండర్ రంగబోయిన భాగ్య అలియాస్ రూపి మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ధర్మారం గ్రామానికి చెందిన రంగబోయిన నర్సయ్య లక్ష్మీ దంపతులకు నలుగురు సంతానం కాగా ముగ్గురు కూతుర్లు ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురైన భాగ్య అలియాస్ రూపి నక్సల్స్ ఉద్యమాలకు, ఆట పాటలకు ఆకర్షితులై (16) యేండ్ల వయస్సులో సుమారు 25యేండ్ల క్రితం 2004లో మావోయిస్టు పార్టీలో చేరింది. అంచెలంచెలుగా ఎదిగి మావోయిస్టు దళ కమాండర్‌గా పని చేస్తూ ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మోస్ట్ వాంటెడ్ నక్సలైట్ అయిన రూపీ అలియాస్ రంగబోయిన భాగ్య మృతి చెందింది. ఈమెపై గతంలో ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డు సైతం ప్రకటించింది. మావోయిస్టు రహిత దేశంగా ఇటీవల మార్చి 31 వరకు కేంద్ర ప్రకటనతో కుటుంబీకులైన తల్లి లక్ష్మీ చెల్లెలైన కవితా, మమత, తమ్ముడు తమ అక్క రూపీ వస్తుందని ఎంతగానో ఆశగా ఎదురు చూశారు కానీ ఇంతలోనే పోలీసు ఎన్‌కౌంటర్‌లో రూపీ మరణించడంతో కుటుంబంతో పాటు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మావోయిస్టు రూపి మృతి చెందిన సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు శవాన్ని తీసుకురావడానికి రూపీ సోదరితోపాటు గ్రామస్తులు కలిసి ధర్మారం నుంచి ఛత్తీస్‌గఢ్ బయలు దేరారు.

## లాలూపై సిబిఐ కేసు కొట్టివేతకు సుప్రీం తిరస్కరణ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** భూములు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చారనే కేసులో ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌కు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది. తనపై, తన కుటుంబ సభ్యులపై సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ లాలూ వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం సోమవారంనాడు తోసిపుచ్చింది. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటేశ్వర సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. కేసులో మెరిట్స్‌ను పరిశీలించే అధికారాన్ని ట్రయిల్ కోర్టుకే విడిచిపెడుతూ, చట్టప్రకారం విచారణ కొనసాగించవచ్చని ధర్మాసనం పేర్కొంది. ట్రయల్ కోర్టు విచారణకు వ్యక్తిగత హాజరు నుంచి లాలూకు మినహాయింపు ఇచ్చింది. ఈకేసులో ఇంతకుముందు లాలూ ప్రసాద్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తలిగింది. సీబీఐ తమపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ లాలూ వేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ లేదని కోర్టు పేర్కొంది. ఈ నిర్ణయాన్ని లాలూ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. దీనిపైనే సుప్రీం తాజా తీర్పు చెప్పింది. లాలూ ప్రసాద్ యాదవ్ 2004-09 మధ్య కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు ఉద్యోగాల కేటాయింపులో అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆ సమయంలో రైల్వేలోని వివిధ జోన్లలో అనేక మందిని గ్రూప్‌డి పోస్టుల్లో నియమించారు. దీనికి బదులుగా వారి భూములను లాలూ ప్రసాద్ కుటుంబ సభ్యులతో పాటు ఒక ప్రైవేటు కంపెనీకి బదలీ చేశారని సిబిఐ ఆరోపణగా ఉంది.

14-4Pg6exHMNWJQE.qxd:14-4Pg6exHMNWJQE.qxd 1/1/02 6:16 AM Page 1



# పోలవరం ప్రాజెక్టులో జల విద్యుత్

- 960 మెగావాట్ల సామర్థ్యం
- వేగవంతంగా విద్యుత్ కేంద్రాల పనులు
- 2027 జులైకి 3 యూనిట్లు ప్రారంభం



నిర్మాణంలో ఉన్న విద్యుత్తు టర్బైన్లు

విజయవాడ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో ఎపిజెన్‌కో ఆధ్వర్యాన నిర్మిస్తున్న జల విద్యుత్ కేంద్రాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పోలవరం జలవనరుల ప్రాజెక్టు వద్ద 960 మెగావాట్ల సామర్థ్యంతో, దిగువ సీలేరు ప్రాజెక్టు వద్ద 230 మెగావాట్ల సామర్థంతో జెన్‌కో వీటిని నిర్మిస్తోంది. పోలవరం ప్రాజెక్టు వద్ద 960 మెగావాట్ల సామర్థ్యంతో జెన్‌కో జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. ఒక్కో యూనిట్ 80 మెగావాట్లతో మొత్తం 12 యూనిట్ల పనులు జరుగుతున్నాయి. సివిల్, ఎలక్ట్రోమెకానికల్ పనులు సమాంతరంగా జరుగుతున్నాయి. ఒక్కో యూనిట్ సెకనుకు 331 క్యూబిక్ మీటర్ల నీటి ప్రవాహంతో, నిమిషానికి 100 రొటేషన్ల వేగంతో పనిచేసేలా వీటిని రూపొందించారు. దేశంలోనే అతిపెద్ద కాప్లాన్ టర్బైన్లలో ఇవి ఒకటిగా నిలుస్తాయని జెన్‌కో అధికారులు చెబుతున్నారు. ఈ సాంకేతికత వల్ల నీటి ప్రవాహం మారుతూ ఉన్నా అధిక సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని చెబుతున్నారు. మాన్సున్ కాలంలో అధిక నీటి ప్రవాహాన్ని వినియోగించుకోవడంతో పాటు గోదావరి డెల్టాకు సాగునీరు విడుదల సమయంలో కూడా ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రోజుకు 23 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ఏడాదికి 2,500 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా జెన్‌కో పెట్టుకుంది. యూనిట్‌కు సగటు ధర రూ.4.57లుగా అంచనా వేయగా, ఏడాదికి రూ.1,100 కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని అధికారులు అంటున్నారు. దీనివల్ల బహిరంగ మార్కెట్‌లో ఖరీదైన విద్యుత్ కొనుగోళ్లు తగ్గి వినియోగదారులకు స్థిరమైన విద్యుత్ ఛార్జీలు అందే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 2027 జులైలో జరిగే గోదావరి పుష్కరాల నాటికి కనీసం మూడు యూనిట్లను ప్రారంభించాలనే లక్ష్యంతో జెన్‌కో ఉంది. మొత్తం ప్రాజెక్టును 2028 జనవరి నాటికి పూర్తిచేయాలనే లక్ష్యంగా నిర్దేశించుకుంది.

**అక్టోబరు నాటికి దిగువ సీలేరు యూనిట్లు అందుబాటులోకి:** దిగువ సీలేరు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 115 మెగావాట్ల సామర్థ్యంతో మరో రెండు యూనిట్లను జెన్‌కో నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టు ప్రస్తుత సామర్థం 460 మెగావాట్లుగా ఉంది. రెండు దశల్లో 115 మెగావాట్ల చొప్పున నాలుగు యూనిట్లను వీటిని ఏర్పాటు చేశారు. నిర్మాణంలో ఉన్న రెండు యూనిట్లు కూడా పూర్తయితే మొత్తం 690 మెగావాట్లకు చేరుకుంటుంది. నిర్మాణంలో ఉన్న రెండు యూనిట్లు ఈ ఏడాది జూన్‌లో ఒక యూనిట్, అక్టోబరు నాటికి మరో యూనిట్ ప్రారంభమయ్యే అవకాశం ఉందని జెన్‌కో అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ముఖ్యంగా పీక్ అవర్‌లో రాష్ట్ర విద్యుత్ అవసరాల కోసం విద్యుత్ బహిరంగ మార్కెట్‌ను ఆశ్రయించే అవకాశం తగ్గుతోంది. దీంతో విద్యుత్ వినియోగదారులపై భారాల ప్రభావం కూడా తగ్గే అవకాశం ఉంటుంది. ఈ కేంద్రంలో యూనిట్‌కు సగటు వ్యయం రూ.1.60 మాత్రమే ఉండటం విశేషం. ఏడాదంతా నీటి లభ్యత ఉండే ఈ విద్యుత్ కేంద్రానికి అదనంగా రెండు యూనిట్లు రావడం వల్ల డిస్కమ్‌లపై విద్యుత్ కొనుగోలు భారం గణనీయంగా తగ్గి ఆర్థికంగా వినియోగదారులకు కొంత ఊరటనిచ్చే అవకాశం ఉంటుంది. ఈ ప్రాజెక్టు వల్ల ఏడాదికి రూ.647 కోట్ల మేర ఆదా సాధ్యమని అధికారులు చెబుతున్నారు.

**ఎగువ సీలేరు విద్యుత్ ప్రాజెక్టు ఆరు దశాబ్దాల తర్వాత కొత్త రూపు:** ఎగువ సీలేరు విద్యుత్ ప్రాజెక్టు ఆరు దశాబ్దాల తర్వాత కొత్త రూపు సంతరించుకోనుంది. ఇప్పటి వరకు జల విద్యుత్ ప్రాజెక్టుగా ఉన్న ప్రాంతం భారీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు (పీఎస్‌పీ)గా రూపాంతరం చెందనుంది. ఒక్కొక్కటి 150 మెగావాట్ల సామర్థం కలిగిన 9 వర్టికల్ ఫ్రాన్సిస్ రివర్స్‌బుల్ పంప్ టర్బైన్‌లు అండ్ సింక్రనైజ్డ్ మోటార్ జనరేటర్ సెట్‌లు ఏర్పాటు కానున్నాయి. 1,350 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థంతో కొత్త ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది. పీఎస్‌పీ ప్రాజెక్టు కోసం కేవలం పంప్‌హౌస్‌ను మాత్రమే ప్రస్తుతం నిర్మించనున్నారు. ఎగువ రిజర్వాయర్ గుంటవాడగా, దిగువ రిజర్వాయర్ డొంకరాయినిగా వినియోగిస్తారు. పగటి వేళల్లో పునరుత్పాదక విద్యుత్ అదనంగా ఉన్నప్పుడు ఎగువ రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోసి పీక్ డిమాండ్ వేళల్లో ఆ నీటితో విద్యుత్ ఉత్పత్తి చేసి దిగువ రిజర్వాయర్‌కు పంపేలా ప్రాజెక్టును రూపొందించారు. విద్యుత్ ఉత్పత్తి కోసం సుమారు 1.70 టీఎంసీల నీరు అవసరమవుతుంది. 2029 నాటికి పిఎస్‌పి ప్రాజెక్టును పూర్తి చేయాలన్నది లక్ష్యం. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి ఏజెన్సీ ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో దీన్ని నిర్మిస్తున్నారు. దీని ద్వారా ఏటా సుమారు 3,500 మిలియన్ యూనిట్ల విద్యుత్ గ్రిడ్‌కు అందుతుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంతంలో సగటు వార్షిక వర్షపాతం 1,388 మిల్లీ మీటర్లు ఉండటం వల్ల నిరంతర విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన నీటి ప్రవాహం అందుబాటులో ఉంటుంది. గుంటవాడ రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 3.66 టీఎంసీలుగా ఉంది. కొత్తగా నిర్మిస్తున్న పీఎస్‌పీ ద్వారా విద్యుత్ ఉత్పత్తికి 1.7 టీఎంసీల నీటిని మాత్రమే వినియోగించనున్నారు. మిగిలిన నీరు రిజర్వాయర్‌లోనే ఉంటుంది. అది పోను రిజర్వాయర్‌లో ఉన్న నీటి ద్వారా ఎగువ సీలేరులో ప్రస్తుతం ఉన్న జల విద్యుత్ ప్రాజెక్టు ద్వారా యథావిధిగా విద్యుత్ ఉత్పత్తికి వినియోగించుకోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.? ఈ ప్లాంట్ల సాధారణ కాలపరిమితి 35ఏళ్లు అయినప్పటికి క్రమబద్ధమైన ఆధునికీకరణ, నిర్వహణ పనులతో ఇప్పటికీ సమర్థంగా పనిచేస్తోంది. సుమారు ఆరు దశాబ్దాల కిందట ప్రారంభమైనప్పటికీ నేటికీ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి నెట్‌వర్క్‌లో కీలక పాత్ర పోషిస్తోంది. బలిమెల రిజర్వాయర్‌కు దిగువన గుంటవాడ వద్ద నిర్మించిన వియర్ ద్వారా సీలేరు నది నీటిని ప్రాజెక్టు కోసం వినియోగిస్తున్నారు.

ఎగువ సీలేరు ప్రాజెక్టు ఆధునికీకరణ రాష్ట్ర విద్యుత్ రంగంలో ఒక నవశకానికి నాంది పలకనుంది. ఆరు దశాబ్దాల క్రితం స్విట్జర్లాండ్ సాంకేతికతతో మొదలై, నేడు స్వదేశీ 'భెల్' సహకారంతో ప్రపంచ స్థాయి పంప్డ్ స్టోరేజ్ టెక్నాలజీ వైపు అడుగులు వేయడం హర్షణీయం. ఇది కేవలం విద్యుత్ ఉత్పత్తి కేంద్రం మాత్రమే కాదు పాత కాలపు పటిష్టతకు, రేపటి తరం సాంకేతికతకు ఒక అద్భుత మేళవింపుగా నిలవనుంది.

## పెంచిన ఆస్తి పన్నులు రద్దుచేయాలి: సిపిఎం

విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి ఇంటి పన్ను (ఆస్తి పన్ను)లను ఇబ్బడి ముబ్బడిగా పెంచుతూ రాష్ట్రంలోని పట్టణ ప్రజలపై రూ.400 కోట్ల భారం మోపడం దుర్మార్గమైన చర్య అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు అన్నారు. ఆస్తి పన్నుల పెంపు, క్యాపిటల్ వాల్యూ విధానం రద్దు కోసం పౌర సంఘాలు, ప్రజలు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధం కావాలని, ఇందుకు సిపిఎం అండగా ఉంటుందన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలలో ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానం రద్దు, పెంచిన పన్నుల తగ్గింపు అంశాన్ని అజెండాగా చేసుకొని, ప్రజా ప్రతినిధులను, నేతలను రాష్ట్ర ప్రజలు నిలదీయాలని కోరారు. విజయవాడ గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్‌తో కలిసి విలేకరులతో బాబూరావు మాట్లాడారు. ఆస్తి విలువ ఆధారిత ప్రకారం.. 2021 22 ఆర్థిక సంవత్సరం నుండి ఇప్పటికి 130 శాతం పట్టణాల్లో ఇంటి పన్నులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. తొలుత 15శాతంతో ప్రారంభమై, ఈ సంవత్సరం 30శాతం పన్నులు పెరిగాయని, రాబోయే రెండేళ్లలో 45 శాతానికి చేరతాయని పేర్కొన్నారు. 30 శాతం వరకు ఇంటి పన్నులు పెంచి ఏప్రిల్ నెలాఖరులోపు పన్నులు చెల్లిస్తే ఐదు శాతం రాయితీ ఇస్తామని ప్రకటించడం మోసపూరిత చర్య అన్నారు. రాష్ట్రంలోని 123 పట్టణాలు, నగరాల్లో నివసిస్తున్న కోటి 50 లక్షల మంది ప్రజలపై ఇంటి పన్ను పెంపు భారం ప్రత్యక్షంగా, పరోక్షంగా పడుతోందని అన్నారు.

## రామతీర్థంలో ధ్వంసమైన సీతా,రామ, లక్ష్మణుల విగ్రహాలు

# గోదావరిలో నిమజ్జనం



- అట్టహాసంగా విగ్రహాల ఊరేగింపు
- మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యేలు హాజరు

నెల్లిమర్ల (విజయనగరం జిల్లా), ఏప్రిల్ 13 ప్రభాత వార్త: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం విజయనగరం జిల్లా రామతీర్థం బోడికొండపై ఉన్న కోదండరామ ఆలయం లోని ఆరేళ్ల క్రితం గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన శ్రీరాముడి విగ్రహంతో పాటు, సీతాదేవి, లక్ష్మణస్వామి విగ్రహాలను ఎట్టకేలకు పవిత్ర గోదావరి నదిలో నిమజ్జనం చేసేందుకు స్థానిక దేవస్థానం వద్ద నుంచి సోమవారం అట్టహాసంగా ఊరేగింపు నిర్వహించారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాట ప్రదర్శనలతో రామతీర్థంలో ఈ ఊరేగింపు వైభవంగా ప్రారంభమైంది. దేవస్థానం ఇఒ వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్ఎంఎస్ఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, విజయనగరం, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, లోకం నాగమాధవి, ఎపి మార్క్ఫెడ్ చైర్మన్, టిడిపి సీనియర్ నాయకుడు సువ్వాడ రవి శేఖర్‌లతోపాటు పలువురు ప్రముఖుల సమక్షంలో పూజలు అనంతరం ఊరేగింపును ప్రారంభించారు. రామభక్తుల కోలాట ప్రదర్శనలు, భజన కీర్తనలతో ప్రారంభమైన ఈ ఊరేగింపు రామతీర్థం నుంచి నెల్లిమర్ల, విజయనగరం, తగరపువలస మీదుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం సమీపంలోని కోటిపల్లి వరకు వెళ్లి గోదావరి నదిలో అర్చకులు శాస్త్రోక్తంగా నిమజ్జనం (జలాధివాసం) చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, మార్క్ ఫెడ్ చైర్మన్ రాజు మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ హయాంలో రామతీర్థం వంటి పవిత్ర క్షేత్రంలో జరిగిన విగ్రహాల ధ్వంసం ఘటన భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బ తీసిందన్నారు. దేవాలయ సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ఉన్నప్పుడు, అలాంటి ఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఈ విషయంపై ప్రశ్నించిన టీడీపీ కార్యకర్తలపై అనవసరంగా తప్పుడు కేసులు కూడా నమోదు చేశారని వారు ఆరోపించారు. కానీ, ఇప్పుడు



ఆగమ శాస్త్రాల ప్రకారం విగ్రహాలను గౌరవప్రదంగా నిమజ్జనం చేయడం ద్వారా ధార్మిక పరిరక్షణకు తాము కట్టుబడి ఉన్నామని నిరూపించామని అన్నారు. శ్రీ కోదండ రామస్వామి వారి కృపతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటున్నామని తెలిపారు.

ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాట్లాడుతూ రామతీర్థం క్షేత్ర పవిత్రతను కాపాడటంలో కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని నాగ మాధవి స్పష్టం చేశారు.

## మహిళకు వేధింపులు...

# నిందితుడు అరెస్టు

విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడలో నగరంలో నగ్న ఫొటోలతో మహిళను వేధింపులకు గురిచేసిన ఘటన సంచలనం సృష్టించింది. భవానీపురం ప్రాంతంలో మద్దు బాలవెంకటేశ్వర్లు అనే వ్యక్తి బాధిత మహిళను వేధింపులకు గురిచేశాడు. భర్తను వదిలేసి తనను పెళ్లి చేసుకోవాలంటూ డిమాండ్ చేశాడు. లేకపోతే న్యూడ్ ఫొటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానంటూ బెదిరింపులకు గురిచేశాడు. వెంకటేశ్వర్లు వేధింపులు తీవ్రం కావడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. వెంకటేశ్వర్లు తనను లైంగికంగా వేధిస్తున్నట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. భవానీపురం జోజినగర్‌లో మద్దు బాలవెంకటేశ్వర్లు కిరాణా స్టోర్ నడుపుతున్నాడు. అతడు ఇప్పటికే మూడు పెళ్లిళ్లు చేసుకున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిపై బ్లాక్‌మెయిల్, లైంగిక వేధింపులు, బెదిరింపులు వంటి సెక్షన్ల కింద కేసు నమోదైంది. నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు, త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

## ప్రియురాలిని అసభ్యకరంగా మాట్లాడాడని

# స్నేహితుడినే హతమార్చాడు

### ఆత్మహత్యగా చిత్రీకరణ... చివరకు కటకటాల్లోకి



అనంతపురం (క్రైమ్), ఏప్రిల్ 13 ప్రభాతవార్త: ఇద్దరు స్నేహితుల మధ్య ఏర్పడిన స్వల్ప మనస్పర్తలు దారుణ హత్యకు దారి తీసాయి. తన ప్రియురాలికి అసభ్యకరంగా మాట్లాడినాడని కక్ష మనసులో పెట్టుకొని దాడి చేసి హత్య చేశాడు. ఈ నేరాన్ని తనమీద వేసుకోకుండా రైల్వే పట్టాలపై శవాన్ని పడవేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడు. జరిగిన సంఘటనపై పోలీసులకు అనుమానం వచ్చింది. అయితే ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞాన సాయంతో ఆత్మహత్య కాదని, ఇది హత్యేనని నిరూపించారు. సుమారు 10 నెలల తర్వాత ఎట్టకేలకు నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కట్ చేస్తే, అనంతపురం జిల్లా రాప్తాడుకు చెందిన మందల కార్తీక్, చంద్రబాబు కొట్టాలకు చెందిన దుర్గాప్రసాద్ ఇద్దరూ స్నేహితులు. ఇద్దరికీ చెడు అలవాట్లు ఉండి, ఇందులో కార్తీక్ తన ప్రియురాలని దుర్గాప్రసాద్ ఫోన్లో దూషించాడని మనసులో పెట్టుకొని గతేడాది మే 27న రాత్రి అనంతపురం టౌన్, బాబా నగర్ రైల్వే ట్రాక్ పై మందల కార్తీక్, దుర్గ ప్రసాద్ లు మద్యం సేవించి ఘర్షణ పడ్డారు. దుర్గాప్రసాద్‌ను రాయితో తలపై కొట్టి హత్య చేసాడు. అనంతరం రైలు పట్టాలపై పడుకోబెట్టి ఆత్మహత్యగా చిత్రీకరించి అక్కడి నుంచి పారిపోయాడు. అయితే తొలుత రైల్వే పోలీసులు అసహజ మరణంగా కేసు రిజిస్టర్ చేశారు. తరువాత అనుమానం వచ్చి అనంతపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కి బదిలీ చేసారు. అనంతపురం డిఎస్పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 2 టౌన్ సిఐ శ్రీకాంత్, ఎస్ఐ రుషేంద్ర బాబు, సిబ్బంది అమరేశ్వర రావు, టి.అంజన్ కుమార్, సుధాకర్, పాండవ, రామాంజనేయులు, వన్నూరు సాంకేతి పరిజ్ఞానంతో ఈ కేసును చేదించారు. నేరస్తుడైన కార్తీక్‌ను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## డ్రైవర్ సుబ్రమ్మాణ్యం హత్య కేసు

# విచారణ రేపటికి వాయిదా

- విచారణకు హాజరైన ఎమ్మెల్సీ అనంతబాబు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి: దళిత వర్గానికి చెందిన డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్యచేశారన్న ఎంఎల్సీ అనంతబాబు కేసులో విచారణ సోమవారం రాజమహేంద్రవరం ప్రత్యేక కోర్టులో జరిగింది. ఎంఎల్సీ అనంతబాబు ప్రధాన నిందితుడిగా ఉన్న ఈ కేసులో ఆయన భార్య లక్ష్మీ దుర్గ కూడా రెండో నిందితురాలుగా పోలీసులు నమోదు చేశారు. దీనిపై ఎమ్మెల్సీ భార్య లక్ష్మీ దుర్గకు ఈ హత్యకు సంబంధం లేదని పెట్టుకున్న పిటిషన్ పై వాద ప్రతి వాదనలు జరిగాయి. హత్యలో సంబంధంలేని లక్ష్మీ దుర్గను కేసు నుంచి తొలగించాలంటూ ఆమె తరపు న్యాయవాదులు వాదించగా హత్యా సమయంలో సిసి ఫుటేజ్‌ను, సెల్‌ఫోన్ రికార్డ్స్ తదితర ప్రాథమిక ఆధారాలు నేపథ్యంలో లక్ష్మీ దుర్గ పాత్ర ఉన్నదంటూ ప్రాసిక్యూషన్ వాదించింది. అనంతరం ఈనెల 15వ తేదీ వాయిదా వేశినట్లు న్యాయమూర్తి గంధం సునీత ప్రకటించారు. ఈ విచారణకు ఎమ్మెల్సీ అనంత బాబు, భార్య లక్ష్మీ దుర్గ హాజరయ్యారు. డ్రైవర్ను హత్య చేసి డోర్ డెలివరీ చేశారన్న పై రాజమహేంద్రవరం లోని ప్రత్యేక కోర్ట్ విచారణ జరుగుతున్న విషయం విదితమే.

# అక్కడి నీరు తాగడం కాదు..

# తాకినా ప్రాణాపాయమే!

- జగ్గయ్యపేటలో భూగర్భ జలాల కాలుష్యం
- బోరు పంపుల నుండి రసాయనాల నీరు
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని అధికారులు
- కొనసాగుతున్న జెఎసి ప్రతినిధుల ఆందోళన



పరిశ్రమల నుండి రసాయన వ్యర్థాలు వచ్చి చేరడంతో చెరువు నీరంతా విషజలాలుగా మారిన దృశ్యం



ఆటోనగర్‌లోని బోరు పంపుల నుండి వెలువడుతున్న రసాయనాల నీరు



జగ్గయ్యపేటకు సమీపంలోని భారీ రామ్‌కో సిమెంట్స్ ఫ్యాక్టరీ చిమ్నీల నుండి యధేచ్ఛగా వెలువడుతున్న సిమెంట్ ధూళి.

జగ్గయ్యపేట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: అభివృద్ధి ఆగినా నష్టంలేదు కానీ.. అకాల మృత్యువులు, అర్ధా యుష్షుల మరణ మృదంగాలు, రోగాలతో ఆసుపత్రుల పాలవుతున్న జన జీవితాలు ప్రజల మనుగడను కాటేస్తున్న వైఖరులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. నిబంధనలను పాటించని కర్మాగారాలు, పరిశ్రమలు జీవకోటిని కబళిస్తున్నా ప్రభుత్వాలు, పాలకులు పట్టించుకోని దుస్థితికి నిలువుటద్దం లా జగ్గయ్యపేట ప్రాంతం కునారిల్లుతోంది.

దశాబ్ధ కాలంగా స్లో పాయిజన్‌లా విస్తరిస్తున్న కర్మాగారాల కాలుష్యం ప్రజల పాలిట శాపంగా మారింది. సిమెంట్ ఫ్యాక్టరీలు రాత్రివేళల్లో ఇంధన మిగులుకోసం రసాయన వ్యర్థాలను వినియోగిస్తున్న నేపథ్యంలో ఘాటైన రసాయనాల వాయువులు, వర్షంలా కురుస్తున్న సిమెంట్ ధూళి వలన మానవాళితోపాటు పశుపక్షులు కూడా అకాల ఆకస్మిక మరణాలకు గురవుతున్న సంఘటనలు ప్రజల్ని బెంబేలెత్తిస్తున్నాయి. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట శివారులోని విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి-65 పక్కనేగల ఆటోనగర్‌లోని ఐదు కెమికల్ ఫ్యాక్టరీలు నిబంధనలను అనుసరించకుండా కొనసాగిస్తున్న ఉత్పత్తులతో భయాందోళనలు కలిగిస్తున్నాయి. దాదాపు పదేండ్లుగా ప్రజలు ఆందోళన చేస్తున్న సందర్భాల్లో ఉన్నతాధికారులు విచ్చేయటం, శాంపిల్స్ సేకరించి వెళ్ళటం మాత్రమే జరుగుతోంది. నిబంధనలు పాటించని ఫ్యాక్టరీలను సీజ్ చేస్తున్నాం అంటూ అధికారులు మీడియాకు ప్రకటించటం రెండు వారాలు గడిచేసరికే తిరిగి యధావిధిగా ఫ్యాక్టరీలు వాయుకాలుష్యంతోపాటు భూగర్భజలాలను కలుషితం చేస్తున్న వైనం అంతులేని కథలా కొనసాగుతూనే ఉందని పలువురు విద్యావంతులు, పర్యావరణ పరిరక్షకులు ఆవేదన చెందుతున్నారు. వెంటాడుతున్న కాలుష్యం అనారోగ్యాలతో, అర్ధాయుష్షులతో ప్రాణాలు తోడేస్తున్నా కూటమి ప్రభుత్వంలో రవ్వంత స్పందన లేదంటూ ప్రజలు ఆక్రోశిస్తున్నారు. పాలకులు, రాజకీయ నాయకులతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవటంలేదని అర్థం చేసుకున్న పలువురు మేధావులు ప్రజా సంఘాలను, సామాన్య ప్రజలను చైతన్యవంతుల్నిచేస్తూ విషం కక్కుతున్న కెమికల్ ఫ్యాక్టరీల వైఖరిపై 28 యూనియన్లతో ఏర్పాటైన కాలుష్య నివారణ జెఏసి ప్రతినిధుల బృందం కాలుష్య సమస్యలపై ప్రజా సంతకాల ఉద్యమం ప్రారంభించింది. స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఈశిబిరాన్ని సందర్శించి, ఆటోనగర్‌లో కూడా పర్యటించి అధికారులకు ఆదేశాలు జారీచేసి రెండు వారాలు గడుస్తున్నా ఎలాంటి చర్యలు కార్యాచరణకు నోచుకోకపోవటంపట్ల జెఏసి ప్రతినిధి బృందం నిరసన వ్యక్తంచేసింది. ఇదిలా ఉంటే కొంగరమల్లయ్య గట్టు వెనుక భాగంలో గల జెఆర్ ఎకో కెమికల్ కర్మాగారంలో ఇటీవల ఒక్కసారిగా రసాయన వ్యర్థాలు పేలిపోయి భారీ అగ్నిప్రమాదం జరిగింది. పలు కర్మాగారాల్లోని రసాయన వ్యర్ధాలను సేకరించి వాటిని వీలైనంత వరకు శుద్ధిచేసి తిరిగి వాటిని మండించే ఇంధనంగా సదరు కర్మాగారాలకే ఎగుమతి చేయటం ఒక తంతుగా కొనసాగుతున్నట్లు జెఏసి ప్రతినిధులు ఆరోపించారు. గడువు తీరిన ఫైర్ ఎక్స్టింగ్విషర్లు, పనిచేయని అలారాలు, తాళాలు వేసివున్న ఎమర్జెన్సీ ఎగ్జిట్లు వంటివి ప్రమదాలకు స్వాగత గీతిక పలుకుతున్నట్లు వారు ఆరోపిస్తున్నారు. రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ వారు రాత్రి వేళల్లో బొగ్గు, విద్యుత్తు వంటి ఇంధన వినియోగాన్ని తగ్గించుకునేందుకు, వ్యయభారంను మినహాయించు కునేందుకు ఫైరింగ్ నిమిత్తం ఈ కెమికల్స్‌ను వినియోగిస్తుండటం వలన రాత్రి వేళల్లో పట్టణ పరిసర ప్రాంతాలు, పలు గ్రామాల్లో కెమికల్ దుర్వాసన విస్తరిస్తోందని ప్రజానీకం ఆక్రోశిస్తున్నా పట్టించుకునే నాధులు లేకపోయారు. పలు మార్లు ప్రజాప్రతినిధులకు, జిల్లా ఉన్నతాధికారులకు ఈ విపత్తుల గురించి విన్నవించి వినతులు సమర్పించినా స్పందన లేదంటూ పోరాటాన్ని భుజానికెత్తుకున్న ప్రతినిధి బృందం విచారం వ్యక్తంచేస్తోంది. ఇప్పటికే ఒక భారీ సిమెంట్ కర్మాగారంలో సిలెండర్ పైప్స్ పగిలిన ప్రమాదంలో తొమ్మిది మంది కార్మికులు దుర్మరణం పాలయ్యారు. ప్రస్తుతం జగ్గయ్యపేట ప్రాంతంలో కిడ్నీ రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిపోగా అందుకు కారకులైన వారిపై ఎలాంటి చర్యలను ప్రభుత్వం తీసుకోకపోవటం బాధ్యతారాహిత్యాన్ని సుస్పష్టం చేస్తుందని వారు నిందిస్తున్నారు. ప్రమాద నివారణ, భద్రతా నియమాలు పాటించకుండా వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, యాసిడ్ కెమికల్ వేపన్ న్యూట్రల్‌చేసే స్క్రబ్బర్‌ను కూడా ఏర్పాటుచేసుకోకుండా ఫైర్ హైడ్రేట్ లేకుండా ఫ్యాక్టరీని నడుపటం చట్టవ్యతిరేకమని సంబంధిత ప్రభుత్వ యంత్రాంగం ఎందుకు నిర్వీర్యం అవుతుందో పాలకులకే తెలియాలంటూ ఉద్యమకారులు నిరసిస్తున్నారు. ఇక ప్రతి ఇంటి నుండి ఒకరు వంతున బయలుదేరి బకాసుల అంతు చట్టపరంగా, న్యాయపరంగా తేల్చుకునేందుకు సన్నద్ధం అవుతున్నామంటూ ఉద్యమకారులు హెచ్చరిస్తున్నారు. పాలకులు, ప్రభుత్వం ఏవిధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సివుంది మరి.



# అంబేద్కర్ జీవిత చరిత్రపై ఎస్‌పిడిసిఎల్ ఫొటో ఎగ్జిబిషన్

తిరుపతి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో బి.ఆర్. అంబేద్కర్ జీవిత చరిత్రపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి సోమవారం ప్రారంభించారు. బి.ఆర్. అంబేద్కర్ జీవితంలో ప్రతి అంశాన్ని ప్రతిబింబించే విధంగా ప్రత్యేకంగా ఛాయాచిత్ర మాలికను ఏర్పాటు చేశారు. అంబేద్కర్ కుటుంబ నేపథ్యం, విద్యాభ్యాసం, రాజకీయ జీవితం, దళితుల అభ్యున్నతికి కృషి, కార్మిక సంస్కరణలు, ఇంధన రంగం, భారత రాజ్యాంగంలో ఆయన పాత్ర, బుద్ధిజమ్ స్వీకరణ తదితర అంశాలపై వివరణాత్మకంగా ఛాయాచిత్ర మాలికను రూపొందించారు. అంతేకాకుండా అంబేద్కర్ జీవిత చరిత్ర పై ప్రత్యేకంగా వీడియోను రూపొందించి, ఎగ్జిబిషన్ లో ప్రదర్శించారు. ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభ కార్యక్రమంలో భాగంగా జ్యోతి ప్రజ్వలన అనంతరం ఎపి ఎస్‌పిడిసిఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ సమాజానికి అంబేద్కర్ అందించిన సేవలను కొనియాడారు. ఆయన రూపొందించిన భారత రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శవంతమైందని తెలిపారు. స్త్రీ జాతి, కార్మికుల అభ్యున్నతికి ఆయన పాటుపడ్డారని తెలియజేశారు. సమాజంలో అసమానతల నిర్మూలనకు ఆయన ఆవిరళ కృషి గావించారని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ ఎగ్జిబిషన్‌ను తిలకించడం ద్వారా అంబేద్కర్ జీవిత చరిత్రను క్షుణ్ణంగా తెలుసుకోవచ్చన్నారు. రెండు రోజులు పాటు కొనసాగే ఈ ఎగ్జిబిషన్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (టెక్నికల్ హెచ్‌ఆర్డి) కె. గురవయ్య, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ఐటీ) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్/ ఫైనాన్స్ (ఎఫ్ఎసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె ఆదిశేషయ్య, సి.హెచ్. రామచంద్ర రావు, జే. రమణాదేవి, ఆర్. పద్మ, ఎం మురళి కుమార్, ఎం. ఉమాపతి, కే.సంపత్ కుమార్, ఎస్. రమణ, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కే. జనార్దన్ నాయుడు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 16న తిరుపతిలో చాగంటి కోటేశ్వరరావు ధార్మికోపన్యాసం



తిరుమల, ఏప్రిల్ 13 ప్రభాత వార్త ప్రతినిధి: టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధర్మప్రచార కార్యక్రమాలు భక్తుల లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేందుకు నిరంతరం నిర్వహించబడు తున్నాయి. ఈ కార్యక్రమాలలో భాగంగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు 16వ తేదీ గురువారం తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో సాయంత్రం 5.30 గంటలకు ధార్మికోపన్యాసం చేయనున్నారు. ఈ సందర్భంగా నిత్యజీవితంలో ధర్మాచరణం" అనే అంశంపై భక్తులకు ఆధ్యాత్మిక సందేశాన్ని అందించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ ధార్మిక ఉపన్యాసాన్ని ఆలకించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందవలసిందిగా టిటిడి కోరింది.

-7_-7.qxd 4/13/2026 11:51 PM Page 1



## పేద కుటుంబాలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి: స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**నర్సీపట్నం, ప్రభాతవార్త**



ప్రజలకు సేవ చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎమ్మార్ఎఫ్) ఒక వరంలా ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. సోమవారం నర్సీపట్నంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో, 28వ వార్డుకు చెందిన లంక వరలక్ష్మి అనే మహిళకు మంజూరైన 65,594 రూపాయల విలువైన సీఎమ్మార్ఎఫ్ చెక్కును ఆమెకుమారుడు లంక మహేష్‌కు స్పీకర్ అందజేశారు.కార్యక్రమంలో మాజీ వార్డు కౌన్సిలర్ డబ్బీరు శ్రీకాంత్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ మీటింగు హాలులో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త 26



## డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీకి 45 వినతులు

**విశాఖపట్నం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**



విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యక్రమానికి వినియోగదారుల నుంచి 45 వినతులు అందాయి. విశాఖపట్నంలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వినియోగదారులు వివిధ సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరాకు సంబంధించి లో వోల్టేజ్, విద్యుత్ లైన్ల మార్పు, విద్యుత్ బిల్లులు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, రూఫ్ టాప్ సోలార్ కు సంబంధించిన సమస్యలు, విద్యుత్ కనెక్షన్ల మంజూరు తదితర సమస్యలపై ఫిర్యాదులను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ వినతులను సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి పరిశీలించి, తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాలకు ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1912 కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు 9493681912 కు చాట్ చేయడం ద్వారా కూడా తమ విద్యుత్ సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవచ్చని సంస్థ సూచించింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు టి.వి.సూర్యప్రకాష్, సీజీఎం వి.విజయలలిత, జీఎం వి.వి.ఎస్.ఎన్.వి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ సర్కార్..

### మహిళల రిజర్వేషన్ స్వాగతిస్తాం - పీవీయన్ మాధవ్

**విశాఖపట్నం, ప్రభాతవార్త**



మహిళా సాధికారత దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయంగా మహిళా రిజర్వేషన్ బిల్లును ఆంధ్రప్రదేశ్ బీజేపీ స్వాగతిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ పీవీయన్ మాధవ్ తెలిపారు.దేశ రాజధాని న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన "నారీ శక్తి వందన్ సమ్మేళనం" కార్యక్రమంలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై గౌరవ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కీలక ప్రసంగం చేశారు. మహిళల రాజకీయ, సామాజిక సాధికారతకు ఈ బిల్లు మైలురాయిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ బిల్లు దేశ రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందని మిగతా 8..లో

## ప్రతి ఉద్యోగి విధులు పట్ల బాధ్యతతో మెలగాలి

### - వియంఆర్‌డిఎ మెట్రోపాలిటన్ కమిషనర్ యన్ తేజ్ భరత్

**విశాఖపట్నం, ప్రభాతవార్త**



ప్రజా దర్బార్ కి వచ్చిన వినతుల పరిష్కారంలో సిబ్బంది జవాబుదారీగా ఉండాలని, అదేవిధంగా విధుల నిర్వహణలో నిర్లక్ష ధోరణిని విడనాడాలని, నిర్దేశించిన గడువులోగా బాధితులకు సరైన సమాచారం ఇవ్వాలని, వారి అర్జికి తగిన సమాచారం ఇవ్వాలని చూపాలని వియంఆర్‌డిఎ మెట్రోపాలిటన్ కమిషనర్ యన్ తేజ్ భరత్ ఆదేశించారు. సోమవారం ఉదయం వియంఆర్‌డిఎ కార్యాలయం 9 వ అంతస్తు సమావేశమందిరంలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో మిగతా 8..లో

## భోగాపురం వరకు మెట్రోఐటీ సెజ్‌కు అనుసంధానించాలి

### - ఎండీ రామకృష్ణారెడ్డితో గంటా

**విశాఖపట్నం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**



రుషికొండ ఐటీ సెజ్ కు మెట్రో సేవలు అందించాలని.. భోగాపురం వరకూ పొడిగించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. విశాఖ వచ్చిన మెట్రో ఎండీ రామకృష్ణారెడ్డి సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని మెట్రో గురించి చర్చించారు. కొమ్మాది వరకు ప్రతిపాదించిన మెట్రో ను భోగాపురం వరకు పొడిగిస్తే ఎయిర్ పోర్టు యూజర్స్ కు ఉపయోగపడడంతో పాటు ఆ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందని గంటా అభిప్రాయపడ్డారు. రోడ్డు సౌకర్యం మిగతా 8..లో

## మహనీయులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది..

**విశాఖపట్నం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**



వందేళ్ళ చరిత్ర కలిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయం గురించి ప్రతి ఒక్కరూ సగర్వంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం చరిత్రను తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పైడా కళాశాలల చైర్మన్ పైడా కృష్ణ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి సరోజ్ అన్నారు . ఆంధ్ర విశ్వ కళాపరిషత్ చరిత్ర, తొలి ఉపకులపతి నుంచి ప్రస్తుత ఉపకులపతి వరకు అందించిన సేవలను సృజనాత్మకత వాతావరణంలో విద్యార్థినిలు వారి చిత్రపటాలను ప్రదర్శిస్తూ దేశభక్తి గీతాలకు నృత్యాలు చేసి... అంకితమిచ్చారు. మిగతా 8..లో

## చందనోత్సవం ఏర్పాట్లపై హోం మంత్రి సమీక్ష

### - సుమారు 2 లక్షల మంది స్వామి దర్శించుకుంటారని అంచనా హోమ్ మినిస్టర్ వంగలపూడి అనిత

**సింహాచలం, ప్రభాతవార్త**



ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం, సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి అత్యంత ప్రతిష్టాత్మకమైన చందనోత్సవం (నిజరూప దర్శనం) ఈ నెల 20వ తేదీన ఘనంగా జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ యంత్రాంగం, దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో హోమ్ మిస్టర్ వంగలపూడి అనిత పర్యవేక్షించారు. ఈ పర్యవేక్షణ లో జాయింట్ కలెక్టర్, సీపీ, డి సి పి, ఎ సి పి,అధికారులుకు ఉత్సవ ఏర్పాట్లను మిగతా 8..లో

## సింహగిరిపై చందనోత్సవం

# ఏర్పాట్లు పరిశీలించిన హోం మంత్రి అనిత

- *పార్కింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి*
- *ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు ఆలయం వద్ద సిద్ధంగా ఉండాలి*
- *సీసీటీవీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతర పర్యవేక్షణ*
- *ఈ సంవత్సరం దాదాపు 2 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా*
- *సామాన్య భక్తుల దర్శనాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం..హోం మంత్రి అనిత*

**సింహాచలం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**





ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత, ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిని సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రికి అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం ఆమెకు వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఈ నెల 20న జరగనున్న స్వామివారి చందనోత్సవాన్ని పురస్కరించుకుని సింహగిరిపై జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు మిగతా 8..లో

## సామాన్య భక్తులకు సజావుగా దర్శనం: గంటా

**సింహాచలం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**



సామాన్య భక్తులకు సజావుగా స్వామివారి నిజరూప దర్శనం జరిగేలా చూడాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. సోమవారం ఆయన చందనోత్సవం ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉత్సవ నిర్వహణను ప్రభుత్వం ప్రతిష్టాకరంగా తీసుకుని ఈనెల 15 వ తేదీ నాటికే ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించిందని చెప్పారు. గత ఏడాది చందనోత్సవం నాడు చోటు చేసుకున్న దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా మంత్రుల కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షిస్తోందని తెలిపారు. సాధారణ రోజుల్లో స్వామిని దర్శించుకోవడానికి వచ్చే భక్తుల సంఖ్యతో పోల్చుకుంటే చందనోత్సవం, గిరి ప్రదక్షిణ రోజుల్లో కనీసం 10 రెట్లు ఎక్కువ మంది వస్తారని వెల్లడించారు. ఆ సంఖ్యకు తగ్గట్టు సౌకర్యాలు కల్పించడం యంత్రాంగానికి అతి పెద్ద సవాలన్నారు. ఈసారి చందనోత్సవానికి పూర్తి స్థాయి ఈఓ ఉన్న కారణంగా ఉత్సవం మరింత సమర్థంగా జరుగుతుందని పేర్కొన్నారు. అధికార యంత్రాంగం ఇచ్చిన నియమావళిని స్వామి దర్శనానికి వచ్చే భక్తులు విధిగా పాటించాలన్నారు. దేవస్థానం నిర్దేశించిన స్లాట్ లలో దర్శనాలు చేసుకుని, మిగిలిన భక్తులకు ఇబ్బంది కలిగించకుండా సహకరించాలని కోరారు. ఏర్పాట్లను సమీక్షించిన గంటా ఈనెల 20న జరగనున్న చందనోత్సవానికి చేస్తున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే గంటా పరిశీలించారు. క్యూ లైన్లు, మంచినీటి సౌకర్యం, రవాణా, ప్రసాదాలు, పార్కింగ్ తదితర అంశాల గురించి ఈఓ జె. వెంకట్రావు వివరించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లలో జారీచేస్తున్న టికెట్లు.. వాటి స్లాట్ వివరాలు తెలియజేశారు. చందనం అరగదీచం దనోత్సవాన్ని పురస్కరించుకుని గంటా శ్రీనివాసరావు సింహాచలం ఆలయంలో చందనం చెక్కను అరగ దీశారు. సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న అనంతరం సంప్రదాయ దుస్తులలో ఆయన గంధపు చెక్కను అరగదీశారు. సంవత్సమంతా చందనంతో నిండి ఉండే నృసింహ స్వామి ఒక్క చందనోత్సవం రోజున మాత్రానే నిజ రూప దర్శనమిస్తారు. ఈ ఉత్సవం అనంతరం స్వామి వారిని కప్పడానికి చందనాన్ని సిద్ధంచేసే క్రమంలో సోమవారం నుంచి గంధం అరగతీత ప్రారంభించారు. ఈఓ జె. వెంకట్రావు, ఏఈఓ తిరుమలేశ్వరరావు, ప్రధాన అర్చకుడు శ్రీని వాసాచార్యులు, టీడీపీ నాయకులు చిక్కాల విజయ్ బాబు, పీవీ నరసింహం, పంచదార్ల శ్రీనివాస్, గుసిడి శంకర్రావు, గాదు వెంకటప్పుడు, నాగోతి సత్యనారాయణ పాల్గొన్నారు.



## హంసఫర్ రైలు ప్రారంభం

- హంసఫర్.. రైలు హాల్ట్.. లోకో పైలట్‌కు బొకే ఇస్తున్న సుందరపు వెంకట సతీష్ కుమార్... జెండా ఊపుతున్న సతీష్ కుమార్..

**ఎలమంచిలి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**



కేంద్ర మంత్రివర్యులు కింజారపు రామ్మోహన్ నాయుడు సహకారంతో శ్రీకాకుళం రోడ్డు నుండి తిరుపతి వరకు హంసఫర్ రైలుకి ఎలమంచిలి రైల్వే స్టేషన్లో హాల్ట్ ఇవ్వడంతో సోమవారం సాయంత్రం రైల్వే స్టేషన్ లోని హంసఫర్ లోకో పైలెట్ కు బొకే ఇచ్చి స్వీట్లు పంచారు. అనంతరం జండా ఊపి రైలును ప్రారంభించారు. ఈ సందర్భంగా జనసేన ఉత్తరాంధ్ర వ్యవహారాల ఇన్చార్జి సుందరపు వెంకట సతీష్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాంబిల్లి అచ్చుతాపురం పరిశ్రమలు రావడం ఎలమంచిలి రాష్ట్రంలోనే అభివృద్ధి చెందుతున్న నియోజకవర్గంగా కొనసాగుతుందని దీనికి తోడు రైల్వేస్టేషన్లోని హంసఫర్ ట్రైన్ కు హాల్టి ఇవ్వడం ఎంతో సంతోషదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ని ఎంపీపీ రాజాన శేషు, పిఎసిఎస్ చైర్మన్ గోపి,జనసేన పట్టణ పార్టీ అధ్యక్షుడు బోద్దపు శ్రీనివాసరావు, జనసేన నాయకులు ఊటకూటి రమేష్ నాయుడు, కొటారు శ్రీనివాసరావు, కర్రీ ఝాన్సీ, మాజీ సర్పంచ్ లవుడు లోవరాజు,లాలం సోమనాయుడు, గుర్రాల శేఖర్, కొటారు నరేష్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## స్వీయ గణనపై అవగాహన కల్పించాలి

### : జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్ కిశోర్

**విశాఖపట్నం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**



జనగణన2027 ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వీయ గణన విధానంపై జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల వారికీ అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ తొలిసారిగా ప్రజలే స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే ఈ వినూత్న అవకాశాన్ని ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 30, 2026 వరకు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల పౌరులు నిర్ణీత గడువులోగా అనే పోర్టల్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం తరపున 15 రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు ఈ ప్రక్రియపై అవగాహన కల్పించాలని, ముఖ్యంగా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, కార్మికులను భాగస్వాములను చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు సచివాలయ సిబ్బంది రోజుకు కనీసం 10 నుంచి 20 మంది ఈ స్వీయ గణనలో చేదోడువాదోడుగా నిలవాలని ఆయన సూచించారు. అలాగే సమాజంలోని మిగతా 8..లో

## సముద్రంలో చేపల వేట నిషేధం

- *ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు అమలు*

*ప్రభుత్వం కీలక నిర్ణయం*

- *మత్స్యకారులకు భృతికి రిజిస్ట్రేషన్ తప్పనిసరి*

**(ప్రభాతవార్త, విశాఖపట్నం)**



రాష్ట్రంలో చేపల సంరక్షణ, వనరుల పరిరక్షణ కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో చేపల వేట నిషేధాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ కాలంలో చేపల పునరుత్పత్తి జరుగుతుండటంతో వేట నిషేధం అవసరమని అధికారులు తెలిపారు. నిషేధ సమయంలో మత్స్యకారుల జీవనోపాధిపై ప్రభావం పడకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అర్హులైన మత్స్యకారులకు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించనున్నట్లు వెల్లడించింది. ఈ సహాయం పొందాలంటే సంబంధిత మత్స్యకారులు అధికారికంగా నమోదు చేసుకోవడం తప్పనిసరి. ప్రస్తుతం నమోదైన మత్స్యకారుల వివరాల ప్రకారం లక్షలాది మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు. బోట్లకు సంబంధించిన వివరాలు, లైసెన్సులు, బ్యాంక్ ఖాతా సమాచారం సమర్పించినవారికే ఈ సహాయం అందుతుంది. ముఖ్యంగా యాక్టివ్ బ్యాంక్ ఖాతా, ఆధార్ లింక్ తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు. అదనంగా, చేపల వేటకు ఉపయోగించే బోట్లకు రిజిస్ట్రేషన్, లైసెన్సింగ్ ప్రక్రియలను కూడా కఠినతరం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు, ఇతర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నిషేధం ద్వారా సముద్ర జీవ వ్యవస్థను కాపాడటంతో పాటు భవిష్యత్తులో మత్స్య సంపద పెరుగుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

## కపిల్‌ను కలిసిన గంటా

### - తొందర్లో సిటీ ఆఫ్ డెస్టినీకి వస్తానన్న క్రికెట్ లెజెండ్

**విశాఖపట్నం, ఏప్రిల్ 13,ప్రభాతవార్త**



విశాఖ అంటే తనకెంతో ఇష్టమని.. తొందర్లోనే సందర్శిస్తానని క్రికెట్ లెజెండ్ కపిల్ దేవ్ అన్నారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తన మిత్రులతో హైదరాబాద్‌లో కలిసినప్పుడు విశాఖ రావాలని కోరగా తప్పకుండా వస్తానని గోల్ఫ్ కూడా ఆడదామని కపిల్ చెప్పారు. 1983లో దేశానికి మొట్ట మొదటి వరల్డ్ కప్ అందించిన టీమిండియా కెప్టెన్ కపిల్ దేవ్ 43 ఏళ్ల క్రితం నాటి క్రికెట్ గురించి.. నేటి తరం క్రికెట్ గురించి.. మాట్లాడారు. అరుదైన క్రికెట్ జ్ఞాపకాలను పంచుకున్నారు. సీఎం చంద్ర బాబు సారథ్యంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి గురించి కపిల్ దేవ్‌కు గంటా వివరించారు. సిటీ ఆఫ్ డెస్టి నీ విశాఖ పర్యటన కోసం ఎదురు చూస్తున్నానని కపిల్ తెలియజేశారు.

ong-9_ong-9.qxd 4/13/2026 11:52 PM Page 1



## వృద్ధుల కోసం ఇంటి వద్దనే నేత్ర సంరక్షణా సేవలు

**ఆరిలోవ, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**



ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య శాల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక ఒడిశా రాష్ట్రాలలో పటిష్టమైన నెట్ వర్క్ కలిగిన పేరొందిన నేత్ర వైద్యశాల. ఇప్పుడు వృద్ధులు, నడవలేని వారి కోసం ఎల్ వి ప్రసాద్ ఆసుపత్రి ఒక విశిష్టమైన వినుత్నమైన కంటి సంరక్షణా సేవలను సౌకర్యవంతంగా ఇంటి వద్దనే అందించుటకు నూతన ఆవిష్కరణను ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా కన్సల్టెంట్ ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ యషస్ గోయల్ మాట్లాడుతూ ఈ ఆవిష్కరణ కంటిశుక్లం, గ్లాకోమా, డయాబెటిక్ రెటినోపతి, దృష్టికి ప్రమాదకరమైన ఇతర సమస్యలను ముందస్తుగా గుర్తించి, సకాలంలో చికిత్స అందించుటకు సహకరిస్తుందని, ప్రపంచ స్థాయి రోగ నిర్ధారణ, చికిత్సను వృద్ధుల ఇంటి వద్దకే తీసుకురావడంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోంది న్నారు. ప్రపంచ దృష్టి దినోత్సవం 2024న ప్రారంభమైనప్పటి నుండి, హైదరాబాద్, భువనేశ్వర్, విశాఖపట్నం, విజయవాడ, మదనపల్లె, సిరిసిల్ల, బెర్హంపూర్ పరిసరప్రాంతాలలోని 66,590 మందికి పైగా వృద్ధులకు, నడవలేని వారికి ఎల్‌విపిఇఐ హోమ్ సేవలను అందించినట్లు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వృద్ధులకు 950 కళ్లజోళ్లను ఉచితంగా పంపిణీ చేయటమే కాకుండా 326 శస్త్రచికిత్సలు నిర్వహించా మన్నారు. ఈ సేవలను రోగులు ఫోన్ ద్వారా అపాయింట్‌మెంట్ తీసుకుని, శిక్షణ పొందిన విజన్ టెక్నీషియన్ లేదా ఆప్టోమెట్రిస్ట్ వారి ఇంటి వద్దనే సమగ్ర కంటి పరీక్షను నిర్వహిస్తారని, ఇంటి వద్దనే రోగుల వివరణాత్మక చరిత్ర సేకరణ, టార్చ్‌లైట్ పరీక్ష, రిఫ్రాక్షన్, కంటి ముందు భాగం, లోపలి భాగం ఒత్తిడిని అంచనా వేయటం, వైద్యుడు సూచిచే అల్ట్రాసౌండ్ బిస్కాన్, రెటీనా ఓ సి టి , ప్యూపిల్ ఎక్స్ వంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వైద్యులు సూచించిన కళ్లజోడును ఇంటికే అందించడం అర్హులైన నిరుపేద వృద్ధులకు ఉచిత కళ్లజోడు, నిరుపేద రోగులకు ఉచిత కంటిశుక్లం శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## భారతి స్కూల్లో స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమం

**- ముఖ్య అతిథిగా సీఎంఓహెచ్ డాక్టర్ నరేష్**

**ఆరిలోవ, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**



తూర్పు నియోజకవర్గం స్థానిక 12వ వార్డు ఆరిలోవ టిఎస్సి పాయింట్ వద్ద ఉన్న భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సోమవారం స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎంఓహెచ్ డాక్టర్ నరేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నాలుగు రంగుల డబ్బాల గురించి వివరించారు. అదేవిధంగా తడి పొడి ప్రమాదకరమైన చెత్త, చెత్త సేకరణ తీరు, పారిశుద్ధ్య సిబ్బంది చెత్త తరలింపు, చెత్తను ఎలా విభజించాలి ఏ రకంగా శాస్త్రీయంగా మనం చేయాలి అనే విషయంపై అవగాహన కల్పించారు. అనంతరం ఉత్తమ పారిశుద్ధ్య కార్మికులను ఆయన చేతులు మీదుగా సాలువలతో సత్కరించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఓహెచ్ ప్రసాద్, ఎస్ఎస్ సత్యనారాయణ, శానిటరీ ఇన్స్పెక్టర్ అబ్దుల్ మీరా, తెదేపా నాయకులు ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలని డ్వాక్రా ఎస్‌హెచ్‌జి సభ్యులు, విఓఏలు ధర్నా

**పద్మనాభం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**



ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల వెలుగు కార్యాలయం వద్ద ఎస్ హెచ్ జి సభ్యులు, విఓఏలు ధర్నా నిర్వహించారు. ఏళ్ల తరబడి డ్వాక్రా గ్రూపుల మహిళలకు పొదుపులు కట్టించడం, బ్యాంకుల నుండి రుణాలు కట్టించడం, ఇప్పించడం వంటి సేవలు అందిస్తున్నా పాలకులు తమను కనికరించలేదని వారు ఆవేదన చెందారు. డ్వాక్ర సభ్యులకు ఎఫ్ ఆర్ ఎస్ హాజరు పద్ధతిని రద్దు చేయాలని, విఓఎలు మూడు నెలల జీతాలు చెల్లించాలని, పది లక్షల వరకు వడ్డీ రాయితీని అమలు చేయాలని, అభయ హస్తం కట్టిన అరవై ఏళ్ల దాటిన అర్హులకు ఫించన్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేసారు.

## ప్రధానమంత్రి ఎస్సీ ఎస్టీ సూర్యఘర్ యోజన ఉత్సవ్ ప్రారంభించిన ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు

**మాధవధార, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకముగా ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించేందుకు ఏపీఈపిడిసిఎల్ ఆపరేషన్ డివిజన్ జోన్ 2లో ఎన్ఎస్టిఎల్ సెక్షన్ పరిధిలో మాదవధార,అంబేద్కర్ కాలనీ వద్ద ప్రధానమంత్రి ఎస్సీ /ఎస్టీ సూర్యఘర్ యోజన ఉత్సవ్ కార్యక్రమాన్ని నార్త్ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజలకు సౌర విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించడం, సబ్సిడీ పథకాలను వివరించడం మరియు ఉచిత విద్యుత్ దిశగా వారిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని, "పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన" ద్వారా లభించే ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడానికి ఈ ఉత్సవాన్ని ఏర్పాటు చేశామన్నారు. విశాఖ ఉత్తర నియోజవర్గ ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగించుకొని వారి ఇళ్లపై సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం సర్కిల్ ఎస్ఈ జీ.శ్యాంబాబు, జోన్ 2 ఈఈ బి.కె. నాయుడు,జోన్ 1 ఈఈ శ్రీనివాస్ రావు,కంచరపాలెం డిప్యూటీ ఈఈ శివ సత్యనారాయణ, అసిస్టెంట్ ఈఈ వెంకటేశ్వర్రావు,సిబ్బంది,ప్రజా ప్రతినిధులు, వినియోగదారులు పాల్గొన్నారు.

## జయ దుర్గాదేవి ఆలయంలో గణబాబు పూజలు

**గాజువాక,ఏప్రిల్ 13,ప్రభాతవార్త**



మల్కాపురం జనతా కాలనీలోని శ్రీ శ్రీ జయ దుర్గాదేవి ఆలయంలో నిర్వహించిన సహస్ర కలశ పూజలో ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, నియోజకవర్గం అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అనుబంధ కళాశాలల అభివృద్ధియే లక్ష్యం

**గాజువాక,ఏప్రిల్ 13,ప్రభాతవార్త**




అనుబంధ కళాశా లలను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే ఆంధ్ర విశ్వవిద్యాలయ ధ్యేయమని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి. రాజశేఖర్ పేర్కొన్నారు. వర్సిటీ శత జయంతి మహోత్సవాల్లో భాగంగా గాజువాకలో నిర్వహించిన అనుబంధ కళాశాలల ర్యాలీలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు వర్సిటీలో ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, సెయింట్ ఆన్స్ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వారిని సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపల్ డా. సిస్టర్ ప్రేమకుమారి అభినందించారు.

## అక్కిరెడ్డిపాలెంలో తప్పిన పెను ప్రమాదం

**గాజువాక,ఏప్రిల్ 13,ప్రభాతవార్త**



అక్కిరెడ్డిపాలెం ప్రధాన రహదారిపై సోమవారం తృటిలో పెను ప్రమాదం తప్పింది. రహదారిపై ఆకస్మికంగా నిలిపివేసిన ఆర్టీసీ బస్సును తప్పించబోయి ఓ ట్రాలీ లారీ డివైడర్‌పైకి దూసుకెళ్లింది. వివరాల్లోకి వెళ్తే....గాజువాక పోలీస్టేషన్ పరిధి అక్కిరెడ్డిపాలెం వద్ద ఒక ఆర్టీసీ బస్సు అకస్మాత్తుగా రోడ్డుపై నిలిచిపోయింది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ట్రాలీ లారీ.. బస్సును ఢీకొట్టకుండా ఉండే క్రమంలో డ్రైవర్ చంద్రమోహన్ చాకచక్యంగా వ్యవహరించారు. లారీని డివైడర్ వైపు మళ్లించడంతో అది డివైడర్ ఎక్కి నిలిచిపోయింది. లారీ డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో అటు బస్సులోని ప్రయాణికులకు, ఇటు లారీ డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో రోడ్డుపై కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

## భారతరత్న ,రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు

**గాజువాక,ఏప్రిల్ 13,ప్రభాతవార్త**



పంచ తీర్థములుగా అభివృద్ధి చేస్తు న్నభారతీయ జనతా పార్టీ. మహారాణిపేట మండలము బిజెపి, శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ సంయుక్త నిర్వహణలో ప్రకృతి చికిత్సాలయం మహారాణిపేట ఆవరణలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎస్ లక్ష్మీనారాయణ ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. వారు ప్రసంగిస్తూ అంబేద్కర్ గొప్పతనాన్ని భారతీయ జనతా పార్టీ గుర్తించిందని వారి జయంతి నాడు సెలవు దినముగా ప్రకటించడం వాజ్పాయ్ గారి చలవేనని అన్నారు ప్రధాని మోడీ అంబేద్కర్ జన్మస్థలము, స్థలము, విద్యా స్థలము, మరణించిన స్థలము, పెరిగిన ప్రాంతము, నివాస స్థలము మొదలగు వాటిని పంచ తీర్థము లు గా అభివర్ణించి ఆ ప్రాంతాలను అభివృద్ధి చేయుటకు కృషి చేస్తున్నారని అన్నారు. సమరయోధులను మహనీయులను గౌరవించడం మన సంప్రదాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ వైద్య విభాగ కన్వీనర్ రూపాకుల రవికుమార్, మహారాణి పేట మండల అధ్యక్షులు దేవర చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ మైనార్టీ మోర్చా నాయకులు ఓ ఆల్బర్ట్, సిహెచ్ రాజబాబు , నగర ఉపాధ్యక్షురాలు తలాడ గిరిజ, ఎస్ శ్రీలక్ష్మి, ఆడారి కిషోర్, బి భాస్కర్ రావు, పూర్ణ మార్కెట్ గోవింద్, గేదెల శ్రీహరి, ఉమా, మల్లీశ్వరి, జ్యోతి, సునీత, హారతి, ప్రియాంక అధిక సంఖ్యలో స్థానికులు కార్యకర్తలు పాల్గొని నడిపించారు ఈ సందర్భంగా ప్రకృతి చికిత్సలయంలోని రోగులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు.

## కృష్ణాపురం గ్రామంలో నూతన క్వారీ ఏర్పాటును నిలుపదల చేయాలి

**పద్మనాభం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**



మండలంలో కృష్ణాపురం గ్రామంలో సర్వేనెంబరు ఒకటిలో లక్ష్మీ నరసింహ రాక్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేయనున్న నూతన క్వారీని నిలుపదల చేయాలని ఇదే గ్రామానికి చెందిన గాడు అప్పనాయుడు,అప్పలరాజులతో పాటు గ్రామ ప్రజలు సోమవారం కలెక్టరేట్ లో జరిగిన పి జి ఆర్ ఎస్ లో ఫిర్యాదు చేసారు. ఇప్పటికే గ్రామంలో ఉన్న క్వారీల బ్లాస్టింగ్ లు, శబ్ద,వాయు కాలుష్యాలతో ప్రజలు,పశువులు ఇబ్బందులు పడుతున్నట్లు వారు జిల్లా అధికారులకు వివరించారు. అలాగే ప్రాణ నష్టాలు కూడా జరుగుతున్నాయని,సమయంతో సంబంధం లేకుండా బ్లాస్టింగ్‌లు చేయడంతో ఇల్ల నిర్మాణాలు దెబ్బతింటున్నాయని వారు ఆవేదన వెల్లబుచ్చారు. గతంలో ఉన్న పరిమితికి మించి తవ్వకాలు చేయడంతో లోయలు ఏర్పడ్డాయని తెలిపారు. నూతన క్వారీ ఏర్పాటు ప్రజాభిప్రాయ సేకరణను గ్రామ చివర పెట్టి అధికారులు మమా అనిపించారని,ఈ క్వారీలు వల్ల కొండతరిగిపోయి పశువులు,మేకలు,గొర్రెలు పెంపకం ప్రశ్నార్థకమవుతుందని వారు చెప్పారు. నూతన క్వారీ ఏర్పాటును ఆపాలని వారు కోరారు.

## శ్రీ రామ స్వామివారి శోభ యాత్రకు ఘనంగా స్వాగతం

**విశాఖపట్నం, ఏప్రిల్ 13. ప్రభాతవార్త**



విజయనగరం జిల్లా, నెల్లిమర్ల మండలం, రామతీర్థంలో వేంచేసి యున్న శ్రీ రామ స్వామివారి భిన్నమైన విగ్రహాలను జలాధివాసం (నిమజ్జనం) చేయుటకు జరుగుతున్న శోభాయాత్ర సోమవారం ఉదయం రాజపులోవ వద్ద (విశాఖపట్టణం బోర్డర్)కు చేరుకుంది. ఈ శోభాయాత్ర కార్యక్రమములో విశాఖపట్టణం జిల్లా, దేవాదాయ ధర్మదాయ శాఖ, ఉప కమీషనరు ఎన్. సుజాత, సహాయ కమీషనరు టి. అన్నపూర్ణ,అనకాపల్లి జిల్లా ఏసీ సుధారాణి వివిధ ఆలయాల కార్యనిర్వహణాధికారులు, సిబ్బంది భాగస్వాములై స్వాగతం పలికారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల గుండా శోభాయాత్ర సాగింది. ఈ కార్యక్రమములో అధిక సంఖ్యలో భక్తులు, సేవకులు పాల్గొని హారతులతో, పుష్పాలతో శ్రీ స్వామివారిని కీర్తించారు. అనంతరం అనకాపల్లి జిల్లా వైపు యాత్ర కొనసాగింది. అనకాపల్లి జిల్లాలోని హైవేలో శ్రీ నూకాలమ్మ ఆర్చిగేటు వద్ద శ్రీ స్వామివారి శోభాయాత్రకు విశాఖపట్టణం జిల్లా అధికారులు అధికారులు వీడ్కోలు పలకగా, అనకాపల్లి జిల్లా దేవాదాయ శాఖ అధికారులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమములో నెలిమర్ల శాసన సభ్యులు లోకం మాధవి, మాన్సాస్ ట్రస్టు, ఉప కమీషనరు, కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్, రామతీర్థం సహాయ కమీషనరు మరియు కార్యానిర్వహణాధికారి వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులు నిర్వహించకపోతే ఉపేక్షించేది లేదు

**మాధవధార, ప్రభాతవార్త**



జీవీఎంసీ 50వ వార్డు మాధవధార, మురళి నగర్‌లో నార్త్ జోన్ జోనల్ కమీషనర్ బొడ్డేపల్లి రాము సోమవారం పర్యటించారు. సానిటరీ ఇన్స్‌స్పెక్టర్ సుధాకర్, సూపర్వైజర్ చిరంజీవితో కలిసి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. క్లాప్ వాహనాల పని తీరు పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ గూర్చి అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని సూచించారు. పారిశుద్ధ్య పనులు విధిగా నిర్వహించకపోతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. విధిగా ఎపటికప్పుడు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షణ చేయాలని సానిటరీ ఇన్స్‌స్పెక్టర్ సుధాకర్ ను ఆదేశించారు. ప్రజల నుంచి పిర్యాదుకు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## హాస్టళ్లలో వసతులు మెరుగుపరచాలి

**- జిల్లా కలెక్టర్‌కు బీజేపీ నేతల వినతి**

**గాజువాక,ఏప్రిల్ 13,ప్రభాతవార్త**



జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి వసతి గృహాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించి, విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలోని పలు హాస్టళ్లలో విద్యార్థులు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే హాస్టళ్ల పరిస్థితులపై సమీక్ష నిర్వహించి, గదుల మరమ్మతులు, తాగునీరు, పారిశుధ్యం వంటి సౌకర్యాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ సూచనల మేరకు జిల్లా అధ్యక్షులు పరశురాం రాజు ఆధ్వర్యంలో నాయకులు కలెక్టర్‌ను కలిశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ డాక్టర్ కరణంరెడ్డి నరసింగరావు, మండల అధ్యక్షులు చేబ్రోలు అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లీబిడ్డల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

**- అంగన్‌వాడీల ద్వారా అవగాహన కల్పించాలి: గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు**

**గాజువాక, ఏప్రిల్ 13,ప్రభాతవార్త**



గర్భిణులు, బాలింతలు, పుట్టబోయే బిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన కల్పించడమే ఖిపోషణ పక్వాడఖి లక్ష్యమని గాజువాక శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం గాజువాకలోని పార్టీ కార్యాలయంలో సీడీపీఓ డి. నీలవేణి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బిడ్డ గర్భం దాల్చినప్పటి నుంచి రెండు సంవత్సరాల వరకు ఉండే వెయ్యి రోజుల కాలాన్ని (గోల్డెన్ విండో) అత్యంత కీలకమైనదిగా గుర్తించాలన్నారు. ఈ సమయంలో తీసుకునే పౌష్టికాహారం, ఆరోగ్య జాగ్రత్తలే బిడ్డ భవిష్యత్తుకు పునాది అని వివరించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వ పథకాలు, పౌష్టికాహారంపై కార్యకర్తలు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఖిపోషిత్ భారత్ఖి నిర్మాణంలో అంగన్‌వాడీల పాత్ర కీలకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 68వ వార్డు సమస్యల పరిష్కారానికి వినతి

**- జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్ అనుష, వైకాపా నేత లతీష్**

**గాజువాక,ఏప్రిల్ 13,ప్రభాతవార్త**



జీఎంసీ 68వ వార్డు పరిధిలోని వివిధ ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ గుడివాడ అనుష, వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ సోమవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వార్డులో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులపై వారు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. రాజీవ్ నగర్ కొండ ప్రాంతంలో నేల స్వభావం కారణంగా రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. రానున్న వర్షాకాలంలో కొండ చరియలు విరిగిపడే ప్రమాదం ఉందని, తద్వారా ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ముందస్తు జాగ్రత్త చర్యగా అక్కడ వెంటనే రిటైనింగ్ వాల్ (రక్షణ గోడ) నిర్మించాలని, ఇందుకు అవసరమైన నిధులను తక్షణమే మంజూరు చేయాలని కోరారు. దెబ్బతిన్న అంతర్గత రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని విన్నవించారు. వార్డులోని ఇతర పెండింగ్ పనులపై కూడా చర్చించగా, కమిషనర్ సానుకూలంగా స్పందించారు. సమస్యల తీవ్రతను బట్టి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జనతా వారధి

**గాజువాక,ఏప్రిల్ 13,ప్రభాతవార్త**



భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఖిజనతా వారధిఖి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని గాజువాక బీజేపీ ఇంచార్జ్, రాష్ట్ర బీజేపీ మీడియా పానలిస్ట్ డా. కర్ణంరెడ్డినరసింగరావు తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద భాజపా ఆధ్వర్యంలో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని (హెల్ప్ డెస్క్) ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి వినతులను స్వీకరించి, అనంతరం జిల్లా కలెక్టర్ సహా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కేఎన్ఆర్ మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం పార్టీ కార్యాలయంలో ప్రజల కష్టాలను తెలుసుకుంటున్నామని, వాటి పరిష్కారం కోసం ప్రతి సోమవారం అధికారులను కలుస్తున్నట్లు వివరించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఈ కార్యక్రమం ఒక వారధిలా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

## మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

**గాజువాక,ఏప్రిల్ 13,ప్రభాతవార్త**



మానవ సేవే మాధవ సేవగా భావించి బాటసారుల దాహం తీర్చడం అభినందనీయమని భాజపా నేత డా.కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్) పేర్కొన్నారు. కొత్త గాజువాక మార్కెట్ సమీపంలో శ్రీ పూజా ఖజానా స్టోర్స్ యజమాని సింగంశెట్టి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మార్కెట్‌కు వచ్చే ప్రజల కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వాసవి సేవా సమితి ప్రతినిధులు సతీష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

vsp10:vsp10.qxd 13-04-2026 22:38 Page 1






## కలుషితానికి చెక్... అభివృద్ధి దిశగా చెరువు



(అచ్చుతాపురం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త ): అచ్చుతాపురం మండలం దుప్పుతూరు గ్రామ రెవెన్యూ పరిధిలో గల కునిసెట్టి బలిజ వాణి చెరువును రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, ఎలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, స్థానిక తహశీల్దార్ శ్రీను సోమవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. చెరువు పరిసరాలను సమగ్రంగా తనిఖీ చేసి, ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై అధికారులతో వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ చెరువు పూర్తిగా కలుషితమైందని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమల వ్యర్థాలు, అనధికారికంగా పారబోయ బడుతున్న మలినాలు చెరువులో కలుస్తుండటంతో నీటి నాణ్యత తీవ్రంగా దెబ్బతిన్నదని పేర్కొన్నారు. వెంటనే కలుషిత వ్యర్థాల ప్రవాహాన్ని అడ్డుకునేలా కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజలు, పాడి పశువులు ఆరోగ్య సమస్యలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవా లని, చెరువును అక్రమార్కుల ఆక్రమణల నుంచి కాపాడాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి లభించే నిధులను సమర్థవంతంగా వినియోగించి చెరువును అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. చెరువు పునరుద్ధరణతో గ్రామానికి పర్యావరణ పరిరక్షణతో పాటు భూగర్భ జలాల పెరుగుదలకు కూడా దోహదం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కూనిశెట్టి రమణ, సీనియర్ నాయకులు కర్రీ వెంకటరమణ, దేశం శెట్టి కాసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్యం వెదజల్లుతున్న కంపెనీలను మూసివేయాలి





అనకాపల్లి, ఏప్రిల్ 13, (ప్రభాత్ వార్త): విషవాయువు వెదజల్లుతున్న కంపెనీలను తక్షణమే మూసివేయాలని డిమాండ్ చేస్తూ అనకాపల్లి మండలం పిసినిగాడ పంచాయతీ శివారు బి ఆర్ టి కాలనీ ప్రజలు సోమవారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పిసినిగాడ గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 14/1 లో ఉన్న మహాలక్ష్మి గ్రూప్ వారి మెసర్స్ మహాలక్ష్మి వాల్ మెన్ ఫుల్ ప్రైవేట్ లిమిటెడ్ వారి అనహిత రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్, జైత్ర స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్, బొగ్గు పరిశ్రమలలో వెలువడే విషవాయువు పొల్యూషన్ చుట్టుపక్కల గ్రామాల్లో నివసిస్తున్న గ్రామస్తులను ఊపిరిరాడకుండా చేస్తున్నాయని, తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నామని పేర్కొన్నారు. ఆరు నెలలుగా ఇక్కడ పొల్యూషన్ ద్వారా వచ్చు వాయువు, దుమ్ము ధూళితో ప్రజలు విపరీతమైన పరిస్థితులు నెలకొంటున్నాయని గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మొదట్లో ఒక కంపెనీ బోర్డు ఉండేది అని, ఇప్పుడు పలు రకాల బోర్డులు దర్శనం ఇవ్వడం ఏదో ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని గ్రామస్తులు ఆరోపించారు. పలు రకాల ఫారం పేర్లతో నేమ్ బోర్డులు పెట్టి బ్యాంకుల్ని మోసగిస్తున్నారా అనేలా అక్కడ తీరు ఉందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అనుమతులతో పని లేకుండా కంపెనీలు పొల్యూషన్‌తో ప్రజలు ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని గ్రామస్తులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గత నెల 15న చేపట్టిన ఉద్యమం మళ్లీ ఇంతవరకు అధికారులు ఎటువంటి వివరణ ఇవ్వలేదన్నారు. మరో మారు ఉద్యమానికి దారితీసామన్నారు. ఇదే కొనసాగితే పూర్తిస్థాయి కంపెనీ మూయించేందుకు ప్రాణాలకు తెగించి ఉద్యమం చేపడుతామన్నారు. ఒకేచోట రెండు బొగ్గు ప్లాంట్లు, అనుమతులకి సంబంధం లేకుండా ఏర్పాటు చేయడం చూస్తే సంబంధిత అధికారుల ప్రమేయం ఉందని ఆరోపించారు. నిరసన కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఇక్కడ జిల్లా పొల్యూషన్ కంట్రోల్ శాఖ అధికారి ముకుందరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రసాదరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కి పలుమార్లు ఇచ్చిన ఫిర్యాదులు మేరకు పరిశీలించామని దీనివల్ల ఎటువంటి ఇబ్బందులు లేవని తేల్చి చెప్పారు. పొల్యూషన్ బోర్డ్ నుంచి చేపట్టిన చర్యలను బుధవారం విశాఖలో గల పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ కార్యాలయానికి వస్తే అక్కడ బహిర్గతం చేసి అందరికీ వివరిస్తామన్నారు. బిఆర్టి కాలనీ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల మూడు గ్రామాలకు చెందిన ప్రజలు కూడా మద్దతు తెలిపారు. సంబంధిత అధికారులు వచ్చి వీటన్నిటిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టకపోతే అనకాపల్లి కలెక్టరేట్ కార్యాలయం వద్ద గ్రామస్తులు అంత కలిసి నిరసన కార్యక్రమాలు చేపడతామని ప్రస్తుతం చేసిన ధర్నాలో తెలిపారు. వైయస్సార్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి మలసాల భరత్ , పార్టీ మండల అధ్యక్షుడు పెద్ద శెట్టి గోవిందు, బొడ్డేడ శివ నిరసనలో పాల్గొని కంపెనీ వారితో మాట్లాడుతూ ఈ సమస్యపై పరిష్కారం చూపనీయడల వైయస్సార్ పార్టీ పూర్తిస్థాయి ఉద్యమానికి సిద్ధమని తెలిపారు. పార్టీలకు అతీతంగా నిరసనలో పాల్గొని ఇలాంటి ఉద్యమాలు సాధించుకోవాలని ఎందరో పసికందుల ఆరోగ్య పరిస్థితి చూసి ఎంతో బాధని కలిగించిందని ఈ ఉద్యమాన్ని మరింత బలపరిచేం దుకు మేము సిద్ధమని తెలిపారు. ఎంపీటీసీ ముల్లేటి హేమ, బుద్ధ నాగేష్ , ఎల్లపు వెంకట్రావు, పెద్దిశెట్టి రమేష్, మల్ల శ్రీని వాసరావు, సరిష భాస్కర్ రావు, నీలకంఠ సంతోష్ లక్ష్మి, మేడేపల్లి పాపారావు, అప్పన్న రమణమ్మ, బండి రాధిక, పోలమరశెట్టి నూకరాజు, కాండ్రేగుల పరమేష్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## అనకాపల్లి చేరుకున్న శ్రీరాముల వారి శోభాయాత్ర



అనకాపల్లి ఏప్రిల్ 13 (ప్రభాత వార్త) : దేవాదాయ ధర్మాదాయ శాఖ విజయనగరం జిల్లా రామ తీర్థం నుండి దెబ్బతిన్న స్వామి వారు అమ్మవారి విగ్రహాలను కోటిపల్లి గోదావరి నదిలో నిమజ్జనంలో కొరకు ఆలయ వద్ద నుండి బయలుదేరిన స్వామి వాహనం విజయనగరం మీదు అనకాపల్లి బైపాస్ రోడ్ తోటాడ జంక్షన్ వద్దకు సోమవారం చేరుకుంది. శ్రీనూకాంబిక అమ్మవారి దేవస్థానం తరుపున దేవదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, జిల్లా సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణ అధికారి, ఆలయ చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయ అర్చకులు సిబ్బంది యాభై మంది భక్తజన సందోహం మధ్య శ్రీ రాములవారి జీర్ణార్ధన నిమర్జనం కార్యక్రమం మహోత్సవం అమ్మవారి దేవాలయం ఆర్చి హైవే దగ్గర వచ్చిన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ నుండి కోటిపల్లి గోదావరి నదికి చేరుకుంటుంది. దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), డిప్యూటీ కమిషనర్ ఎన్. సుజాత, జిల్లా సహాయ కమి కె.ఎల్ సుధారాణి, ఆలయ సహా కమిషనర్ యాళ్ళ శ్రీధర్, వివిధ ఆలయాల ఈవోలు, ఆలయాల సిబ్బంది, ఆలయ ధర్మకర్తలు భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## నక్కపల్లి జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

### భర్త కళ్ల ముందే భార్య దుర్మరణం.. భర్త, పిల్లలకు తీవ్ర గాయాలు



(నక్కపల్లి రూరల్/అడ్డు రోడ్డు, ప్రభాతవార్త) : నక్కపల్లి జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది ఈ రోడ్డు ప్రమాదంలో భర్త కళ్ళముందే భార్య మృతి చెందిన సంఘటన.! విజయనగరం జిల్లా గాజులురేగ గ్రామానికి చెందిన సీత సురేష్ అనే వ్యక్తి మండలంలోని రాజయ్యపేట వద్ద ఉన్న ఎటిరో ఔషధ పరిశ్రమలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం నక్కపల్లి పట్టణంలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఎస్. రాయవరం మండలం అడ్డురోడ్డు లో ఉన్న ఆసుపత్రికి తన బైక్ పై భార్య షారో రేఖ ,కుమార్తె సావ్యశ్రీ ,కుమారుడు రోషన్ లతో కలిసివెళ్లి డాక్టర్ ను సంప్రదించి తిరిగి బైక్ పై నక్కపల్లి వైపు వస్తుండగా వెనుక నుంచి అదుపుతప్పి వస్తున్న లారీ మండలంలోని సారిపల్లి వాణిపాలెం జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఢీకొట్టడంతో ప్రమాదం సంభ వించింది. ఈ ప్రమాదంలో భర్త సురేష్ ,ఇరువురు పిల్లలు ఢీకొట్టిన సందర్భంలో పక్కనే ఉన్న రోడ్డుపై తూలిపడ్డారు. భార్య షారోన్ రేఖ (30) లారీ కింది పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది .భర్తసురేష్ ,పిల్లలు కళ్ళముందే భార్య మృతి చెందడంతో కుప్పకూలిపోయారు. వీరిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. సంఘటన విషయం తెలిసిన వెంటనే సిఐ జూరెడ్డి మురళి ఆధ్వర్యంలో ఎస్సై సన్నిబాబు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన చిన్నారులు, భర్త సురేష్‌ను ఆసుపత్రికి తరలించారు .ఎస్ఐ సన్నీ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలి : జేసీ



అనకాపల్లి, ఏప్రిల్ 13 (ప్రభాత వార్త): ప్రజా సమస్యల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ లో వచ్చిన అర్జీల ను పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధం గా సంతృప్తి కరమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్ జిల్లా అధికా రులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమా వేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన అర్జీదారుల సమస్యలను తెలుసుకొని, వారికి భరోసాను కల్పిస్తూ, అర్జీలను స్వీకరిస్తూ, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణరావు వినతుల స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలే పరిష్కారమే ధ్యేయంగా అధికారులు కృషి చేయాలన్నారు. పిజిఆర్ఎస్ కు విచ్చేసిన అర్జీదారుడు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందేలా సత్వర, శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడి, సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలని, అందువల్ల అర్జీలు పునరావృతం కాకుండా ఉంటాయని తెలిపారు. అర్జీ పునరావృతం అయ్యిందంటే జిల్లా అధికా రులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 108 అర్జీలు అందాయి. అదేవిధంగా రెవెన్యూ క్లినిక్ కు 173 వినతులు అందాయి. కార్యక్రమంలో వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు.

## పకడ్బందీగా గృహగణన, జనగణన



మాకవరపాలెం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గృహగణన, జనగణన కార్యక్రమం పకడ్బందీగా చేపట్టనున్నట్లు తాసిల్దార్ ముజీబ్ అన్నారు. ఈమేరకు సోమవారం జనగణన ఎన్యూమరేటర్స్, సూపర్వైజర్ తొలిదశ శిక్షణ ముగిసింది. కార్యక్రమ నిర్వాహకులు మండల తాసిల్దార్ ముజీబ్ సందర్భంగా మాట్లాడుతూ మాకవరపాలెం మండలంలో 100 గృహ లెక్కింపు బ్లాకులుగా విభజించడం జరిగిందన్నారు. ఈబ్లాకుల పరిధిలో 92మంది ఎన్యుమరేటర్లు, 16మంది సూపర్వైజర్లు నియమించినట్లు తెలిపారు. సర్వే ప్రక్రియ వేగవంతం చేసేందుకు గాను అదనంగా 10మంది ఎన్యూమరేటర్లు ఇద్దరు సూపర్వైజర్లను అదనంగా తీసుకొని శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ కాలాన్ని మూడు దశలుగా విభజించి మొదటి దశ శిక్షణ ఏప్రిల్ 9. 10.13 రెండవదశ శిక్షణ కార్యక్రమం రెండవ దశ 15.16.17 తేదీల్లోను, మూడవ దశ శిక్షణ కార్యక్రమం 21.22.23 తేదీలలో శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. గృహగణన జనగణన కార్యక్రమం ఏప్రిల్ 16 తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు తాసిల్దార్ తెలిపారు. ప్రజలు సర్వే ప్రక్రియ ప్రాధాన్యతను గుర్తించి సిబ్బందికి సహకరించి తమ వివరాలను నమోదు చేయించుకోవాలని తాసిల్దార్ ముజీబ్ పిలుపునిచ్చారు. సర్వే ప్రక్రియ కోసం ప్రతి ఇంటికి సిబ్బంది వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ తమ గుర్తింపు కార్డును చూపించాలన్నారు. తొలి దశ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఎంపీడీవో సాయి సుధా, సహాయ గణాంకఅధికారి రామకృష్ణ తొలిదశ శిక్షణ కార్యక్రమంలో 38మంది సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత ఆయుర్వేద శిబిరం



(ఎస్. రాయవరం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త): మండల కేంద్రమైన ఎస్ రాయవరం గ్రామంలో కర్రి వీధిలో గల హెల్త్ క్లినిక్ సెంటర్లో సోమవారం సర్పంచ్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారిణి ఆర్. సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 50 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయుష్ శాఖ డైరెక్టర్ గోపాలకృష్ణ ఆదేశాల మేరకు నెలకు 10 గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో గ్రామాల్లో ఉచిత ఆయుర్వేదిక్ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యంగా మోకాళ్ళ నొప్పులు, గ్యాస్ట్రిక్ చర్మ వ్యాధులు, దగ్గు, జ్వరం అన్ని రకాల వ్యాధులకు మా డిస్పెన్సరీ సర్పంచ్ హాస్పిటల్లో సుమారు 10 లక్షల రూపాయల మందులు వరకు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యాధుల బారిన పడకుండా ముందుగా తగు జాగ్రత్తలు తీసుకొని మందులు వాడి వ్యాధులు రాకుండా ఉండవచ్చని ఆమె తెలియజేశారు.

## మెడికల్ క్యాంపునకు విశేష స్పందన



నక్కపల్లి రూరల్, ఏప్రిల్ 13, ప్రభాత వార్త : పీపుల్స్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో మెడికవర్, వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో నక్కపల్లి మండలం ఎస్. నర సాపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన మెగా మెడికల్ క్యాంపుకు విశేష స్పందన లభించింది. గ్రామానికి చెందిన మనబాల రాజేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ వైద్య శిబిరాన్ని పాతశాల ప్రధానోపాధ్యాయులు రాజు చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పలరాజు బీపీ షుగరు గుండె జబ్బులు వయసుతో సంబంధం లేకుండా చాలామందికి సోకుతుండటం దీని ప్రారంభ దశలో గమనిస్తే నష్టాన్ని తక్కువ చేసుకోగలమని ఆ వ్యాధితో బాధపడుతున్న వారికి తెలియజేశారు. మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ రాజు మాట్లాడుతూ ఈ పరీక్షలతో పాటు క్యాన్సర్ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నామని, దీన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని, క్యాన్సర్ను ప్రారంభ దశలో గుర్తిస్తే సంపూర్ణంగా చికిత్స జరుగుతుందని తెలియజేశారు. పుష్పగిరి హాస్పిటల్స్ వారు కంటి పరీక్షలు నిర్వహించి పూర్తిస్థాయిలో చేసి కంటి ఆపరేషన్లు అవసరం ఉన్నవాళ్లను గుర్తించి మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆపరేషన్ చేయడం జరుగుతుందని కార్యక్రమంలో పల్లా చిన్నాబ్బాయి, మనబాల గంగరాజు, గట్టెం గణేష్ మనబాల కొండబాబు, సారిపల్లి లోవరాజు, గొర్ల రమణ బాబు, చొప్ప మంగరాజు, మనబాల శ్రీను, వియ్యపు అప్పారావు, కొల్లి బుజ్జి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## హోమంత్రిని కలిసిన ఇన్‌చార్జి ఎంపీడీవో చలపతిరావు



(నక్కపల్లి, ప్రభాతవార్త): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత విశాఖపట్నంలో ఉన్న క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉదయం ఇటీవల నూతనంగా బాధ్యతలు నక్కపల్లి ఎంపీడీవోగా చేపట్టిన కె.చలపతిరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలానికి సంబంధించిన పలు విషయాలను హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లి చర్చించారు.

## మాకవరపాలెం - యలమంచిలి వాక రోడ్డు సర్వే పనులు అడ్డగింత



మాకవరపాలెం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : మాకవరపాలెం మండలం రామన్నపాలెం జంక్షన్ నుంచి ధర్మవరం, ఎరకన్నపాలెం మీదుగా ఎలమంచిలి వాకలో నిర్మాణానికి జరుగుతున్న సర్వే ప్రక్రియను రైతులు అడ్డగించారు. రామన్నపాలెం రెవెన్యూ పరిధిలోని ధర్మవరం రైతులకు చెందిన జిరాయితీ భూముల్లో సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులను స్థానికులు అడ్డుకున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న తాసిల్దార్ ముజీబ్ రైతులతో మాట్లాడారు. తమకు చెందిన జిరాయితీ భూములకు తగిన నష్టపరిహారం ఇవ్వకుండా ఏ విధమైన సర్వే ప్రక్రియ చేపట్టాలని రైతులు తెలిపారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో రామన్నపాలెం జంక్షన్ నుంచి సర్వే నెంబర్ 737భూముల మీదుగా ఎలమంచిలి మండలం పెదపల్లి వరకు నిర్మించ తలపెట్టిన 100 అడుగుల రోడ్డు సర్వే ప్రక్రియ ప్రారంభించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఇంతవరకు పయనీర్(అన్ రాక్) కంపెనీ ఆనుకుని ఏపీఐఐసీ భూముల్లో సర్వే రెవెన్యూ అధికారులు 100 అడుగుల రోడ్డుకు సర్వే ప్రక్రియ చేపడుతున్నారు. దీనిలో భాగంగా సోమవారం ధర్మవరం గ్రామానికి చెందిన కొంత మంది రైతుల జిరాయితీ భూముల్లో సర్వే ప్రక్రియ ప్రారంభించారు. రైతులతో చర్చించడం ముందస్తు సమాచారం లేకుండా నష్టపరిహారం ప్రస్తావన లేకుండా అధికారులు సర్వే ప్రారంభించడం అన్యాయమని రైతులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఉన్నత స్థాయి అధికారులు రైతులకు చెందిన జిరాయితీ భూములకు తగిన నష్టపరిహారం ప్రకటించిన తర్వాతే సర్వే ప్రక్రియ ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేశారు. ఒక దశలో తహసిల్దార్ ముజీబ్ రైతులతో మాట్లాడి నచ్చజెప్పే ప్రయత్నం చేసిన చర్చలు ఫలించలేదు. జిరాయితీ భూములు తీసుకునే ముందు సంబంధిత రైతులకు సమాచారం ఇచ్చి వారితో చర్చించి సర్వే ప్రారంభించాల్సి ఉందని, రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా సర్వే చేయడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఎట్టకేలకు రైతులు అంగీకరించక పోవడంతో సర్వే,రెవెన్యూ అధికారులు వెనుదిరిగారు.

## మహిళలు ఆర్థికంగా బలపడాలి : జేసీ



అనకాపల్లి, ఏప్రిల్ 13, (ప్రభాత వార్త): మహిళా సాధికారతకు మరింత బలమైన అడుగులు వేస్తున్నామని, మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడాల్సి న అవసరం ఎంతైనాఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్ పిలుపునిచ్చారు. సోమవారం ఢిల్లీ లో విజ్ఞాన్ భవన్ లో మహిళా సాధికారత, నాయకత్వంపై నిర్వహించిన సమావేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడి, ఢిల్లీ ముఖ్య మంత్రి రేఖ గుప్తా, కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణ దేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ మహిళల పాత్రను వికసిత భారత్ 2047 దిశగా మరింత బలోపేతం చేస్తుందన్నారు. గ్రామ స్థాయి నుండి పార్లమెంట్ వరకు మహిళల నాయకత్వాన్ని ప్రోత్సహించడమే ప్రధాన ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. అనకాపల్లి కలెక్టరేట్ వీడియో కాన్ఫిరెన్స్ హాల్ నుండి వర్చువల్‌గా పాల్గొని విక్షించిన జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్, ఐ.సి.డి.ఎస్, డి.ఆర్డి.ఎ పథక సంచాలకులు సూర్య లక్ష్మి, శచి దేవి, డి ఎం హెచ్ ఓ డాక్టర్ హైమవతి, డి సి పి ఓ రమేష్, స్వయం సహాయక సంఘాల మహిళ సభ్యులు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ఉండే పిల్లలకు పెట్టె ఆహారం నాణ్యమైందిగా ఉండాలన్నారు. పిల్లలకు మీరు ఆహారం పెట్టినప్పుడు ఎలా ఉందని, బాగుందా, లేదా అని అడగాలన్నారు. పిల్లలకు ఆహారం ఇష్టంగా పెట్టాలని అంగన్వాడీ టీచర్లకు, ఆయాలకు సూచించారు.

## తామరంలో ఉపాధి పనులు ప్రారంభం



మాకవరపాలెం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : మండలం తామరం గ్రామంలో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఈ మేరకు సోమవారం తామరం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోసూరు శీనువాసరావు, జనసేన నాయకులు, కర్రి సురేష్ సమక్షంలో ఉపాధి పనులు ప్రారంభించారు. సందర్భంగా టిడిపి నాయకులు శ్రీను మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉపాధి హామీ పనులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడం వలన ఉపాధి శ్రామికులకు పని కష్టతరంగా ఉంటుందన్నారు. ఉపాధి శ్రామికులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా తాగునీరు, నీడ సదుపాయం కల్పించాలని అధికారులను కోరారు. వేసవితాపాన్ని దృష్టిలో ఉంచుకొని శ్రామికుల పని వేళలను మార్చాలని తన అభిప్రాయం వ్యక్తపరిచారు. ఉపాధి శ్రామికులు కూడా అధికారులు నిర్ణయించిన సమయానికి తూచా తప్పకుండా సమయపాలన పాటించాలన్నారు. ఉపాధి హామీ పథకం అధికారులు శ్రామికుల ఇబ్బందులను గుర్తించుకొని తగిన రీతిలో పూర్తి సహాయ సహకారాలు అందించాలని శ్రీను కోరారు. వేసవి దృష్టిలో ఉంచుకొని ఉపాధి శ్రామికులకు అదనపు వేతనం వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మండల సీనియర్ జనసేన నాయకులు కర్రిసురేష్, గ్రామ పెద్దలు శ్రీను, ఉపాది. హామీ మేట్లు, మహిళా శ్రామికులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో పరిసరాలు పరిశీలించిన ఎమ్మెల్యే



(అచ్చుతాపురం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త ): అచ్చుతాపురం మండలం మోసయ్య పేట లోని కస్తూరిబాయ్ బాలికల పాఠశా లను సోమవారం నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల హాస్టల్‌లో చోటుచేసుకున్న విషాద ఘటన నేపథ్యంలో ఆయన స్వయంగా పాఠశాల పరిసరాలను సమగ్రంగా పరిశీలించారు. ఏడో తరగతి విద్యార్థిని ఎం. నవ్య పాము కాటుకు గురై మృతి చెందిన ఘటనపై ఎమ్మెల్యే లోతుగా ఆరా తీశారు. పాము కుట్టిన ప్రదేశాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, "పాఠశాల పరిసరాల్లో జంగిల్ క్లియరెన్స్ చేయాలని ఎన్నిసార్లు సూచించినా నిర్లక్ష్యం వహించడం వల్లే ఈ విషాదం చోటుచేసుకుంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వంటగది, విద్యార్థులు విశ్రాంతి తీసుకునే గదులను తనిఖీ చేసిన ఎమ్మెల్యే, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రాధాన్యమని పేర్కొన్న ఎమ్మెల్యే, చిన్నారుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని కఠినంగా హెచ్చరించారు. సమస్యలపై వెంటనే స్పందిస్తూ, బాధిత కుటుంబానికి న్యాయం చేయడంలో ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బొందలపు శ్యామ్, పుర్రె శీను, పాఠశాల సిబ్బంది, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పోషణ్ పక్వాడాపై ర్యాలీ



(ఎస్ రాయవరం ఏప్రిల్ 13 ప్రభాతవార్త) : మండల కేంద్రమైన ఎస్ రాయవరం గ్రామంలో సోమవారం పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో తాజా మాజీ ఎంపీపీ కే వెంకటలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం గర్భవతులకు బాలింతలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ.. పుట్టిన బిడ్డ నుంచి ఆరు సంవత్సరాల వయసు వరకు మెదడు అభివృద్ధి చెందుటకు కీలక దశని ఆ సమయంలో బిడ్డ మెదడు ఎదుగుదల 90 శాతం ఉంటుందన్నారు. ఆ వయసు పిల్లలకు సెల్ ఫోన్లు అలవాటు చేయరాదని. తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు, సమాజం కూడా తగిన శ్రద్ధ తీసుకోవాలని దీనిపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తాజా మాజీలు జడ్పిటిసి కాకర దేవి వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, ఎంపీటీసీబైపా శ్రీనివాసరావు, సర్పంచ్ భూపతి అప్పారావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ కనకదుర్గ అంగన్వాడి టీచర్లు కుర్రా సత్యవతి, నాగ వరలక్ష్మి రామలక్ష్మి, పద్మ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## వారి సేవలు వెలకట్టలేము : కొప్పిశెట్టి, వీసం



(నక్కపల్లి ,ప్రభాతవార్త ): మండలంతో పాటు నక్కపల్లి పట్టణాన్ని అన్ని విధాలుగా అన్ని రంగాలను కలుపుకొని హెటిరో ఔషధ పరిశ్రమ చైర్మన్ ,రాజ్యసభ సభ్యులు డాక్టర్ బండి పార్థసారధి రెడ్డి ముందు ఆలోచనతో సిఎస్ఆర్ నిధుల్లో భాగంగా చేపడుతున్న అభివృద్ధికి వెలకట్టలేమని, వారి సేవలు అమోఘమని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ,దక్షిణ నియోజకవర్గ ఇన్చార్జ్ వీసం రామకృష్ణ, పాయకరావుపేట నియోజకవర్గ టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ కొనియాడారు. నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిలో ఆస్పత్రి అవసరాలను గుర్తించి విద్యుత్తు సమస్య లేకుండా ఉండేటట్లు సుమారు పది లక్షల రూపాయలు విలువచేసే 30 కే.వి సామర్థం కలిగిన జనరేటర్ ను చైర్మన్ డాక్టర్ బండి పార్థసారధి రెడ్డి ఆదేశాల మేరకు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వైస్ చైర్మన్ ఎస్. కుల్లయ్య రెడ్డి, ఫైనాన్స్ జనరల్ మేనేజర్ ఎంఎన్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ సునీల్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ కుల్లయ్యరెడ్డి చేతుల మీదుగా జనరేటర్ ను ప్రారంభించారు. అనంతరం వీసం రామకృష్ణ మాట్లాడుతూ నక్కపల్లి మండలం లో సిఎస్సార్ నిధుల ద్వారా ఊహించని అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. నక్కపల్లి పట్నంలో రహదారులతోపాటు ఊహించిన విధంగా నక్కపల్లి వారపు సంత త్రాగునీటి సౌకర్యం పాఠశాలల అభివృద్ధి దేవాలయాల అభివృద్ధి ఈ విధంగా కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి సహకరిస్తూ వస్తున్నారని అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ నక్కపల్లి 50 పడకల ఆసుపత్రి నక్కపల్లి ప్రజలకే కాకుండా పాయకరావుపేట నియోజకవర్గం నలు మూలల నుంచి వచ్చే ప్రజలకు ఉపయోగపడే విధంగా ఊహించిన అభివృద్ధి చేశారని అన్నారు. ఒక కార్పొరేటర్ హాస్పిటల్ లాగా తయారు చేశారని చెప్పారు. నక్కపల్లి మండలం లో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు పలు గ్రామాల్లో సి ఎస్ ఆర్ నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తూ వస్తున్నారని అన్నారు. విద్యా, వైద్యం, రహదారుల అభివృద్ధి ఈ విధంగా ఊహించని అభివృద్ధి చేస్తూ వస్తున్నారని, వారికి ప్రాంతం ప్రజలు రుణపడి ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా ఎస్ .కుల్లయ్య రెడ్డి మాట్లాడుతూ నక్కపల్లి మండలం తో పాటు నక్కపల్లి పట్టణంలో సీసీ రోడ్ల నిర్మాణం మే కాకుండా నక్కపల్లి వారపు సంత 50 పడకల ఆసుపత్రి, పాఠశాల అభివృద్ధి ఈ విధంగా గ్రామస్తుల కోరిక మేరకు సుమారు నాలుగు కోట్ల రూపాయల వరకు సిఎస్ఆర్ నిధుల ద్వారా అభివృద్ధి చేయడం జరిగిందని ,రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా సంస్థ చైర్మన్ డాక్టర్ బండి పార్థసారధి రెడ్డి ముందుకొచ్చి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సూచన మేరకు నక్కపల్లి వారపు సంత కు పక్కా నిర్మాణాలు చేపట్టడం జరిగిందని చెప్పారు. నక్కపల్లి పోలీస్ స్టేషన్ సుమారు రెండు కోట్ల అరవై లక్షల రూపాయలు ఖర్చు చేసి నూతన భవనాలు నిర్మించడం జరుగుతుందని చెప్పారు. ఇదంతా ఒక సంవత్సరంలోనే సిఎస్సార్ నిధుల ద్వారా చేపట్టడం జరిగిందని, భవిష్యత్తు వెనుక అనేకమైన అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందని, ప్రధానంగా నక్కపల్లి స్మశాన వాటిక ఇరువైపులా ప్రొటెక్షన్ వాళ్ళను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నక్కపల్లి చేనేత కాలనీ వద్ద వర్షపునీరు నిల్వ ఉండకుండా ఉండేటట్లు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ప్రత్యేక డ్రైనేజీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కంపెనీమెడికల్ ఆఫీసర్ వీరనారాయణ ,సి ఎస్ ఆర్ టీం ప్రతినిధి సిహెచ్ శ్రీనివాసరావు, 50 పడకల ఆసుపత్రి వైద్యులు రవి కిరణ్, అనూష డిప్యూటీ సివిల్ సర్జన్ షేక్ సబినం, ఇస్సాక్ మహమ్మద్ తో పాటు హెడ్నర్స్ వరలక్ష్మి, స్వాతి ,సుమలత, ఫార్మసిస్ట్ ఇమామ్‌తో పాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.






## ఉయ్యాల్లో ఇరుక్కుపోయి చిన్నారి మృతి



దుంబ్రిగుడ, ఏప్రిల్ 13, (ప్రభాతవార్త): అల్లూరి జిల్లా దుంబ్రిగుడ మండలం సాగర పంచాయతీ మారుమూల కొదోంజోల గ్రామానికి చెందిన సోకేలి మాధవి(11) అనే చిన్నారి ఆదివారం ఉదయం 11 గంటల సమయములో ఉయ్యాల ఊగుతూ ఇరుక్కుపోయి మృతిచెందింది. తల్లి మూడునెలల పసికందును చిన్నారి చేతిలో పెట్టి లాలించాలని గెడ్డకు వెళ్లింది. ఈ క్రమంలో తమ్ముడిని లాలించి నిద్రబుచ్చి ఉయ్యాల ఊగుతూ ప్రమాదవశాత్తు ఇరుక్కుపోయి మృతి చెందిందని చిన్నారి తండ్రి లోకిరాం బోరున విలపించారు. వ్యవసాయ పనులు కావడంతో గ్రామంలో ఆ సమయంలో ఎవరు లేకపోవడంతో చిన్నారిని కాపాడలేని పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు తెలిపారు. మృతిచెందిన చిన్నారి కొసొంగుడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో అయిదో తరగతి చదువుతోంది. చిన్నారి మృతితో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకుంది.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక ... పీజీఆర్ఎస్



దుంబ్రిగుడ, ఏప్రిల్ 13( ప్రభాతవార్త): దీర్ఘకాలికంగా కొలువున్న సమస్యలను పరిష్కరించే వేదిక పిజిఆర్ఎస్ లని స్థానిక ఇన్చార్జి ఎంపిడిఓ విశ్వనాథ్ చెప్పారు. ఇక్కడి మండలం పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ఫిర్యాదులను పరిష్కార వేదికగా పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మండలంలో గల 18 గ్రామపంచాయతీలోను గిరిజనులు సద్వినియోగం చేసుకొని వారి వారి సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో స్థానిక పోతంగి పంచాయతీ పామురాయి గోడసరు గ్రామాల్లో తాగునీటి సమస్య పై ఆయా గ్రామ ప్రజలు ప్రజావేదికలో అర్జీలను సమర్పించారు. కార్యక్రమంలో రెవిన్యూ శాఖ డిప్యూటీ తాసిల్దార్ చంద్రశేఖర్, విద్యాశాఖ, పిఎసిఎస్, ఫారెస్ట్, హౌసింగ్, వెలుగు, విద్యుత్ తోపాటు పలు శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పీవోను కలిసిన గిరిజన ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు



పాడేరు,ఏప్రిల్ 13, ప్రభాతవార్త: పాడేరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన పీఓ ఆదిత్య వర్మను గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం అల్లూరి జిల్లా శాఖ జిల్లా అధ్యక్షులు కోడా చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి కూడా రాంబాబు, జిల్లా అడ్వాయిజర్ రామారావు, వైస్ ప్రెసిడెంట్ జీజెఆర్ మజ్జి, సభ్యులు భానుమూర్తి, గుజ్జెలి రవి, ప్రవీణ్ కుమార్, విజేంద్రనాద్ మర్యాదపూర్వకంగా సోమవారం పీఓ ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా పూల బోకేను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పలు ఉపాధ్యాయుల సమస్యలపై ప్రస్తావించారు.

## పందిరిరాట మహోత్సవంలో గిరి కైలాస క్షేత్ర ఆధ్యాత్మిక సేవా బృందం



పాడేరు, ఏప్రిల్13, ప్రభాతవార్త: శ్రీ మోదకొండమ్మ అమ్మవారి రాష్ట్ర జాతర పురస్కరించుకొని పంద్రిరాట వెయ్యి కార్యక్రమంలో పాల్గొన్న గిరి కైలాస క్షేత్ర ఆధ్యాత్మిక సేవ బృంద సభ్యులు. శ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్య శాస్త్రి, ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం, సంయుక్త ప్రధాన కార్యదర్శి సిద్ధానాతి కొండలరావు, ఉపాధ్యక్షులు కొత్తగుల్లి రామారావు కొమోజి వెంకటరమణ, యాదగిరి శ్రీనివాసరావు, పెంటకోట సత్యనారాయణ, పూసర్ల గోపి, బోనంగి వెంకటరమణ,దన్నేటి పలాస రాము, సత్య వరకు సోమరాజు,మహిళా ఆధ్యాత్మిక సేవా బృందా సభ్యులు కొట్టగుల్లి రమాదేవి కిముడు కాత్సవాయిని, వంతింభ గాయత్రీ దేవి చిలకమ్మా. అమ్మవారి ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కూడా సురేష్ కుమార్,పండు నాయక్, బెహరా నాని మత్య కొండబాబు , లకే రత్న బాయ్. భక్తులు పాల్గొన్నారు. 2026 మే 11, 12, 13 తేదీలలో శ్రీ మోదకొండమ్మ అమ్మవారి రాష్ట్ర గిరిజన జాతర అత్యంత వైభవంగా నిర్వహించారు.

## పాడేరులో వైసీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పర్యటన



పాడేరు,ఏప్రిల్13, ప్రభాతవార్త: ఆంధ్ర ప్రదేశ్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం అధ్యక్షులు రామారావు గిరిజన ప్రాంతం పాడేరులో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంలో అల్లూరి సీతారామరాజు జిల్లా పార్టీ అధ్యక్షులు పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు అధ్యక్షతన అల్లూరి జిల్లా రైతు విభాగం అధ్యక్షులు మరియు మండల అధ్యక్షుడు సమక్షంలో సమీక్ష సమావేశం నిర్వహించాటు. ఈ సందర్భంలో రామారావు మీడియాతో మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, అరకు నియోజకవర్గాలలో వైసిపి అత్యధిక మెజార్టీతో గెలవడం చాలా సంతోషమని ఏజెన్సీలో పార్టీ కేడర్ చాలా బలంగా ఉందన్నారు. గ్రామాలలో గ్రామ కమిటీలు త్వరగా చేయించాలని ప్రతి ఒక్కరికి కూడా ఐడి కార్డులు చేయించుకోవాలన్నారు. గిరిజన ప్రాంతంలో నెట్ సదుపాయం లేకపోవడంతో కొంత ఆలస్యం జరుగుతుందని జిల్లా అధ్యక్షులు చెప్పగా నేరుగా సెంట్రల్ ఆఫీస్ ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి దాని గురించి వీలుపడేలాగా చేయాలన్నారు. ౖతు విభాగం జిల్లా అధ్యక్షులు, పాడేరు పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే శిరీషదేవి సరదా సంభాషణ



కొయ్యూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ నియోజకవర్గాల పునర్ విజయ్ విభజనలో భాగంగా తమ రాజవొమ్మంగి మండలం కొత్తగా ఏర్పడనున్న చింతపల్లి నియోజక వర్గంలో విలీనం చేస్తే తన పరిస్థితి ఏమిటంటూ? రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి సరదా సంభాషణలో భాగంగా నవ్వుల పువ్వులు పూయించారు. సోమవారం మండల కేంద్రమైన కొయ్యూరు కు చెందిన జిసిసి మాజీ చైర్మన్, టిడిపి నేత ఎం వి వి ప్రసాద్ కుమార్తె దేవిశ్రీ వాణిధారణ శుభకార్యానికి భర్త మటం భాస్కర్ తో విచ్చేసిన ఎమ్మెల్యే శిరీష దేవి, ఈ సందర్భంగా ఈ వాఖ్యలు చేశారు. ఫోటోలు తీసుకుంటున్న సమయంలో, కొత్తగా ఏర్పడనున్న చింతపల్లికి కాబోయే ఎమ్మెల్యే ఎంవివి ప్రసాద్ తో, రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి ఫోటోలు దిగుతున్నారంటూ ఓ విలేఖరి చేసిన సరదా కామెంట్‌కు, ఎమ్మెల్యే శిరీష దేవి ఇలా సరదాగా బదులిచ్చి, అందరినీ నవ్వించారు. అయితే చింతపల్లిలో రాజవొమ్మంగి మండలం కలిస్తే, ఇక్కడి నేతలతో తాను ఢీ కొట్టలేనంటూ సరదాగా చెప్పకనే చెప్పినట్టు అయింది. కార్యక్రమంలో టిడిపి నేతలు దుచ్చరి చిట్టిబాబు, గాడి శ్రీరామ్మూర్తి, మండల టిడిపి అధ్యక్షుడు కాకూరు చంద్రరావు, మొట్టడం రాజశేఖర్, కొట్టేటి భాస్కర్, ఉండా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రతి పంచాయతీలో గ్రామసభలు

గూడెం కొత్తవీధి,ఏప్రిల్ 13 (ప్రభాతవార్త): ఈనెల 14న(నేడు) ప్రతీ పంచాయతీ కేంద్రంలో గ్రామసభ నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని ఎంపీడీవో రమణబాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు వీలవుతుందన్నారు. మండలంలోని 16 పంచాయితీల్లో ఈ గ్రామ సభలను నిర్వహించేందుకు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## అరకులోయ ఎస్ఐగా మల్లేశ్వరరావు



అరకులోయ, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: అరకులోయ సబ్ ఇన్స్పెక్టర్‌గా టి మల్లేశ్వరరావు సోమవారం పదవి బాధ్యతలు చేప ట్టారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఎస్ఐగా పనిచేసిన టి మల్లేశ్వరరావు అరకులోయకు బదిలీ అయ్యారు. కాగా ఇప్పటివరకు అరకులోయ ఎస్ఐ గా పని చేసిన గోపాలరావు విజయనగరం జిల్లాకు బదిలీ అయ్యారు. ఇదిలా ఉండగా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎస్ ఐ మల్లేశ్వరరావు మాట్లాడుతూ అందరి సహకారంతో పనిచేస్తానని, లా అండ్ ఆర్డర్ కు ఎటువంటి విఘాతం కలగకుండా తన వంతు కృషి జరుపుతానని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూ శాంతి భద్రతలను కాపాడుతానన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

## పాడేరు మోదకొండమ్మ వారి ఉత్సవ పందిరిరాట







పాడేరు, ఏప్రిల్ 13, ప్రభా తవార్త: మే నెల 10,11,12 వ తేదీల్లో జరగనున్న ఉత్తరాం ధ్ర జిల్లాల ఆరాధ్య దేవత,మన్య ప్రజల ఇలవేల్పు పాడేరు మోదకొండమ్మ వారి గిరిజన జాతర మహోత్సవాలు సందర్భంగా పాడేరు మెయిన్ రోడ్డు శతకం పట్టు వద్ద పందిరిరాట పటిష్ట మహోత్సవం పాడేరు ఎమ్మెల్యే, ఉత్సవ కమిటీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పూజా సామాగ్రిని మెయిన్ రోడ్డు వరకు ఊరేగింపుగా కమిటీ తీసుకువచ్చారు. పందిరి రాట పటిష్ట మహోత్సవానికి ఎమ్మెల్యే, ఉత్సవ కమిటీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, శివరత్నం దంపతులు,పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్ట గుల్లి భాగ్యలక్ష్మి, డా.తమర్బ నరసింగరావు దంపతులు ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కూడా సురేష్ కుమార్,ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు దంపతులు,గ్రామ పెద్దలు,టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు,ఆలయ కమిటీ పూర్వ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు,రమాదేవి దంపతులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు మహిళలతో పందిరి రాటకు సాంప్రదాయ ప్రకారం పసుపు,కుంకుమ పూసి బోట్లు పెట్టి ప్రత్యేక పూజలు మోదకొండమ్మ వారి ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రమణ్యం శర్మ, ఉత్సవాలు సంప్రదాయ ప్రకారం రాట హారతులు ఇచ్చి రాట మెయిన్ రోడ్డులో అట్టహాసంగా పందిరి రాట పటిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ,ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాజీ సర్పంచ్ వర్తన పిన్నయ్య దొర, కె.గంగన్న పడాల్,పలాసీ కృష్ణారావు, వర్తకులు బూరెడ్డి రాము నాయుడు,శివరాత్రి నాగేశ్వరరావు, రోబ్బీ శంకర్రావు, వుడా త్రినాథరావు, ఉప్పల వెంకటరత్నం, కొట్టగుల్లి రామారావు,శివరాత్రి శ్రీనివాస్ కుమార్, పుసర్ల గోపి, సలా రామకృష్ణ, లకేరత్నాబాయి, బోనంగి వెంకటరమణ,ఊర్వశీ రాణి,కిల్లు చంద్రమోహన్ కుమార్,పాలసీ రమణమ్మ, జంపరంగే సత్తిబాబు, మోదస్వరూప,సూర్యప్రకాష్, తేడబారికి సురేష్ కుమార్,కిల్లు చంద్రమోహన్ కుమార్,మఠం శాంత కుమారి, కెజియారాణి,పాలసీ రాము,నవీన్,గిడ్డి వరలక్ష్మి,సత్యవరపు సోమరాజు,ఆటో అప్పలరాజు, సాధనాల ఈశ్వరమ్మ,యాదగిరి శ్రీనివాస్, రాజబాబు,గాయత్రి ,కూడా సుబ్రమణ్యం,అధిక సంఖ్యలో మహిళలు,వ్యాపారులు,ఆలయ,ఉత్సవ కమిటీ ప్రతినిధులు,అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.అమ్మవారి రాట మహోత్సవం సందర్భంగా ఉత్సవ కమిటీ డప్పువాయ్యాలతో థింసా నృత్యాలతో అమ్మవారి ఆలయం నుంచి ఊరేగింపుగా శతకం పట్టు వరకు నిర్వాహకులు వచ్చారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్,ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలు విజయ వంతానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు అమ్మవారి ఉత్సవాలు ఏర్పాట్లు నిమిత్తం జిల్లా స్తాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అధికారులు ఈ విధంగా ఉత్సవాలు విజయవంతానికి భాగస్వామ్యం చేయాలో అనేదానిపై సమావేశంలో చర్చించి ఉత్సవాలకు సహకరించనున్నట్టు అల్లూరి కలెక్టర్ హామీ ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.మెట్10, 11,22 తేదీల్లో అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఉత్సవాలు విజయ వంతానికి ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని మాజీ ఎమ్మెల్య భాగ్యలక్ష్మి కోరారు.

## రేవళ్లలో 8వ పోషణ పక్వాడా కార్యక్రమం



కొయ్యూరు, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : కొయ్యూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ దేవమణి ఆధ్వర్యంలో రాజేంద్రపాలెం సెక్టార్ పరిధిలోని రేవళ్ళు సచివాల యం లో సోమవారం ఎనిమిదవ పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమాన్ని ఉద్దేశించి సిడిపిఓ మాట్లాడుతూ జంక్ ఫుడ్, ప్యాకేజ్డ్ ఆహారాల ప్రమాదాలపై అవగాహన, గర్భిణీలు, బాలింతలు, పిల్లల కోసం స్థానికంగా లభ్యమయ్యే పౌష్టికాహారా విలువలు, పిల్లల్లో పోషణ ఎదుగుదల, మెదడు అభివృద్ధి పై దృష్టి సాధించాలని వివరించారు. కార్యక్రమంలో గర్భిణీలు , బాలింతలు , బిపిసి, సూపర్వైజర్లు, వెలుగు సిసి రాజన్న దొర పాల్గొన్నారు.

## గడువులోగా ఎన్‌హెచ్5 పనులు పూర్తి చేయాలి : కలెక్టర్



పాడేరు,ఏప్రిల్ 13, ప్రభాతవార్త: జిల్లాలో జాతీయ రహదారి 5 (ఎన్ హెచ్5) విస్తరణ, అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంతి అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోగల కలెక్టర్ ఛాంబర్‌లో ప్రాజెక్ట్ ఏపీ డి,కాంట్రా క్టర్లు, ఇంజనీరింగ్ అథారిటీ, సైట్ ఇంజనీర్లు, టీమ్ లీడర్లతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులపై సంబందించిన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.నాణ్యతలో రాజీ పడకూడదుని,రహదారి పనులు అత్యంత నాణ్యతతో ఉండాలని, ఎక్కడా నిబంధనల ఉల్లంఘన జరగకూడదని స్పష్టం చేశారు. శాఖ పరమైన ఇబ్బందులు లేకుండా చూసుకొని సమన్వయంతో పనిచేయాలి. ఇంజనీరింగ్ అధికారులు మరియు సైట్ టీమ్ లీడర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తూ, పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పనులు జరుగుతున్న సమయంలో ప్రయాణికులకు మరియు స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గడువు అమలను కాంట్రాక్ట్ అగ్రిమెంట్‌లో పేర్కొన్న గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేయకపోతే అందుకు ఎదురయ్యే సమస్యలు, చర్యలకు మీరే బాధ్యులని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, ఐటిడి ప్రాజెక్టర్ అధికారి ఆదిత్య వర్మ, ఎన్ హెచ్ 5 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ , ఆర్డీవో ఇంచార్జి ఆర్డిఓ ఎం వి ఎస్ లోకేశ్వరరావు, ఏపీ డి నిధిచౌదరి, నేషనల్ హైవే అథారిటీ ఇంజనీర్, సైట్ ఇంజనీర్ లోకేష్ షరీఫ్, టీం లీడర్ శ్రీనివాస్, ఎన్ హెచ్5 ప్రతినిధులు, కాంట్రాక్టర్స్ వేదాద్రి ప్రైవేట్ లిమిటెడ్, ఇంప్రా ప్రైవేట్ లిమిటెడ్, టి ఎస్ ఆర్ నిర్మన్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్ ఆర్ సి ఇంప్రా ప్రైవేట్ లిమిటెడ్,వివిధ విభాగాల ఇంజనీర్లు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ సరైన వేదిక : కలెక్టర్



పాడేరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పిజిఆర్ఎస్ సమర్థవం తమైన వేదికగా పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ నిషాంతి. టి పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పిజిఆర్ఎస్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. సోమవారం పాడేరు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పిజిఆర్ఎస్‌లో నమోదయ్యే ప్రతి ఫిర్యాదును నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలు పెండింగ్‌లో ఉండకుండా ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యంగా తీసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. విశాఖపట్నం జిల్లా పరిషత్ సీఈఓ నారాయణమూర్తి, పి డి ఆర్ డి ఏ మురళి, మండల తాసిల్దార్ జి సత్యనారాయణ, ఎంపీడీవో జే తేజ్ రతన్, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ ప్రసాద్, ఆర్డబ్ల్యూ ఎస్ ఈ ఈ నాగభూషణ్, పిఆర్ ఇంజనీర్ కొండబాబు, ఎంఈఓ విశ్వనాథం, విద్యుత్ శాఖ జేఈవో కృష్ణమూర్తి, హౌసింగ్ ఏఈ ఈశ్వరరావు, ఫారెస్ట్ ఎఫ్ ఆర్ ఓ పద్మ, సిడిపిఓ, విద్యాశాఖ, ఎన్టీఆర్ విద్యా మిత్ర, వెలుగు, వ్యవసాయ శాఖ ఏ ఈ ఓ పార్వతి,వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సాగునీటి వనరుల మరమ్మతులకు ప్రత్యేక చర్యలు



గూడెం కొత్తవీధి, ఏప్రిల్ 13, (ప్రభాతవార్త) : మండలంలోని కొత్తగూడెం చెక్ డ్యామ్‌ను అధికారులు సోమవారం పరిశీలించారు. చెరువులు, చెక్ డ్యామ్‌లు, కాలువల కింద ఉన్న ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. జిల్లా కలెక్టర్ నిశాంతి ఆదేశాల మేరకు ఎంపీడీవో రమణబాబు నేతృత్వంలోని అధికారుల బృందం ఈ తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పూడికతో నిండిపోయిన చెరువులు, కాలువలను ఇప్పటికే గుర్తించామని తెలిపారు. వీటికి తక్షణమే మరమ్మతులు చేపట్టి, సాగునీటిని నిల్వ చేయడం ద్వారా ఆయకట్టుకు నీరందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఈ పనులన్నింటినీ పూర్తి చేసి, రైతులకు సాగునీరు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గుర్తించిన పనులకు సంబంధించి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈఈ నాగరాణి, జీకే వీధి పంచాయతీ ప్రత్యేక అధికారి దాసరి గిరిబాబు, ఆర్డబ్ల్యూఎస్ జేఈఈ కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

## జనగణన శిక్షణ ప్రారంభం

గూడెం కొత్తవీధి ఏప్రిల్ 13 (ప్రభాతవార్త): మండలంలో జనగణన ప్రక్రియకు సంబంధించిన మొదటి విడత శిక్షణ కార్యక్రమం ఏప్రిల్ 13వ తేదీన స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో మొదటి విడతగా 49 మంది ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ హెచ్. అన్నాజీ రావు మాట్లాడుతూ జనగణన ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ ఎంతో కీలకమని తెలిపారు. అలాగే ఈ నెల 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆయన వెల్లడించారు.

## పర్యాటక ప్రాంతాల వద్ద భద్రత కట్టుదిట్టం : కలెక్టర్



పాడేరు,ఏప్రిల్ 13, ప్రభాతవార్త: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో మునిగిపోవడం (చనిపోవడం జరుగుతుంది)వల్ల జరిగే ప్రమాదాలను నివారించడానికి జిల్లా కలెక్టర్ కఠినమైన ఆదేశాలను జారీ చేశారు. ముఖ్యంగా పాడేరు, అరకు ప్రాంతాల్లో పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా పర్యాటకులు, విద్యార్థులు జలవనరుల వద్దకు వెళ్లే అవకాశం ఉన్నందున, ప్రాణనష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలుచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు జిల్లాలోని కాలువలు, జలపాతాలు, చెరువుల వద్ద ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి (రిస్క్ మ్యాపింగ్ చెయ్యాలి) శుక్రవారం లోపు ఐటిడిఏ (పాడేరు) కి నివేదిక సమర్పించాలి. సరియ, చాపరాయి, రానజిల్లెడ, కొత్తపల్లి జలపాతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలి. రక్షణ ఏర్పాట్లులోతైన ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, వెదురు కంచెలు లేదా తాళ్ళతో బారికేడ్లను నిర్మించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థులకు అవగాహ న పాఠశాలల్లో ప్రతిరోజూ ఉదయం ప్రార్థన సమయంలో (అసెంబ్లీలో) 5 నిమిషాల పాటు నీటి భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. ఖితల్లిదండ్రుల పర్యవేక్షణ లేకుండా నీటిలోకి దిగవద్దుఖి అనే సందేశాన్ని బలంగా పంపాలి. హాస్టల్ విద్యార్థులపై వార్డెన్లు ప్రత్యేక నిఘా ఉంచాలి. కట్టుదిట్టమైన నిఘా వారాంతాల్లో (వీకెండ్స్) పర్యాటక ప్రాంతాల వద్ద రెవెన్యూ, పోలీస్, ఫారెస్ట్ సిబ్బందితో సంయుక్తంగా గస్తీ నిర్వహించాలి. మద్యం సేవించి నీటిలోకి వెళ్లే వారిని అడ్డుకోవడానికి ఖిబ్రీత్ అనలైజర్ఖి తనిఖీలు చేపట్టాలి. అత్యవసర సేవల సిద్ధం ప్రతి మండలంలో స్థానిక ఈతగాళ్ల జాబితాను సిద్ధంగా ఉంచుకోవాలి. అరకు, అనంతగిరి ప్రాంతాల్లో అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలి. జిల్లా కలెక్టర్ హెచ్చరిక జిల్లాలో నిర్లక్ష్యం కారణంగా ఒక్క మరణం సంభవించినా సహించేది లేదు. ఆదేశాల అమలులో విఫలమైతే డిజాస్టర్ మేనేజ్మెంట్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ మేరకు ప్రతి మండలం తమ ఖిమైక్రో ప్లాన్ఖి తో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశానికి హాజరుకావాలని తహసీల్దార్లు, ఎంపీడీఓలు ఎస్.హెచ్.ఓ లను ఆదేశించారు.

## మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో ఎస్పీ పర్యటన



గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 13, (ప్రభాతవార్త): మన్యంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తింపు పొందిన మారుమూల గిరిజన గ్రామాల్లో జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ పర్యటించారు. జీకేవిధి మండలం పెదవలస అవుట్ పోస్ట్, నేరేళ్లబంధ, అన్నవరం, కన్నవరం, గరిమండ గ్రామాల్లో సోమవారం సుడిగాలి పర్యటన చేపట్టారు. ఇంటింటికీ తిరిగి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకుని గిరిజన యువతతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన యువత లో అంతర్గతంగా ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని దానిని వెలికి తీసి శ్రమిస్తే ఏ రంగంలోనైనా విజయం సాధించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలైన గంజాయి, మాదకద్రవ్యాల రవాణా వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. అందుకు అవసరమైన ప్రోత్సాహం పోలీస్ శాఖ అందిస్తుందన్నారు. గ్రామాలలో ఉండే సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన గ్రామాలు ప్రశాంతతకు మారుపేరుగా ఉండాలని చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు కాదని. ముఖ్యంగా సెలవులు సమయంలో పిల్లలు వాగులు కాలువలు చెరువుల్లో వెళ్లకుండా ఉండాలని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జీకేవీధి సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్, ఎస్సై సురేష్ పాల్గొన్నారు.

## జిల్లాలో సమర్థవంతంగా జలధార.. జలహారతి



పాడేరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: జిల్లాలో భూగర్భ జల మట్టాలను పెంచడం, చెరువులు, జలాశయాలను పునరుద్ధరించడం లక్ష్యంగా "జలధార జలహారతి" కార్యక్రమాన్ని చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ టి.నిశాంతి ఆదేశించారు. సోమవారం తన చాంబర్ నుండి సంబంధిత జిల్లా అధికారులతో జలధార జల హారతి కార్యక్రమం పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో ఆమె మాట్లాడుతూ 100 రోజుల ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌తో, ఉపాధి హామీ నిధుల అనుసంధానంతో సాగునీటి వ్యవస్థలను బలోపేతం చేసే కార్యక్రమమని, నీటి వనరులకు సాంకేతికతతో అనుసంధానించి నీటి వనరుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పెంపు, చెరువుల ఆధునీకరణ చేపట్టడం జరుగుతుందన్నారు. 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు, శాటిలైట్ రిమోట్ సెన్సింగ్, జిఐఎస్ (జిఐఎస్) ఆధారిత మ్యాపింగ్ ద్వారా సమగ్ర నీటి నిర్వహణ ముఖ్య ఉద్దేశమన్నారు.జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, జిల్లా ఇంచార్జ్ రెవెన్యూ అధికారి కెఆర్ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నీలకంఠ రావు,జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ బి ఎస్ నంద్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలకర్ణ, భూగర్భ మరియు జలగణన శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి. శ్రీనివాస్, డ్వామా పిడి విద్యా సాగర్, జిల్లా ఇంచార్జ్ అటవీ శాఖ అధికారి ఉమా మహేశ్వరి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కరుణాకర్ రావు, జిల్లా స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డ్ కార్యాలయాల నోడల్ ఆఫీసర్ పి.ఎస్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి చంద్ర శేఖర్, ఏపిఈపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి పెళ్లలు విరిగిపడి ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు

అరకులోయ, ఏప్రిల్ 13, ప్రభాత వార్త : అరకులోయ మండలం కొత్త బళ్ళు గుడ గ్రామ సమీపంలో మట్టి తవ్వుతున్న మహిళలపై మట్టి పేలుళ్ల విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు కాగా మరొక మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిలో ప్రియాంక (26) కు నడుము విరగగా, జ్యోతి రాణి (32 ) అనే మహిళకు కాలు విరిగింది. అలాగే ఈ సంఘటనలో సమంత (18) అనే మరో మహిళ తృటిలో ప్రాణాపాయం నుండి బయటపడింది. వివరాల్లోకి వెళితే .... మండలంలోని కొత్త బల్లుగుడ గ్రామానికి చెందిన మహిళలు మట్టి కోసం గ్రామ సమీపంలో ఉన్న మట్టి దిబ్బల వద్దకు వెళ్లారు. అయితే మట్టిని తవ్వుతున్న సమయంలో ప్రమాదవశాస్తూ మట్టి పేలుళ్ల విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు . క్షత గాత్రులను హుటాహుటిన అరకు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ ఘటనలో పెను ప్రమాదం తప్పడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

## రోడ్డు నిర్మాణ పనులు నిలుపుదలపై గ్రామస్థుల ఆందోళన



కొయ్యూరు, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: దేవుడు వరమిచ్చినా, పూజారి వరమివ్వని చందంగా తయారయింది తమ పరిస్థితి అంటూ మండలంలోని మంప పంచాయతీ, గొడుగులమ్మ బంధ గ్రామ గిరిజనులు ఆందోళన, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంప నుండి తమ గ్రామానికి సుమారు నాలుగున్నర కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణానికి రూ. 4.47 కోట్లు నిధులు మంజూరవడంతో, ఇటీవల కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులను శరవేగంగా ప్రారంభించారు. అయితే కాంట్రాక్టర్ల మధ్య అవగాహన లోపంతో గత కొన్ని రోజులుగా రోడ్డు నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. దీనితో తమ గ్రామానికి రోడ్డు వస్తుందనుకున్న తమ ఆశలు కాంట్రాక్టర్ నిర్వాకంతో ఆవిరయ్యాయి అంటూ, మరలా రోడ్డు నిర్మాణ పనులను ఎప్పుడు ప్రారంభిస్తారో? అంటూ గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, ఇంజనీరింగ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తమ రోడ్డు నిర్మాణ పనులను పునః ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

## గ్యాస్ సరఫరాలో ప్రైవేట్ నిర్వాహకుల నిర్లక్ష్యంపై ఫిర్యాదు



గూడెం కొత్తవీధి, ఏప్రిల్ 13, (ప్రభాతవార్త): వంటగ్యాస్ సరఫరా లో ప్రైవేట్ ఏజెన్సీ నిర్వాహకులు చేపడుతున్న నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని జికే వీధి ఎంపీటీసీ, భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు రీమల రాజేశ్వరి డిమాండ్ చేశారు. జికే వీధిలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె ఫిర్యాదు చేశారు. గూడెం కొత్త వీధి మండలంలో గ్యాస్ లేక 16 పంచాయతీలలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రెండు నెలలుగా పూర్తిగా మండలంలో గ్యాస్ సరఫరా లేదన్నారు. ఈ గ్యాస్ సమస్యను వెంటనే పరిష్కారం చెయ్యాలని కోరారు. జీసీసీ హయాంలో సీలేరులో గోడౌన్ నడుపుతున్నారని అక్కడ కొంతమేర గ్యాస్ లభించినప్పటికీ. ప్రధాన మండల కేంద్రంలో ఎందుకు గ్యాస్ విక్రయించడం లేదని దీనివల్ల రెండు నెలల నుంచి వేలాదిమంది గ్యాస్ లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.

## అసరాడలో అభివృద్ధి చేపట్టాలంటూ వినతి



గూడెం కొత్తవీధి. ఏప్రిల్ 13 (ప్రభాతవార్త): మండలంలోని అసరాడలో అభివృద్ధి చేపట్టాలని కూటమి నాయకులు కోరారు. జీకేవీధి లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో నాయకులు వినతి పత్రం అందజేశారు. అసరాడ లో కనీస మౌళిక సదుపాయాలు లేవన్నారు. ముఖ్యంగా సామాజిక భవనం, చెక్ డ్యామ్ నిర్మాణాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో తెదేపా మండల కోశాధికారి తగ్గి శ్రీరాములు, అసరాడ పెసా కమిటీ కార్యదర్శి తగ్గి సోమరాజు, జీకేవీధి ఎంపీటీసీ రీమల రాజేశ్వరి, టి ఎన్ ఎస్ ఎఫ్ కార్యదర్శి ముక్కలి కల్యాణి, అధ్యక్షులు గుంట బుజ్జిబాబు, తెదేపా మాజీ జిల్లా కార్యదర్శి ముక్కలి మహేష్ పాల్గొన్నారు.

ong-12_ong-12.qxd 4/14/2026 12:57 AM Page 1



## రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఆటో డ్రైవర్లకు భద్రత నియమాలు పాటించాలి

**ఎలమంచిలి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

మండలంలోని హైవే వెంబడి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దింపడం వంటివి ప్రభుత్వం కేటాయించిన పార్కింగ్ స్థలాలు ఉన్నప్పటికీ, కొంతమంది ఆటో డ్రైవర్లు నిర్దిష్ట స్థలాలను పట్టించుకోకుండా ఎక్కించుకోవడం జరుగుతుందని అక్కడ రోడ్డుపై ఆటోలు నిలిపివేయడం గమనించడం జరిగిందని రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. ఇలాంటి చర్యల వలన రోడ్డు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడమే కాకుండా, పెద్ద ఎత్తున రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ఇది మీ ప్రాణాలకు, ప్రయాణికుల భద్రతకు, ఇతర రోడ్డు వినియోగదారులకు ముప్పుగా మారుతోందని అన్నారు. అందువలన యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్ తరఫున అన్ని ఆటో డ్రైవర్లకు ఈ క్రింది విధంగా హెచ్చరిక జారీ చేయడం జరుగుతుందని అన్నారు. కేటాయించిన పార్కింగ్ స్థలాల్లో మాత్రమే ఆటోలు నిలుపుదల చేయాలి, హైవే పై ఎక్కడపడితే అక్కడ ఆటోలను ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దింపడం నిషేధం, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలి, ఈ సూచనలను పాటించని పక్షంలో సంబంధిత ఆటో డ్రైవర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జరిమానాలు విధించబడుతుందని, అవసరమైతే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజల భద్రత మీ చేతుల్లోనే ఉంది క్రమం తప్పకుండా ట్రాఫిక్ నియమాలు పాటించాలని అన్నారు.

## రేగుపాలెం పిహెచ్ సిలో చెస్ట్ ఎక్స్‌రే యంత్రం ప్రారంభించిన ఎంపీపీ రాజాన శేషు

**ఎలమంచిలి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:**

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రేగుపాలెం పరిధిలో గల టిబి, కుష్టి రోగుల పరిశీలనార్థం, జిల్లా టిబి, లెప్రసీ విభాగం పంపిన చెస్ట్ ఎక్స్ రే యంత్రాన్ని సుమారు వారం రోజులపాటు అందుబాటులో ఉంటుందని డా. సుగుణ తెలిపారు. ఈ యంత్రాన్ని మండల పరిషత్ అధ్యక్షులు రాజాన సూర్య చంద్ర శేష గిరి రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మండల జనసేన పార్టీ అధ్యక్షులు అన్నం బాబ్జి, జనసేన నాయకులు రాజు, లాలం సోమునాయుడు, నాని తదితరులు హాజరయ్యారు.

## జనగణన పారదర్శకంగా నిర్వహించాలి: ఎంపీడీవో శివప్రసాద్

**బుచ్చయ్యపేట ఏప్రిల్ 13 ప్రభాతవార్త**

మండల వ్యాప్తంగా జనగణన కార్యక్రమాన్ని పారదర్శకంగా, తప్పులేకుండా నిర్వహించాలని ఎంపీడీవో కే. శివప్రసాద్ నారాయణ సూచించారు. సోమవారం తో ముగిసిన మూడు రోజుల శిక్షణ అనంతరం మొదటి బ్యాచ్ ఎన్యూమనేటర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, జనగణన ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఎన్యూమనేటర్లకు అందించిన 34 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిను పూర్తి అవగాహనతో నింపాలని, ప్రతి అంశాన్ని సరిగా పరిశీలించి సర్వేలో నమోదు చేయాలని తెలిపారు.జనగణనలో సేకరించే వివరాలు భవిష్యత్ ప్రణాళికలకు ఎంతో కీలకమని, అందువల్ల బాధ్యతతో, కచ్చితత్వంతో పనిని పూర్తి చేయాలని ఆయన సూచించారు.

## మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే పాఠశాల విద్యార్థులకు వైద్య చికిత్సలు

**చోడవరం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:**

చోడవరంలో గల మహాత్మ గాంధీ జ్యోతిరావు పూలే పాఠశాల విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు తరచుగా అంటూ రోగాలు తరచూ వస్తునందున ప్రధానోపాధ్యాయులు రజిత స్పందించి విద్యార్థులను ఆసుపత్రి తరలించి తగిన వైద్య సేవలు అందించారు. ఈ పాఠశాల విద్యార్థులు కలుషిత ఆహారానికి గురయ్యారని రకరకాల పుకార్ల షికార్లు చేస్తున్న నేపథ్యంలో చోడవరం తహసిల్దార్ రామారావు ఆస్పత్రి చేరుకుని వైద్యులతో మాట్లాడారు. అలాంటిదేమీ లేదని విద్యార్థులకు దురదలు వంటివి సంభవించడంతో తగు వైద్య సేవలు అందించమని చెప్పారు. అనంతరం పాఠశాలకు వచ్చి విద్యార్థుల బాగోగులు గురించి అడిగి తెలుసుకున్నారు విద్యార్థులు మధ్యాహ్న భోజనం బాగుందని తెలియజేయడంతో ఎమ్మార్వో రామారావు సంతృప్తి వ్యక్తం చేశారు ప్రిన్సిపల్ రజిత మేడం తో మాట్లాడి తగు సూచనలు సలహాలు తెలియజేశారు తమ పాఠశాలపై తప్పుడు ప్రచారం రావడం పట్ల ప్రధానోపాధ్యాయురాలు రజిత ఆవేదన వ్యక్తం చేశారు.

## గ్రంధాలయంలో బీఆర్.అంబేడ్కర్ జయంతి

**నర్సీపట్నం,ఏప్రిల్ 13,ప్రభాతవార్త**

నర్సీపట్నం శాఖా గ్రంధాలయంలో గ్రంధాలయాధికారి పీ.దమయంతి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్.అంబేద్కర్ 135వ జయంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు కె.త్రిమూర్తులరెడ్డి, సాధారణ చదువరి అప్పలస్వామి ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేద్కర్ ప్రపంచ మేధావిగా, మత ప్రమేయం లేని లౌకిక భారత రాజ్యాంగ నిర్మాతగా, దేశమంతా కీర్తించబడిన గొప్ప నాయకుడని కొనియాడారు. అత్యంత అణగారిన కులంలో పుట్టి, అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ? ప్రపంచ నాయకుడయ్యారంటే ఆయన ఎంత కృషి చేసి ఉంటారో విద్యార్థులు గమనించాలన్నారు, కావున ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం విశ్రాంత ఫిజికల్ పి.ప్రభాకర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కీర్తించబడుతున్న గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. అనంతరం గ్రంథాలయంలో చదువుతున్న రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అంబేద్కర్ సమసమాజం కావాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రంధాలయాధికారి దమయంతి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వీఓఏలు ధర్నా

**నర్సీపట్నం,ఏప్రిల్ 13,ప్రభాతవార్త**

ఏపీ వెలుగు ఉద్యోగుల సంఘం సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నర్సీపట్నం వెలుగు కార్యాలయం వద్ద వీఓఏలు ధర్నా చేసింది. గత మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని ఎన్నికలకు ముందు ప్రభుత్వం డ్వాక్రా సభ్యులకు రుణాలు ఇచ్చిందని అనేక హామీలు ఇచ్చామని ఈ హామీలు ఎక్కడ అమలు కావడం లేదని అన్నారు. ఎస్ఆర్ఎస్. యాప్ పద్ధతిని రద్దు చేయాలి, అలాగే 10 లక్షల రూపాయల వరకు వడ్డీ రాయితీ ఇస్తామన్న ప్రభుత్వ హామీని అమలు చేయాలి. గతంలో అభయ హస్తం కట్టి 60 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ ఇవ్వాలన్నారు. స్వావలంభన, మహిళా మార్టుల పేరుతో మా నుండి వసూలు చేసిన డబ్బులను మాకు తిరిగి చెల్లించాలన్నారు. మొబైల్, సిమ్ కార్డు ఇచ్చి రీఛార్జ్ చేయించాలని, 0 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీమ్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు హేమ, లత, సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఈరెల్లి చిరంజీవి నిర్వహించారు.

## స్మార్ట్ కిచెన్లను వెంటనే రద్దుచేయాలి

**నర్సీపట్నం,ఏప్రిల్ 13,ప్రభాతవార్త**

స్మార్ట్ కిచెన్లను తక్షణమే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల శంకరరావు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల నర్సరీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన పథకంలో వేలాది మంది మహిళలు పని చేస్తున్నారు. అనేక ఏళ్లుగా పారితోషకాలు ఇవ్వకపోయినా పని ఉన్నట్లు చెప్పారు. అలాగే ముందస్తు పెట్టుబడి పెట్టి పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని వండి పెడుతున్నాం. డొక్కా సీతమ్మ పేరు పెట్టి నేడు ప్రైవేటుపరం చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదన్నారు. పేద పిల్లలకు పెట్టే ఆహారంపై, పథకాలపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడనాడాలన్నారు. కావున కార్మికులందరూ మిడ్ డే మిల్ పథకం స్మార్ట్ కిచెన్లకు ఐక్యంగా ఎదుర్కోవాలని అందించారు. ఈ కార్యక్రమంలో మిడ్డేమిల్ కార్మిక సంఘం నాయకులు ఎ.ప్రసన్న, సత్యవతి, చిన్న తల్లి, ఓ. నూకరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఈరెల్లి చిరంజీవి నిర్వహించారు.

## తలుపులమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కరపత్రాలను ఆవిష్కరించిన స్పీకర్

**నర్సీపట్నం,ఏప్రిల్ 13,ప్రభాతవార్త**



నర్సీపట్నం అయ్యన్న కాలనీలో కొలువై ఉన్న శ్రీతలుపులమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన, 11వ వార్షిక జాతర మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆవిష్కరించారు. స్పీకర్ క్యాంప్ జరిగిన ఈ కార్యక్రమంలో కరపత్రాలను విడుదల చేసిన ఆయన, అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్న ఈ ఉత్సవాల్లో భాగంగా 23వ తేదీన ప్రతిష్టాత్మకమైన విగ్రహం, అనంతరం 28వ తేదీన వార్షిక జాతర వైభవంగా జరగనుంది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ డబ్బిరు శ్రీకాంత్ తో పాటు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బలిఘట్టంలో సృష్టిక్షేత్రం నిర్మించాలి: ఉమాశంకర్ గణేష్

**నర్సీపట్నం,ఏప్రిల్ 13,ప్రభాతవార్త**

పెద్ద చెరువు వద్ద సృష్టిక్షేత్రం పేరుతో 108 అడుగుల పార్వతీపరమేశ్వరుల విగ్రహాన్ని బలిఘట్టం ఉత్తరవాహిని వద్ద నిర్మించాలని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేష్ కోరారు. సోమవారం నర్సీపట్నం మున్సిపాలిటీ బలిఘట్టం బ్రహ్మలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ 108 వద్ద పార్వతీపరమేశ్వరుల పెద్ద విగ్రహం నిర్మాణం వల్ల రైతులకు అడుగుల నష్టం జరుగుతుందన్నారు. దాన్ని బలిఘట్టం వద్ద నిర్మించాలన్నారు. బలిఘట్టం ప్రాంతానికి ఎంతో చరిత్రాత్మకమైందని, ఇక్కడ నది దక్షిణ దిశగా ప్రవహిస్తుందని చెప్పారు. ఎంతో పుణ్యక్షేత్రంగా ఈ ప్రాంతం పేరుగాంచింది. కావున రైతులకు అన్యాయం జరగకుండా ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతంలో సృష్టి క్షేత్రం శివపార్వతుల విగ్రహాన్ని నిర్మించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, మున్సిపాలిటీ వైసీపీ అధ్యక్షులు ఏకా శివ, సర్పంచ్లు, నాయకులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి అమర్నాథ్‌ను కలిసిన వైసిపి నేత కె ఎం నాయుడు

**అనకాపల్లి రూరల్ ఏప్రిల్ 13 (ప్రభాతవార్త)**



మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ని అనకాపల్లి జీవీఎంసీ 80 వ వార్డు వైసిపి ఇన్చార్జి కె ఎం నాయుడు తమ వార్డు వైసిపి కార్యకర్తలతో కలిసి సోమవారం మింది అమర్నాథ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల మాజీ మంత్రి అమర్నాథ్‌పై అరెస్టు వారెంట్ ప్రకటించిన నేపథ్యంలో ఆయనకు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పోరాటంలో ఎంతటి కష్టానికి అయినా వెనుకాడనని తెలియజేశారు. కె ఎం నాయుడు వెంట గొల్లవిల్లి నర్సింగరావు, మునూరు శ్రీ ను సూరిశెట్టి సత్తిబాబు, మారిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

## గొలుగొండ కృష్ణదేవిపేటల్లో నూతన పోలీస్ స్టేషన్లు ప్రారంభం

**గొలుగొండ ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

గొలుగొండ... కృష్ణాదేవిపేటల్లో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాలను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తో పాటు హోమ్ మినిస్టర్ వంగలపూడి అనిత ప్రారంభిస్తున్నట్లు ఎస్ ఐ పి రామారావు తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, వైజాగ్ రేంజ్ గోపీనాథ్ జెట్టి, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మరియు జిల్లా కలెక్టర్ శ విజయ కృష్ణన్ హాజరవుతున్నారని అన్నారు. ముందుగా కృష్ణా దేవి పేట పోలీస్ స్టేషన్ ప్రారంభించి అనంతరం గొలుగొండలో స్టేషన్ ప్రారంభోత్సవం ఉంటుందన్నారు.

## పాము కాటుతో మృతి చెందిన నవ్య కుటుంబానికి అండగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

**( అచ్చుతాపురం ఏప్రిల్ 13 ప్రభాతవార్త)**



మండలం పూడిమడక కడపాలెం గ్రామంలో విషాదంలో మునిగిపోయిన నవ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పరామర్శించి మానసిక ధైర్యం నూరిపోశారు. ఇటీవల అచ్యుతాపురంలోని కస్తూరిబా బాలికల హాస్టల్‌లో పాము కాటుకు గురై మృతి చెందిన ఎం. నవ్య ఘటనపై కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రతి ఇంట్లో ఆడబిడ్డలు లక్ష్మీదేవిలాంటి వారు. ఇలాంటి విషాద సమయంలో మీరు ధైర్యంగా ఉండాలి. మీకు నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అని భరోసా కల్పించారు. బాధలో ఉన్న కుటుంబానికి ఆదరణగా నిలిచి, వారి మనోధైర్యాన్ని పెంపొందించేలా ప్రోత్సహించారు.అనూహ్యంగా చోటుచేసుకున్న ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని నవ్య కుటుంబానికి తమ సానుభూతిని తెలియజేశారు.

## హంసఫర్ రైలుకు ఎలమంచిలిలో స్వాగతం పలుకుతున్న ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు

**ఎలమంచిలి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:**



శ్రీకాకుళం నుండి తిరుపతి వెళ్ళు హంసఫర్ వారాంతపు రైలుకు ఎలమంచిలి స్టేషన్లో హాల్ట్ ఇవ్వడంతో సోమవారం రైల్వే స్టేషన్ లోని హంసఫర్ రైలు లోని ప్రయాణికులకు పుష్పగుచ్చాలు,స్వీట్లు ఇచ్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేసిన సీనియర్ తెలుగుదేశం నాయకులు మాజీ ఎంపీ పప్పల చలపతిరావు,తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, బిజెపి నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లా రామాకుమారి . ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పట్టణ పార్టీ అధ్యక్షుడు గొర్లె నానాజీ, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి దాడి రమేష్, క్లస్టర్ ఇంచార్జ్ కరణం రవికుమార్, బొద్దపు శ్రీనివాసరావు, నమ్మి రమణ, దంట్ల వెంకటస్వామి, సేనాపతి తులసిరాం, సేనాపతి రాజా మహేష్, గొర్లె బాబురావు, విశ్రాంతి ఉద్యోగులు సోమేశ్వరరావు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

## జలధారతో జల హారతి ప్రత్యేక గ్రామ సభలు

**(ఎస్ రాయవరం ఏప్రిల్ 13 ప్రభాతవార్త)**

మండలంలోని తిమ్మాపురం, దార్లపూడి గ్రామపంచాయతీలలో సోమవారం డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్యనారాయణ ఆధ్వర్యంలో జలధారతో జల హారతి ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నీటి వనరుల రక్షణ కోసం అనుసరించాల్సిన విధానం భూగర్భ జలాలను పెంపొందించేందుకు అనుసరించాల్సిన విధానం గురించి చర్చించారు. ప్రతీ ఒక్కరూ జల వనరుల రక్షణలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు ..తిమ్మాపురం గ్రామంలో వేసవి కాలం రీత్యా త్రాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులు పిఏసిఎస్ చైర్మన్ గుర్రం రామకృష్ణ అయన దృష్టికి తీసుకు వచ్చారు. దార్ల పూడి గ్రామ పంచాయతీ లో జల జీవన్ మిషన్ పనులను వెంటనే పూర్తి చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో వంగలపూడి గోవిందు, సమ్మంగి బీమా, కోన అప్పలరాజు ,పంచాయతీ కార్యదర్శిలు ప్రసాద్. గంగరాజు. స్థానిక నాయకులు. గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల వేదికలో 67 ఫిర్యాదుల స్వీకరణ

### - సత్వర పరిష్కారానికి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలు

**అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 13 (ప్రభాతవార్త):**



అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మొత్తం 67 ఫిర్యాదులను స్వీకరించారు. భూ తగాదాలు 35, కుటుంబ కలహాలు 2, మోసపూరిత వ్యవహారాలు 5, ఇతర విభాగాలకు చెందినవి 25, ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా సంబంధిత అధికారులను ఆదేశిస్తూ ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలి. 7 రోజుల్లోపు విచారణ పూర్తిచేసి తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, చేపట్టిన చర్యల నివేదికలను జిల్లా పోలీసు కార్యాలయానికి తప్పనిసరిగా సమర్పించాలి, అని స్పష్టం చేశారు. ఫిర్యాదు దారులతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి సమస్యలను శ్రద్ధగా విన్న ఎస్పీ ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన బాధ్యత. ప్రజా సమస్యలను చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించడంలో అనకాపల్లి జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నారు, అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కరతాల ధ్వనులతో మారుమోగిన అనకాపల్లి నూకంబిక అమ్మవారి జాతర వైభవం

### - 28వ రోజు చేరుకున్న నూకంబిక అమ్మవారి రాష్ట్ర జాతర మహోత్సవాలు

**అనకాపల్లి ఏప్రిల్ 13 (ప్రభాత వార్త)**

భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లి ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన అనకాపల్లి నూకాంబిక అమ్మవారి రాష్ట్ర జాతర మహోత్సవాలు అనకాపల్లి లో స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జనసేన పార్టీ ఇంచార్జ రామ్కి ఆధ్వర్యంలో 28వ రోజుకు చేరుకున్నాయి. అందులో భాగంగా సోమవారం సాయంత్రం ఎన్టీఆర్ మైదానంలో శ్రీకాకుళం వారిచే అభినయ నృత్య నికేతన్ కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను అలరించగా రాజమండ్రి వారిచే లలిత కళా నృత్య నికేతన్ వారి కూచిపూడి నాట్యాలు ఎన్టీఆర్ మైదానంలోని ప్రజలను విశ్లేషంగా ఆకట్టుకున్నాయి. నెల రోజులు జరిగే నూకంబిక అమ్మవారి జాతర మహోత్సవాలు ఎన్టీఆర్ మైదానానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి పట్టణ సీఐ ప్రేమ్ కుమార్, రూరల్ సిఐ అశోక్ కుమార్, కసింకోట సీఐ సోము నాయుడు, టౌన్ ఎస్సైలు సంతోష్ కుమార్, శ్రీనివాస్, భాస్కరరావు, కసింకోట ఎస్సై మనోజ్ కుమార్, అనకాపల్లి దిశా ఎస్సై శేఖర్, రూరల్ ఎస్సై రవికుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కళాకారులను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పీల నాగ శ్రీను, ఈవో శ్రీధర్,ధర్మకర్తల మండల సభ్యులు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్లు తిమ్మాపురం చక్రవర్తి,సకల గోవిందరావు,గండేపల్లి మురళి, రాష్ట్ర గవర్నర్ కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరికృష్ణ పాల్గొన్నారు

## పాల్తేరులో కోటమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

**పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

మండలంలోని పాల్తేరులో కోటమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. రాంబాబు చెరువులో ఉన్న అమ్మవారి ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించగా, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్త్రీ శక్తి పై అవగాహన

**(నక్కపల్లి ,ప్రభాతవార్త)**



ఈనెల 16 నుండి19వ తేదీ లో జరిగే పార్లమెంట్ సమావేశాలలో మహిళలకు 33 రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్లో ప్రవేశపెట్టనున్నారని, భారతదేశ చరిత్రలో ఇది ఒక చారిత్రాత్మక ఘట్టం అని ప్రిన్సిపల్ డా.ఎం శివయ్య విద్యార్థినిలకు తెలిపారు. చట్టసభల్లో ఇకపై మహిళలుకు అధిక ప్రాధాన్యతతో పాటు భవిష్యత్ రాజ్యాధికారం కూడా చేసే అవకాశం ఉందని హర్షం వ్యక్తం చేశారు. స్త్రీ శక్తి కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించిన పలువురి విద్యార్థినిలకు కళాశాల తరఫున బహుమతులు అందజేశారు.

## పిల్లలు ఆరోగ్యం , అభివృద్ధిపై తల్లులు దృష్టి సారించాలి

**అనకాపల్లి రూరల్ ఏప్రిల్ 13 :(ప్రభాతవార్త)**



పిల్లల ఆరోగ్యం అభివృద్ధి పై తల్లులు దృష్టి సారించాలి అని ఐసిడిఎస్ పిడి సూర్య లక్ష్మీ తెలిపారు. ఈనెల తొమ్మిదో తేదీ నుండి 23వ తేదీ వరకు నిర్వహించే పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా సోమవారం గాంధీనగర్ అంజయ్య కాలనీ అంగన్వాడి కార్యాలయంలో ఐసిడిఎస్ పిడి సూర్య లక్ష్మీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య లక్ష్మీ , సిడిపిఓ ఎం.వి. రమణ కుమారి లు మాట్లాడుతూ గోల్డెన్ విండో (1000రోజులు ), పోషిత్ భారత్, ప్రారంభ విద్య వంటి ముఖ్య అంశాలపై సూచనలు, సలహాలు తెలియజేశారు. పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణీలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలాంటి ఆహారాన్ని తీసుకోవాలి అలాగే పుట్టిన తర్వాత బాలింతలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై ప్రతి అంగన్వాడి కేంద్రంలోనూ వారి పరిధిలో ఉన్న వారికి ప్రత్యేక అవగాహన కల్పించవలసిన అవసరం అంగన్వాడీలపై ఉందని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పౌష్టిక ఆహారాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలకు బాలింతలకు పిల్లలకు అందజేస్తుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ఎ సిడిపిఓ శశికళ అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## పచ్చని పల్లెలపై కార్పొరేట్ మేఘం

### - నిర్వాసిత రైతుల గోడు వినిపించిన సిపిఎం బృందం

**( రాంబిల్లి ఏప్రిల్ 13 ప్రభాతవార్త.. )**



రాంబిల్లి మండల పరిధిలోని వెంకయ్యపాలెం, గజ్జిరెడ్డిపాలెం, మన్యపు చింతువ రెవెన్యూ గ్రామాలలో సిపిఎం బృందం పర్యటించి, గూగుల్, రెన్యూ సోలార్ ప్రాజెక్టుల కారణంగా నిర్వాసితులవుతున్న రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం రాంబిల్లి మండల కార్యదర్శి జి. దేవుడు నాయుడు, అచ్చుతాపురం నాయకులు కె. సోమ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా పచ్చని వనరులతో కళకళలాడిన ఈ ప్రాంతంలో వేలాది కొబ్బరి చెట్లు, జీడి, మామిడి తోటలు, యూక్లిప్టస్, అకేసియా వంటి వృక్ష సంపదను కార్పొరేట్ ప్రాజెక్టుల పేరిట నిర్మూలిస్తున్నారని విమర్శించారు. ప్రకృతి సంపదను నాశనం చేసి ప్రైవేటు సంస్థలకు లాభాల వేదికగా మార్చడం పట్ల గ్రామస్తుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నదన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రావలసిన పరిహారం, పునరావాస సౌకర్యాలు అందించాలని డిమాండ్ చేశారు, లేదంటే ప్రజలను సమీకరించి భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎరుపిల్లి రాము, మైలపల్లి రమణ, చింతకాయల శివాజీతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆసుపత్రి అదనపు భవనాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**చోడవరం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:**



చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి అదనపు వసతి సౌకర్యం కోసం ఐదు కోట్ల 70 లక్షల రూపాయలతో సోమవారం స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మరిన్ని వైద్య సౌకర్యాలు కల్పించేందుకు ఆస్పత్రి పైభాగంలో ఒకటో అంతస్తు ఆధునిక సౌకర్యాలతో నిర్మించేందుకు నిధులు మంజూరు అయ్యాయని చెప్పారు. దీంతో ఆసుపత్రిలో మరిన్ని సేవలు మెరుగుపడంతో పాటు 50 లేక 100 పడకల స్థాయి కూడా పెరుగుతుందని తెలిపారు. అనంతరం కాంట్రాక్టర్లను సన్మానించి త్వరగా మంచి క్వాలిటీతో పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు కార్యక్రమంలో పార్టీ నాయకులు తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, టిడిపి పట్టణ అధ్యక్షులు ఎర్రంశెట్టి చిన్న, అనకాపల్లి జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు కందర్ప రమణమూర్తి, పిఏసిఎస్ అధ్యక్షులు మూలి నాయుడు, శివాలయం చైర్మన్ సురేష్, ఎంపీటీసీ రూపా దేవి చిన్న, కనకమహాలక్ష్మి, పొట్నూరు మనితల్లి, సకురు కోటేశ్వరరావు, నౌడు సుధాకర్, ఆసుపత్రి కమిటీ సభ్యులు దేవరపల్లి వెంకట అప్పారావు, పప్పు శ్రీను, బాలి బోయిన పార్వతీ దేముడు, బొబ్బిలి ఈశ్వరరావు, హాస్పిటల్ వైద్య సిబ్బంది, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## త్వరలో అన్న క్యాంటీన్ ప్రారంభం

**చోడవరం ఏప్రిల్ 13, ప్రభాతవార్త**



పేద ప్రజలకు అతి తక్కువ రుసుముతో మూడు పూటలా ఆహార అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మిస్తున్న అన్న క్యాంటీన్లో భాగంగా చోడవరంలో కాంప్లెక్స్ వద్ద నిర్మిస్తున్న అన్న క్యాంటీన్ త్వరలో ప్రారంభం కాగలదని స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజు చెప్పారు. సోమవారం అయినా పార్టీ నాయకులతో కలిసి అన్న క్యాంటీన్ పనులను పరిశీలించారు. పనులు మరింత వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ క్యాంటీన్ ప్రారంభమైతే నిరుపేద వర్గాలకు చెందిన అనేకమందికి మూడు పూటలా ఆహారం లభిస్తాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ ఆంజనేయులు, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, ఇంజనీరింగ్ అధికారి శాంతారాం, లక్ష్మీ, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లు నాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కందరపు రమణమూర్తి, పిఏసిఎస్ అధ్యక్షులు మూలినాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షులు ఎర్రంశెట్టి చిన్న, ఈర్లే శ్రీనివాస్, పసుమర్తి సాంబ, కనకమహాలక్ష్మి, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రధాని కూడలి అడ్డరోడ్డులో రామతీర్థం విగ్రహాలకు స్వాగతం పలికిన రామా భక్తులు,కూటమి నాయకులు

**(ఎస్ రాయవరం ఏప్రిల్ 13 ప్రభాతవార్త )**



విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం రామతీర్థం దేవస్థానం చెందిన నీలాచాల పర్వతం బోడి కొండపై గతంలోని ధ్వంసమైన కోదండరామ స్వామి తో పాటు సీత, లక్ష్మణ మూర్తుల మరియు పాత లక్ష్మణ స్వామి విగ్రహాలను ఆగమశాస్త్రం ప్రకారం జలాధివాసము( నిమజ్జనం) చేసే భాగంగా యాత్ర ప్రారంభించడం జరిగింది. అందులో భాగంగా అడ్డురోడ్డు తిమ్మాపురం జంక్షన్ పై ఓవర్ వంతెన వద్ద రామ భక్తులతోపాటు కూటమి నాయకులు స్వాగతం పలికారు.ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, కొరుప్రోలు పిఎసిఎస్ చైర్మన్ గుర్రం రామకృష్ణ ,టిడిపి పాయకరావుపేట నక్కపల్లి మండలాల అధ్యక్షులు పద్దు, జి. లక్ష్మణరావు, టిడిపి సీనియర్ నాయకులు కురందాసు నూకరాజు, వంగలపూడి గోవిందు, సమ్మెంగి బీమా,లోవరాజు ,కోనఅప్పలరాజు, అప్పలకొండ, బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు జోగి నాయుడు, జనసేన నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పిఎల్ పురంలో పర్యటించిన ఎంపిడిఓ అడపాలవరాజు

**పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 13, ప్రభాతావార్త**

మండలంలోని పిఎల్ పురంలో ఎంపిడిఓ అడపా లవరాజు సోమవారం పర్యటించారు. ముందుగా గ్రామ పంచాయితీ కార్యాలయాన్ని సందర్శించిన ఎంపిడిఓ లవరాజు సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం గ్రామంలో గల చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనుల నిర్వాహనపై సిబ్బందిని అడిగి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లగుడు అప్పల శివరామం, ఎంపిటిసి నాగం వెంకట రత్నం (చినబాబు) పాల్గొన్నారు.

## సముద్ర చేపల వేట నిషేధ కాల భృతిపై మార్గదర్శకాలు



శ్రీకాకుళం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయం వారు ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు సముద్ర చేపల వేటపై విధించిన నిషేధం వల్ల ప్రభావితమయ్యే మత్స్యకార కుటుంబాలకు అందించే రూ. 20వేలు ఆర్థికసాయంపై మార్గదర్శకాలు వెలువడినట్లు జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ వై.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రియల్ క్రాఫ్ట్ పోర్టల్‌లో రిజిస్టర్ అయ్యి ఏప్రిల్ 14 నాటికి చెల్లుబాటు అయ్యే ఫిషింగ్ లైసెన్స్ కలిగిన మెకనైజ్డ్, మోటరైజ్డ్, సాంప్రదాయ పడవల వేట సిబ్బంది మాత్రమే అర్హులని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జరిమానా పడిన బోట్లుకు ఈ భృతి వర్తించదు. 2026 మార్చి 31 నాటికి 18 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉండాలి. లబ్ధిదారులు ఎన్టీఆర్ భరోసా (మత్స్యకార పెన్షన్) పొందుతూ ఉండకూడదని, ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండకూడదు. 4 చక్రాల వాహనం ఉండకూడదు. ఇతర ఆదాయ పరిమితుల నిబంధనలకు లోబడి ఉండాలన్నారు. పడవ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, లైసెన్స్‌కాపీ, సిబ్బంది అందరి ఆధార్‌కార్డు కాపీలు, సిబ్బంది అందరి బ్యాంక్ పాస్‌బుక్ మొదటి పేజీ కాపీ అందజేయాలి. ఏప్రిల్ 17 టీమ్ ద్వారా సమాచార సేకరణ మరియు పడవల తనిఖీ, ఏప్రిల్ 19 నుంచి 22 వరకు సేకరించిన డేటా ఎంట్రీ మరియు ధృవీకరణ, ఏప్రిల్ 23న సచివాలయాల్లో ప్రాథమిక లబ్ధిదారుల జాబితా ప్రదర్శన, ఏప్రిల్ 23 నుంచి 25 వరకు అభ్యంతరాల స్వీకరణ, ఏప్రిల్ 27న తుది జాబితా తయారీ మరియు కలెక్టర్ ఆమోదం, ఏప్రిల్ 30 నుంచి ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం డిబిటి ద్వారా నగదు జమ చేయబడుతుందని తెలిపారు.

## 400 సారా ప్యాకెట్లు , ద్విచక్ర వాహనం స్వాధీనం



కంచిలి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : సోంపేట ఎక్సైజ్ సి.ఐ జీ.వి.రమణ ఆధ్వర్యంలో పులకపుట్టుగకి చెందిన పులక లక్ష్మణరావు ఒడిశా తూటుపురం నుంచి 300 ప్యాకెట్లు ద్విచక్ర వాహనంతో రవాణా చేస్తుండగా ఆదివారం సంత దగ్గర కాపు కాసి పట్టుకొని కేసు నమోదు చేసి నాటుసారా మరియు ద్విచక్ర వాహనం సీజ్ చేశారు. అలాగే కంచిలి మండలం ఎంఎస్ పల్లి గ్రామంలో నాటుసారా అమ్ముతున్న రత్నాల హేమలత మరియు బొండాడ మోహనరావుల నుంచి 100 నాటుసారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. వీరిని సోంపేట కోర్టు మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. నాటు సారాపై ఏదైనా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 14405 లేదా 9440902358 నెంబరుకు గాని తెలియపర్చవచ్చును. వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. దాడులలో సోంపేట ఎక్సైజ్ సి.ఐ రమణ, ఎస్.ఐ జగన్నాథ్, సిబ్బంది భాను ప్రసాద్,ఉమాపతి, మార్కారావు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలి : కూన




ఆమదాలవలస, ఏప్రిల్ 13 (ప్రభాతవార్త): ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న ఆధునిక వసతులను ప్రజల్లోకి తీసుకెళ్లి, అడ్మిషన్ల శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ కమిటీ ఛైర్మన్ కూన రవికుమార్ పిలుపునిచ్చారు. పొందూరు పట్టణంలోని సోమవారం పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో అడ్మిషన్ల పెంపు, నూతన విద్యా విధానంపై నిర్వహించిన భారీ అవగాహన ర్యాలీలో ఆయన స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో ప్రైవేటుకు ధీటుగా ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ విద్యాబోధన, అత్యాధునిక మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## స్త్రీశక్తి మహిళా రిజర్వేషన్ బిల్లుపై అవగాహన సదస్సు



ఆమదాలవలస, ఏప్రిల్ 13 (ప్రభాతవార్త): ఆమదాలవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్త్రీ శక్తి మహిళా రిజర్వేషన్ బిల్లుపై సోమవారం అవగాహన సదస్సును నిర్వహించారు. భారత రాజకీయాల్లో మహిళా రిజర్వేషన్లు అత్యంత కీలక అంశంగా మారుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ఎస్.ఎన్ స్వామి తెలిపారు. మహిళలు ఆర్థిక సామాజిక రాజకీయ రంగాల్లో ముందు ఉండటం ద్వారా సాధికారత సాధ్యం అవుతుందని తెలిపారు. పురుష ఓటర్లతో దాదాపు సమానంగా ఉన్న స్త్రీ ఓటర్లు ఉన్నప్పటికీ భారత పార్లమెంటులో కేవలం 14 మంది మాత్రమే మహిళలు ప్రాతినిధ్యం ఉండటం అత్యంత అప్రజాస్వామికమని, స్త్రీలకు రాజకీయ సమానత్వంతోనే ఆర్థిక, సాంఘిక సమానత్వం చేకూరుతుందనే అంబేద్కర్ ఆలోచన విధానం భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు మూల కారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా రిజర్వేషన్ బిల్లు, స్త్రీ సాధికారత, స్త్రీ శక్తి మొదలగు అంశాలపై వివిధ రకాల పోటీల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి బాధ్యతల స్వీకరణ



సీతంపేట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: సీతంపేట గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా మండల డిప్యూటీ ఎంపీడీవో ఎల్.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని పారిశుధ్యం మెరుగు ఇంటి పన్ను వసూళ్ల లక్ష్యాలు పూర్తి చేయడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ప్రత్యేక అధికారికి సచివాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

## ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు 12 వినతులు



సీతంపేట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: సీతంపేట ఐటిడిఏ ఎస్సార్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 12 వినతులు వచ్చినట్లు ఏపీఓ జి.చిన్నబాబు తెలిపారు. టెక్కలికి చెందిన జన్ని కనకమహాలక్ష్మి తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని వినతిపత్రం సమర్పించారు. బంధమానుగూడ గ్రామానికి చెందిన సవర పారమ్మ పవర్ టిల్లర్ మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. బిల్లమడ గ్రామానికి చెందిన పత్తిక సునీల్ పవర్ వీడర్ మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. పాత పెద్దగూడ గ్రామానికి చెందిన సవర సింగారు గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ రమాదేవి. వెటర్నరీ ఏడి శ్రీనివాసరావు. జిసిడిఓ రాములమ్మ. ఏపీ డి.వెంకటరమణ, పంచాయతీరాజ్ డిఇ రాధారాణి, తదితరులు పాల్గొన్నారు.

## ఈ ప్రభుత్వంలో పేద విద్యార్థులకు ఉన్నత విద్య కష్టమే : రెడ్డి శాంతి



పాతపట్నం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : విద్యాశాఖను పూర్తిగా భ్రష్టు పట్టించి, విద్యార్థుల భవిష్యత్తుతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్రస్థాయిలో విమర్శించారు. సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నిర్దేశిత సమయంలోగా ఫీజు చెల్లించకపోతే వడ్డీతో కలిపి దాన్ని చెల్లించాలని కొత్త విధానానికి కార్పొరేట్ స్కూల్స్ తెరలేపాయని, విద్యార్థుల తల్లిదండ్రులు తమ ఆర్థిక స్థితిని బట్టి విద్యా సంవత్సరం ప్రారంభంలోనో, మధ్యలోనో, చివరిలోనో ఫీజులు చెల్లిస్తుంటారని, కానీ ఆర్థిక భారంతో సతమతమవుతున్న వీరికి గుండెల్లో గుచ్చే విధంగా విద్యా సంవత్సరం ప్రారంభం కాకుండగానే ఫీజు చెల్లించాలని గడువు విధించడం, నిర్దేశిత సమయంలోపు చెల్లించకపోతే వడ్డీ విధిస్తామని చెబుతుండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని ఆమె తెలిపారు.

## కార్యకర్తే అధినేత కార్యక్రమంలో ఎమ్మెల్యే గోవిందరావు



పాతపట్నం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్యకర్తే అధినేత సమావేశంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కార్యకర్తే అధినేత అనే మాటలను తెలుగుదేశం పార్టీ ఆచరణలో పెట్టిందని, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన కార్యకర్తలే పార్టీకి బలం అని ఆయన అన్నారు. దేశంలో ఏ పార్టీకి లేని సంస్థాగత నిర్మాణం తెలుగుదేశానికి ఉందని, ఈ మేరకు నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తతో సమావేశం నిర్వహిస్తానని, వారి యొక్క సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మై టిడిపి యాప్ ఇన్‌స్టాల్ చేసుకుని పార్టీ ఇచ్చిన టాస్కులను మరియు నియోజకవర్గంలో చేసిన కార్యకలాపాలను యాప్‌లో అప్లోడ్ చేయాలని ఎమ్మెల్యే గోవిందరావు క్యాడర్‌కు దిశానిర్దేశం చేసారు. సమావేశంలో ఐదు మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాంతినికేతన్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకలు



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ముందస్తుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. స్కూల్ ఛైర్మన్ డి.కృష్ణ మూర్తి రెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కె.సి.పూరి, ఉపాధ్యాయులు శంకర్, పద్మజ, శ్రీధర్, రవి, శాంతి, యశోద, స్నేహ, కృష్ణ, జయలక్ష్మి, మీనా, పార్వతి, ప్రమీల, శిరీష, సరోజ, ప్రియ దర్శిని ఇంటరక్ట్ క్లబ్ సెక్రటరీ డి.హర్షవర్ధన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ స్వాతి పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం : దాసరి రాజు



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: మంగళగిరి లోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉప ముఖ్య మంత్రి, జనసేనాని పవన్ కళ్యాణ్ ఆదేశానుసారం జనవాణి జనసేన భరోసా కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి తక్షణ పరిష్కారం చూపే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు పాల్గొని బాధితుల నుండి వినతి పత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో వీర మహిళ శైలజ, చిన్నరాజా, సంతోష్, వల్లభరావు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలకు సచివాలయ సేవలు పారదర్శకంగా కావాలి



బూర్జ, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : గ్రామ సచివాల యం సేవలు ప్రజలకు పారదర్శకంగా, వేగంగా అం దాలని శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష అన్నారు. సోమవారం మండలం కేంద్రం గ్రామ సచివాలయం కార్యాలయాన్ని ఆర్డీవో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు విధానం, ప్రజల వినతులు, ఫిర్యాదుల పరిష్కార విధానాన్ని పరిశీలించారు. అనంతరం సమావేశ మందిరంలో రెవెన్యూ సిబ్బంది రైతులతో సమావేశమయ్యారు. రైతుల సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఆమె సిబ్బందికి సూచించారు. సచివాలయ సిబ్బంది ప్రతిరోజూ సమయానికి విధులకు హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న ఫేషియల్ అటెండెన్స్ విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. సచివాలయ సేవలు ప్రజలకు సులభంగా, పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా భూ రికార్డులు, ల్యాండ్ రిజిస్టర్లను పరిశీలించిన ఆర్డీవో, అన్ని రికార్డుల ను సక్రమంగా నవీకరించి నిర్వహించాలని అధికారులకు సూచించారు. తాసిల్దార్ వై.వి.పద్మావతి . జి ఎస్ డబ్ల్యూ ఎస్ ఆఫీసర్ మూల భాస్కర్, ఆర్ఎస్ డిటి వెంకటేష్, రవి ఇన్‌స్పెక్టర్, విఆర్వోలు పాల్గొన్నారు.

## డీసీసీబీ బ్యాంకు స్థాపనకు అడుగులు : ఛైర్మన్‌కు విజ్ఞప్తి



కొత్తూరు, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : జిల్లాలోని కొత్తూరు మండల కేంద్రంలో డీసీసీబీ (జిల్లా సహకార కేంద్ర బ్యాంకు) శాఖను ఏర్పాటు చేయాలని టీడీపీ సీనియర్ నాయకులు లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు కోరారు. సోమవారం శ్రీకాకుళంలోని డీసీసీబీ కార్యాలయంలో బ్యాంక్ ఛైర్మన్ శివ్వాల సూర్యనారాయణను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి, ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తులసీ వరప్రసాదరావు మాట్లాడుతూ జిల్లాలోనే అతిపెద్ద మండలాల్లో ఒకటిగా ఉన్న కొత్తూరులో జనాభా సాంద్రత అధికమని, ముఖ్యంగా వంశధార నిర్వాసితులు, గిరిజనులు, రైతులు ఈ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో నివసిస్తున్నారని వివరించారు. వ్యవసాయ రంగంపై ఆధారపడిన రైతులకు, సామాన్య ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇక్కడ బ్యాంకు కేటాయింపు అత్యంత ఆవశ్యకమని ఆయన ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై డీసీసీబీ ఛైర్మన్ శివ్వాల సూర్యనారాయణ సానుకూలంగా స్పందిస్తూ, రైతుల ప్రయోజనాల దృష్ట్యా కొత్తూరులో బ్యాంకు ఏర్పాటుకు తన వంతు పూర్తి సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు.

## అక్రమ తాగునీటి కనెక్షన్లు తొలగిస్తాం : ఈవో



పాతపట్నం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన త్రాగునీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఈఓ వి.రామచంద్రరావు స్పష్టం చేశారు. పట్టణంలో కొంతమంది స్వార్థపూరిత చర్యల వల్ల సామాన్య ప్రజలకు నీరు అందకుండా పోతోందన్నారు. ముఖ్యంగా ప్రధాన పైపులైన్ల నుండి అక్రమంగా ఏర్పాటు చేసిన కనెక్షన్లను (నీటి బొడ్డులు) గుర్తించి తక్షణమే తొలగిస్తున్నట్లు తెలిపారు. వీధి కుళాయిలకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని లాగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టామని, నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలతో పాటు కనెక్షన్లను శాశ్వతంగా రద్దు చేస్తామని పేర్కొన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా నీటి వృధాను అరికట్టడంలో ప్రజల పాత్ర కీలకమని, ట్యాపుల వాడకం పూర్తయిన తర్వాత వాటిని వదిలేయకుండా ఖచ్చితంగా కట్టి వేయాలని ఆయన సూచించారు. అక్రమ కనెక్షన్ల తొలగింపునకు వచ్చే పంచాయతీ సిబ్బందికి ప్రజలు సహకరించాలని, అలాగే చెత్తను వీధుల్లో రోడ్లు మరియు డ్రైనేజీలలో పారవేయకుండా ఏర్పాటు చేసిన చెత్త బుట్టల్లో వేయాలని, ఇంటి పన్నులను బకాయిలు లేకుండా కట్టాలని ఆయన కోరారు.

## బీసీలకు జగన్ అసలైన వెన్నెముక : చింతాడ



కొత్తూరు, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : రాష్ట్ర చరిత్రలో బీసీలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి, వారిని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థానాల్లో నిలబెట్టిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని వైఎస్ఆర్సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, మాజీ పి.ఎ.సి.ఎస్ ఛైర్మన్ చింతాడ సూర్యనారా యణ స్పష్టం చేశారు. కొత్తూరులో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో బీసీలను కేవలం వెనుకబడిన వర్గాలుగా చూడకుండా, రాష్ట్రానికే వెన్నెముకగా గుర్తించి అన్ని రంగాల్లోనూ సముచిత స్థానం కల్పించారని కొనియాడారు. రాష్ట్రంలోని 130 బీసీ కులాలకు గౌరవప్రదమైన గుర్తింపునిస్తూ, జగన్ తన మంత్రివర్గంలో విప్లవాత్మక మార్పులు చేశారని ఆయన గుర్తు చేశారు. గతంలో 25 మంది మంత్రులలో 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు అవకాశం కల్పించడమే కాకుండా, అందులో 11 మంది బీసీలకు మంత్రి పదవులు ఇచ్చి సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపించారన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సామాజిక సమీకరణాలు దెబ్బ తిన్నాయని, 24 మంది మంత్రుల్లో కేవలం ఎనిమిది మంది బీసీలకు మాత్రమే చోటు దక్కడం ఆ వర్గాల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిన్నచూపుకు నిదర్శనమని ఆయన విమర్శించారు. బీసీల అభివృద్ధి కోసం 57 ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం ద్వారా అట్టడుగు వర్గాలకు కూడా రాజకీయ ప్రాధాన్యత కల్పించిన ఘనత జగన్‌కే దక్కుతుందని సూర్యనారాయణ వివరించారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు ఎంపీపీ సవర సావిత్రి, జడ్పీటీసీ కామక భాగ్యవతి, మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, నిమ్మగడ్డ కృష్ణమూర్తి , తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రైతుల రుణాల్లో వ్యత్యాసాలపై విచారణ



బూర్జ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : మండల కేంద్రమైన బూర్జ కోపరేటివ్ సొసైటీలో రైతుల రుణాల్లో ఏర్పడిన వ్యత్యాసాలపై విచారణ అధికారి ప్రసాదరావు సోమవారం రైతుల సమక్షంలో రికార్డులను పరిశీలించి తనిఖీలు నిర్వహించారు. రైతులకు మంజూరు చేసిన రుణాలకు సంబంధించి రికార్డుల్లోనూ, కంప్యూటర్‌లోను వ్యత్యాసాలు ఉన్నాయని, రైతులు ఇటీవల స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులకు ఆదేశించడంతో సోమవారం నుంచి విచారణ ప్రారంభించారు. రైతుల సమస్యలు పరిష్కరించేంత వరకు ఈ విచారణ కొనసాగనున్నట్లు తెలిపారు. 4113 మంది రైతులు రూ.32 కోట్ల వరకు రుణాలు తీసుకోవడం జరిగిందని సిబ్బంది తెలిపారు.

## నాణ్యమైన రాగులు ఉత్పత్తి చేసి మద్దతు ధర పొందండి



సంతబొమ్మాళి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : నాణ్యమైన రాగులు ఉత్పత్తి చేసి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులు పొందాలని టెక్కలి డివిజన్ ఏడిఏ కె.జగన్మోహన్ రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రాగులు కొనుగోలు కేంద్రంను అయన ప్రారంభించారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు సంతబొమ్మాళి మండల కేంద్రంలో రాగులు కొనుగోలు కేంద్రం మంజూరైంది. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కొనుగోలు కేంద్రం ప్రారంభ కార్యక్రమంలో రైతులు నుంచి రాగులు కొనుగోలు చేసారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు సుగ్గు శాంతి స్వరూప్ రెడ్డి, బోయిన శ్రీనివాస్, పిఎసియస్ అధ్యక్షులు కూచెట్టి కాంతారావు, తెదేపా నాయకులు జీరు భీమరావు, బాడాన రమణమ్మ, అట్టాడ రామ్మోహన్ ప్రసాద్ మెండ ప్పారావు, సి హెచ్ ధర్మార్జున రెడ్డి, పుక్కళ్ల శ్రీనివాస్, సివిల్ సప్లై మేనేజర్ విజయరాజు, సంతబొమ్మాళి ఏ ఓ ఆర్.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం వార్త

## తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలి



కొత్తూరు, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : కొత్తూరు మండలంలోని గిరిజన గ్రామాల్లో నెలకొన్న తీవ్ర తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ మరియు ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కలోడియా ఆధ్వర్యంలో సోమవారం కొత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నీరజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలం కావడంతో గొట్టిపల్లి పంచాయతీ ఉల్లిమాన్ గూడ, అడ్డంగి పంచాయతీలోని దాపాకులగూడ, ఎగువ మరియు దిగువ ముల్లేలుగూడ, కారి గూడ పంచాయతీలోని దిగువ దొండమాన్ గూడ, దిమిలి పంచాయతీ పరిధిలోని ఇప్పగూడ, బొడ్డ గూడ, అలాగే పొంటూరు పంచాయతీలోని బంకిబంజారుగూడ మరియు మెత్తుగూడ వంటి గ్రామాల్లో నీటి ఎద్దడి అత్యంత తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు తక్షణమే స్పందించి గిరిజన ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించి, కొండలపై జీవనం సాగిస్తున్న గిరిజనుల దాహార్తిని తీర్చాలని వారు డిమాండ్ చేశారు. ఒకవేళ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే గిరిజనుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ విన్నపంపై సానుకూలంగా స్పందించిన ఎంపీడీఓ నీరజ మాట్లాడుతూ ఏయే గ్రామాల్లో అయితే నీటి సమస్య ఉందో ఆయా ప్రాంతాల అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి తగిన కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజన నాయకులు , స్థానికులు రమేష్, రాము, సునీల్, పంజు, శీలా, జాన్సీ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## కరవంజిలో రైతులకు శిక్షణ




జలుమూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: మండలంలోని కరవంజ గ్రామంలో ఆత్మపథం లో భాగంగా రికగ్నైజేషన్ ఆఫ్ ప్రేయర్ లెర్నింగ్ రైతులకు శిక్షణ నిర్వహించినట్లు ఏవో కింజరాపు రవికుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట ఏడిఏ ఎల్.వి. మధు మాట్లాడుతూ వరి పంటలో ఎరువుల నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా సమతుల్యంగా ఎరువులు వినియోగం, మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులు వాడకం, సరైన దశల్లో విడతల వారీగా ఎరువుల విడతలు వేయడం, అధిక నత్రజని ఎరువులు వినియోగాన్ని తగ్గించడం, సమగ్ర పోషక నిర్వహణ పద్ధతులు అనుసరణ గురించి తెలిపారు. సరైన ఎరువుల నిర్వహణ ద్వారా అధిక దిగుబడులు పెరగడమే కాకుండా, సాగుకు అయ్యే ఖర్చులు కూడా తగ్గి, మట్టి ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు చురుకుగా తమ సందేహాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నీటి సంఘం ప్రెసిడెంట్ జుత్తు అప్పలనాయుడు, శ్రీకాకుళం ఏవో డీఆర్సీ వై సురేష్, ఏఈఓలు, విఏఏ లు, రైతులు పాల్గొన్నారు.

## నేరడి బ్యారేజీ నిర్మాణం.. చరిత్రలో నిలిచిపోయే ఘట్టం

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : ఉత్తరాంధ్ర రైతాంగ దశాబ్దాల కల అయిన నేరేడి బ్యారేజీ నిర్మాణం చరిత్రలో నిలిచిపోయేలా సాకారం కాబోతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. సోమవారం ఆయన నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుమారు 50 ఏళ్ల ఆరాటానికి ఎట్టకేలకు మోక్షం లభించిందని, కేవలం ఏడాదిన్నర కాలంలోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని ఆయన ఉద్ఘాటించారు. నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో నందిగాం మండల నాయకులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి పలు కీలక అంశాలను వెల్లడించారు.

**ఎర్రన్నాయుడు ఆశయం.. కూటమి ప్రభుత్వ లక్ష్యం:**

నేరేడి బ్యారేజీ నిర్మాణం దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు కల అని, ఆ ఆశయాన్ని నెరవేర్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని అచ్చెన్నాయుడు భావోద్వేగంతో పేర్కొన్నారు. నేరేడి గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడం ఒక చారిత్రాత్మక విజయం. ఇందుకోసం తాను, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర పెద్దలతో నిరంతరాయంగా సంప్రదింపులు జరిపారు. ఆ కృషి ఫలితంగానే నేడు సమస్య పరిష్కార దిశగా అడుగులు పడ్డాయని తెలిపారు. ప్రాజెక్టు పనుల కోసం ప్రాథమికంగా రూ.60 కోట్ల మంజూరుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు.

**వైకాపా హయాంలో ప్రాజెక్టులు నిర్వీర్యం :**

గడిచిన ఐదేళ్ల వైకాపా పాలనలో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని మంత్రి మండిపడ్డారు. 2010లో ట్రిబ్యునల్ ఏర్పాటుతో పరిష్కారం మొదలైతే, 2014లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక పనులు వేగవంతం చేశారని గుర్తు చేశారు. 2019-24 మధ్య వైకాపా ప్రభుత్వం కనీస ప్రయత్నం కూడా చేయకుండా జిల్లా ప్రయోజనాలను పక్కన పెట్టిందని విమర్శించారు. ప్రతిష్టాత్మకమైన ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు గతంలో రూ.450 కోట్లు మంజూరై పనులు శరవేగంగా సాగాయని, కానీ గత ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పట్టించుకోకుండా గాలికొదిలేసిందని ఆరోపించారు. సాగునీటి రంగానికి కూటమి ప్రభుత్వం అగ్రతాంబూలం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. నేరేడితో పాటు ఆఫ్‌షోర్ ప్రాజెక్టును కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఏడాదిన్నరలో ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే, జిల్లా రైతాంగం ఏడాదికి రెండు మూడు పంటలు పండించుకునే వెసులుబాటు కలుగుతుందని, శ్రీకాకుళం జిల్లా అన్నపూర్ణగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్ , తెలుగు దేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మన ఊరు బడిని కాపాడుకుందాం : యూటీఎఫ్



కోటబొమ్మాళి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : మండలం సింహాద్రిపురం, మహాసాహెబ్ పేట గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించుటకు సింహాద్రిపురం ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొండు నారాయణరావు ఆధ్వర్యంలో సోమవారం అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 8 మంది విద్యార్థులను ఒకటవ తరగతిలో చేర్పించుటకు తల్లిదండ్రులు అంగీకారం తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం కల్పించిన అన్ని రకాల సదుపాయాలు ను తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందని పక్షములో మమ్మల్ని ప్రశ్నించాలని, మేము బాధ్యతగా పనిచేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా నీలంపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హేమానాచార్యులు మాట్లాడుతూ విద్యార్థులకు ఆహ్లాదకరమైన విద్యను అందించడంలో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలు కంటే ముందు ఉంటాయని, ఒత్తిడి లేని విద్య ప్రభుత్వ పాఠశాలలోనే ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సహోపాధ్యాయిని జి.భారతి, విద్య కమిటి ఛైర్మన్ జయమ్మ, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

## మెగా యూత్ ఫోర్స్ విస్తరణకు కృషిచేయాలి



బొబ్బిలి /విజయనగరం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గరున్న జీఎస్ఆర్ హోటల్‌లో నేషనల్ మెగా యూత్ ఫోర్స్ కన్వీనర్ ఏడిద బాబీ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెగా యూత్ ఫోర్స్ జాతీయ కన్వీనర్ ఏడిద బాబీ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో మెగా యూత్ ఫోర్స్‌ను విస్తరించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మెగాస్టార్ చిరంజీవికి ఎంతమంది ఫ్యాన్స్ ఉన్నారో ప్రత్యేకంగా చెప్పల్సిన అవసరం లేదని. చిరంజీవికి డై హార్ట్ ఫాన్స్ ఉన్నారని, అభిమానులంటే చిరంజీవికి కూడా అంతే ఇష్టమన్నారు.మెగాస్టార్ చిరంజీవి సినీ ఇండస్ట్రీలో రికార్డులకు కేరాఫ్ అడ్రస్ అన్నారు. సిని మాలకు పదేళ్ల దూరంగా ఉన్నా ఏ మాత్రం క్రేజ్ తగ్గలేదుఅన్నారు. చిరంజీవి మాత్రమేన న్నారు. ఆయన మదర్ థెరిస్సా స్ఫూర్తితో 1998 నుండి ట్రస్ట్ ద్వారా రక్తదానం, నేత్రదానం సేవలు అందించారన్నారు. కరోనా మహమ్మారి సమయంలోనూ చిత్ర పరిశ్రమ కార్మికుల్ని ఆదుకోవడం కోసం సీసీసీ సంస్థను ఏర్పాటు చేసి విరాళాలు సేకరించి సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. మెగాస్టార్ చిరంజీవి జీవితం యువతకు, కష్టపడే తత్వానికి ఒక గొప్ప స్ఫూర్తి అన్నారు.మెగా స్టార్ చిరంజీవిని ఆదర్శంగా తీసుకుని ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. విజయనగరం, పార్వతిపురం, కురుపాం, శృంగవరపుకోట సాలూరు, బొబ్బిలి, గజపతినగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి, రాజాం పాలకొండ ప్రాంతాల నుండి మెగా ఫ్యామిలీ అభిమానులకు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## బొబ్బిలి డీఎస్పీగా గోవిందరావు



బొబ్బిలి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : బొబ్బిలి డిఎస్పీగా ఆర్.గోవిందరావు నియమించబడ్డారు. ఆయన విజయనగరం దిశ పోలీస్ స్టేషన్ బదిలీపై ఎక్కడికి వచ్చారు.డి.ఎస్.పి మాట్లాడుతూ సైబర్ నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటాం అన్నారు. మా సిబ్బంది తక్కువగా ఉన్న కష్టపడి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని. గాంజాయ్ పై ఉక్కు పాదం మోపుతామని అన్నారు . ఎక్కడైనా ఏ విద్యార్థి అసాంఘిక కార్యకలాపాలుపాల్పడితే సిఫార్సులు కూడా లెక్క చేయమని తెలియజేశారు . సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి వాటి ద్వారా వచ్చిన ఇబ్బందులను తెలియజేస్తామన్నారు. మహిళలపై అఘాయిత్యాలు తదితర అంశాలను తీసుకొని వారికి న్యాయం జరిగే విధంగా ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతామన్నారు. ప్రణాళికతో ముందుకు పోతామని అన్నారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ కె నారాయణ రావు డి.ఎస్.పి కి పుష్ప గుచ్చు అందజేసి సాదరంగా స్వాగతం పలితారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



చీపురుపల్లి ఏప్రిల్ 13 ప్రభాతవార్త.. చీపురుపల్లి పట్టణంలోని ఆంజనేయ పురంలో దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న దువ్వూరి సాయికృష్ణ కుటుంబానికి చీపురుపల్లి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో 24 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు మాట్లాడుతూ దీర్ఘకాలక వ్యాధితో మంచాన పడి ఇబ్బంది పడుతున్న సాయి కృష్ణను ప్రతి ఒక్కరు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు కడియాల వెంకటరమణ మావుదూరి ఆనందరావు, కే వై సాస్త్రి భోగాపురం వెంకటరమణ , జల్లేపల్లి నాగేశ్వరరావు ఎం . శ్రీనివాస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## పోహకాహారం ఎంతో ప్రయోజనం



కురుపాం,ఏప్రిల్ 13, ప్రభాతవార్త: గర్భిణీలు పోషకాహారము తీసుకోవటం వలన ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని జి . రజనీ దుర్గ అన్నారు. సోమవారం పోషణ పక్వాడా కార్యక్రమాలలో భాగంగా కురుపాం 5 అంగన్వాడీ కేంద్రం లో గర్భిణీ బాలింతలకు, తల్లులకు 02 సంవత్సరాల ప్రాముఖ్యత, పిల్లలకి ఆరోగ్య కరమైన ఆహారం వల్ల ప్రయోజనాలు , జంక్ ఫుడ్ వల్ల కలిగే నష్టాలు వివరించారు. పిల్లలకి స్క్రీన్ టైం తగ్గించి తల్లి తండ్రులు ఇతర కుటుంబసభ్యులు ఎక్కువ సమయం కేటాయించాలిని అంగన్వాడీ కార్యకర్తలకు కోరారు.కార్యక్రమంలో సూపర్వైజర్ రామలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త రాధాకుమారి, గర్భిణీలు , పిల్లలు పాల్గొన్నారు.

## పోషకాహరమే తల్లీబిడ్డలకు శ్రేయస్కరం



గరివిడి ఏప్రిల్,13 ప్రభాతవార్త: తల్లి బిడ్డలు, గర్భిణీస్త్రీలు, బాలింతలకు పౌష్టికాహారమే శ్రేయస్కరమని ఐసిడిఎస్ సి డి పి ఓ ఆరుద్ర అన్నారు. పిల్లలు మెదడు ఎదుగుదల కు,గర్భిణీలు ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహారం తప్పని సరిగా తీసుకోవాలని ఆమె సూచించారు. పోషణ పక్వాడ 8 వ పోషణ పక్షోత్సవాల్లో భాగంగా మండలం లోని గెడ్డపువలస గ్రామ పాఠశాల ప్రాంగణంలో సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గర్భిణీ లు,బాలింతలు, తల్లిదండ్రులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ శైశవ దశ లోగల పిల్లలు మెదడు ఎదుగుదల కు ,చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు గాను ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. కుటుంబీకులు అంతా బాధ్యత గా ఆహార నియమాలు పాటించి పిల్లలు భవిష్యత్తు, గర్భిణిలు,బాలింతలు ఆరోగ్య అంశం లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ జంక్ ఫుడ్ కి దూరంగా ఉండాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ మల్లాజ్యోషుల జ్యోతి, వరలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి కుమార్, తల్లులు, గర్భిణీలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆహార నియమాలు పాటించి ఆరోగ్యంగా ఉండాలి : సీడీపీవో



చీపురుపల్లి, ఏప్రిల్,13 ప్రభాత వార్త : ఆహార నియమాలు పాటించి తల్లిబిడ్డ ఆరోగ్యం గా ఉండాలని చీపురుపల్లి సిడిపిఓ పి నాగమణి సూచించారు. సోమవారం పోషణ పక్వాడ 8వ పోషణ ప క్షోత్సవాల్లో భాగంగా వంగపల్లి పేట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో తల్లులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి బిడ్డలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పౌష్టికాహారమే శ్రేయస్కరమని పిఓ అన్నారు. పిల్లలు మెదడు ఎదుగుదల కు,గర్భిణీ లు ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహారం తప్పని సరిగా తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో గర్భిణీ లు,బాలింతలు, తల్లిదండ్రులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ శైశవ దశ లోగల పిల్లలు మెదడు ఎదుగుదల కు ,చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు గాను ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. కుటుంబీకులు అంతా బాధ్యత గా ఆహార నియమాలు పాటించి పిల్లలు భవిష్యత్తు, గర్భిణిలు,బాలింతలు ఆరోగ్య అంశం లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ జంక్ ఫుడ్‌కి దూరంగా ఉండాలని ఆమె కోరారు. ఐసిడిఎస్ సూపర్ వైజర్ శశికళ. పాఠశాల ఉపాధ్యాయిని జమ్ము రాము, తల్లులు, గర్భిణీలు, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రకుమార్‌కు రాష్ట్రస్థాయి అవార్డు



పార్వతీపురం, ఏప్రిల్13, ప్రభాతవార్త: పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ప్రజలకు ఉన్నతమైన న్యాయ సేవలు అందించినందుకు స్థానిక కోర్టు లో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిమిడి చంద్రకుమార్‌కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అప్రిసేషన్ అవార్డుని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అందజేశారు. విశాఖపట్నం సిరిపురంలో ఫోర్ లైన్ హోటల్‌లో శనివారం జరిగిన రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమావేశానికి ముఖ్య అతిథు లుగా రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగల పూడి అనిత, రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (డి ఓ పి) బి. రామకోటేశ్వర రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అప్రిసేషన్ అవార్డును లాయర్ చంద్రకుమార్ అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు నా బాధ్యతను అనుక్షణం గుర్తు చేస్తుందని అన్నారు. ప్రజల పట్ల తన కర్తవ్యాన్ని కూడా గుర్తు చేస్తుందని అన్నారు.ఈ అవార్డు పొందిన సందర్భంగా పాలకొండ శ్రీ విజయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దూబ పద్మావతి మరియు డాక్టర్ ఎన్ టి ఆర్ వైద్య సేవ విజయనగరం, పార్వతీపురం ఉమ్మడి జిల్లాల మేనేజర్ దూబ రాంబాబు అభినందనలు తెలిపారు.

## విద్యుత్ లైను పునరుద్ధరించండి



కొమరాడ, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: మండలం తొడుము గ్రామంలో పంట పొలాలకు వెళ్లే విద్యుత్ లైన్ ను పునరుద్ధరించాలని బాధిత రైతులు కోరుతున్నారు. గత వారం రోజులుగా విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోతు న్నాయని రైతులు వాపోతున్నారు. గ్రామం కు చెందిన ఒక వ్యక్తి చెట్టు నరకడంతో విద్యుత్ వైర్లు పై పడి సుమారు 6 నుంచి 10 విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్లు రైతులు చెప్తున్నారు. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయినట్లు రైతులు తెలిపారు ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులకు చెప్పినప్పటికీ విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాలేదని అన్నారు. తక్షణమే విద్యుత్ సరఫరా పునర్ధరించి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

## సెయిల్‌లో ఘనంగా నేషనల్ సేఫ్టీ డే వారోత్సవాలు

లక్కవరపుకోట, ఏప్రిల్ 13, ప్రభాత వార్త : మండలంలోని శ్రీ రాంపురం గ్రామ కేంద్రం గా నడపబడుతున్న స్టీల్ ఎక్స్ చేంజ్ ఇండియా లిమిటెడ్(సేయిల్ )కంపెనీలో సోమవారం 55 వ జాతీయ సేఫ్టీ వారోత్సవాలను ఘనంగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిదిగా విశాఖపట్నం చీఫ్ ఇన్స్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ వి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## నీటి భద్రత అనేది సాగునీటి సంఘాల బాధ్యత



బాడంగి, ఏప్రిల్ 13 ప్రభాతవా ర్త : గౌరవ జిల్లా కలెక్టర్ ఆదేశాల నుంచి నీటి భద్రత సాగు నీటి సంఘాల బాధ్యత అనే అంశం పైన మండల స్థాయి కమిటీ సభ్యులైనటువంటి ఎంపీడీవో, ఏఈ ఇరిగేషన్ ,అగ్రికల్చర్ ఆఫీసర్ , పశు వైద్య శాఖ డాక్టర్ ,ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, ఏపిఓ మొద లైనటువంటి కమిటీ మెంబర్లుతో పాటుగా గ్రామ స్థాయి కమిటీలో ఉన్నటువంటి ఇంజనీరింగ్ సహాయకులు, అలాగే పశు వైద్య సహాయకులు, వ్యవసాయ సహాయకులతోపాటు, ఉపాధి హామీ సహాయకులు, సాంకేతిక సహాయకులు కు విస్తృత అవగాహన ఏర్పాటు చేయడంతో పాటు మైనర్ ఇరిగేషన్ కి సంబంధించి మన మండలంలో ఉండేటువంటి తొమ్మిది చెరువులతో పాటుగా మండలం మొత్తం మీద ఉన్న 319చెరువుల్లో ఉన్నటువంటి నీటి నిల్వ సామర్థం పెంచే విధంగా అలాగే భూగర్భ జలాల సాంద్రతను పెంచే విధంగా 100 రోజులపాటు నిర్వహించే ఈ డ్రైవ్ పై ప్రత్యేకమైనటువంటి ఓరియంటేషన్ ఇవ్వడం జరిగింది. అలాగే ఈ ప్రాజెక్టుని 100 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంది ఈ పనిలో నీటి సంఘాల ప్రెసిడెంట్లు అలాగే వైస్ ప్రెసిడెంట్లు అలాగే సభ్యులు అందరూ కూడా వారి వారి సహాయం అందించాలని కోరడమైనది. కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 6 నుండి 15వ తేదీ వరకు పనులను గుర్తించి ఆమోదం కొరకు ఆమోదం .

## ఉపాధి పథకాన్ని పకడ్బందీగా అమలుచేయాలి



పాచిపెంట, ఏప్రిల్ 13 ప్రభాత వార్త: జాతీయ ఉపాధి హామీ పథకం యధావిధిగా కొనసాగించి,మహాత్మా గాంధీ పేరుతోనే కొనసాగించాలని 200 రోజులు పనులు కల్పించాలని కోరుతూ స్థానిక ఎంపీడీవో బివిజే పాత్రో వినతి పత్రాన్ని వ్యవసాయ కార్మిక సంఘం ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్య లు సుర్రు రామారావు ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు మంచాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టం ఎవరి దయాదాక్షణం మీద రాలేదని ప్రజలు పాతికేళ్ల పోరాటాల ఫలితంగా 2005లో ఉపాధి హామీ చట్టం వచ్చిందని అటువంటి ప్రతిష్టాత్మకమైనటువంటి చట్టాన్ని ప్రభుత్వం ఈ విధంగా నిర్వీర్యం చేయడం సరికాదని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ చట్టం ప్రకారం 14 రోజులు పని చేసిన వెంటనే డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు .

## రాజకీయ ఒత్తిళ్లకు లొంగొద్దు : ఎమ్మెల్సీ



శృంగవరపుకోట,ఏప్రిల్13: రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గద్దని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. సోమవారం ఎస్.కోట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రస్తుతం సర్పంచుల పదవీ కాలం పూర్తి కావడంతో ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారని తెలిపారు.సర్పంచ్ లు లేకపోయినా ప్రజలచే ఎన్నుకోబడిన ఎంపీటీసీలు ఉన్నారని మండల పరిషత్ వ్యవస్థ బలంగా ఉందని పేర్కొన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు అందరూ కలిసి సమన్వయంతో పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు.గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభలకు ఎంపీటీసీలు, ఎంపీపీ,వైస్ ఎంపీపీలు తప్పనిసరిగా హాజరు కావాలని అలా అయితేనే పారదర్శకత ఉంటుందని ఆయన తెలిపారు.రానున్న రోజుల్లో స్పెషల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ప్రతి సచివాలయంలో సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రాజకీయాలకు తావు లేకుండా గ్రామంలోని పెద్దలందరినీ కలుపుకొని పంచాయతీల అభివృద్ధి కోసం సమిష్టిగా పనిచేయాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరావు,వైస్ ఎంపీపీ ఐ.సుధారాణి,ప్రత్యేక అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంపై మహిళలు శ్రద్ధ చూపాలి

రామభద్రపురం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : రామభద్రపురం మండలం హెడక్వార్టర్ లో పోషణ పక్వాడ కార్యక్రమం లో సి డిపివో మాట్లాడుతూ మహిళలు పౌష్టికాహారంపై శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ బాడంగి సీడీపీవో ఎల్ సుజాత కోరారు. ఈ నెల 9 నుంచి 29 వరకు జరుగుతున్న పోష ణపక్వాడా కార్యక్రమంలో మండల కేంద్రంలోని 8 అంగన్వాడీ సెంటర్లు పరిధిలో ఉన్న తల్లులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భధారణ నుంచి పిల్లలకు 2 ఏళ్ల వయస్సు వరకు తల్లి, బిడ్డ తీసుకోవాల్సిన పోషణ గురించి అవగాహన కల్పించారు. అలాగే వెయ్యి రోజుల సంరక్షణ గురించి కూడా తెలియజేశారు. మహిళలు ఆరోగ్యవంతులుగా ఉంటేనే పిల్లలు కూడా ఆరోగ్యంగా జన్మిస్తారని అన్నారు. పిల్లల మెదడు అభివృద్ధి పిల్లవాడు కడుపులో ఉన్నప్పటి నుంచి పిల్లవానికి 2 సంవత్సరాలు నిండేలోపు 80 శాతం ఉంటుందని తెలిపారు. అలాగే ఆరోగ్య పరీక్షలు సక్రమంగా చేసుకోవాలని కోరారు. అలాగే బూసాయవలస, పాతరేగలో కూడా పోషణ వక్వాడా సదస్సులు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు పోలాకి కృష్ణకుమారి, రత్నకుమారి, అంగన్వాడీ, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి... పేదలకు పెన్నిధి : విప్



కురుపాం ఏప్రిల్ 13 ప్రభాతవార్త. పేద ప్రజ లు ఆపదలో ఉంటే నేనున్నాను అని ఆదుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంచి మనసుకు నిదర్శనమని ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గం పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు సోమవారం ఆమె చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ నిధులు అందించడం జరుగుతుందని అన్నారు. కురుపాం మండలానికి చెందిన బియ్యలవలస గ్రామానికి చెందిన పాలక సుందరరావు కు రూ.30786, కిచ్చాడ గ్రామానికి చెందిన పద్మనాదం సుస్మితకు 23,400, కురుపాం గ్రామానికి చెందిన కర్రి సత్యంనాయుడు కు 52,522 రూపాయల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కె.వి.కొండయ్య, మాజీ ఏఎంసి చైర్మన్ కోలా రంజిత్ కుమార్, కురుపాం పిఏసిఎస్ చైర్మన్ దొల్లు కిషోర్, నాయకులు కడాయి, రమేష్ ,రామకృష్ణ, శ్రీను, సుబ్బలక్ష్మి, రంగారావు, మాసయ్య, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆకివీడులో దళితులపై దాడికి నిరసన



బొబ్బిలి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : ఆకివీడులో దళిత క్రైస్తవుల పై దాడికి నిరసన గా డిప్యూటీ స్పీకర్ ను వెంటనే సస్పెండ్ చేయాలి అని అంబేద్కర్ పోరాట సమితి క్రైస్తవ సంఘాలు బొబ్బిలి అధ్యక్షుడు సోరు సాంబయ్య ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో దళిత సంఘాలతో నిరసన తెలియజేశారు. దళితులపై దాడులు చేసిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వేలకోట్ల రూపాయలు బ్యాంకులను మోసం చేసి ఎమ్మెల్యే రఘురామకృష్ణ పై 420 కేసు నమోదు చేయాలని అన్నారు. దళిత క్రైస్తవుల పై 1950 లో వచ్చిన రాష్ట్రపతి ఆర్డినెన్స్ రద్దు చేయాలి దళిత క్రైస్తవుల ఎస్సీ హోదాపై రాష్ట్రపతి ఆర్డినెన్స్ రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళితులు పాల్గొన్నారు

## సమగ్ర శిక్ష ఉద్యోగుల సంక్షేమానికి సహకరించాలి



నెల్లిమర్ల, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : సమగ్రశిక్షా ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రతి ఒక్క ఉద్యోగి తమ వంతు సహకారాన్ని అందజేయాలని సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం నాయకులు ఆరికతోట రామకృష్ణ, పి. సింహాచలం తెలియజేశారు. ఈ మేరకు నెల్లిమర్లలో సోమవారం ఆ సంఘం ఉద్యోగుల మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయనగరం జిల్లా నాయకుల పిలుపు మేరకు నెల్లిమర్ల మండలంలో మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ సమగ్రశిక్షా ఉద్యోగులకు ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ నిధిని ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. ఇటీవలే రాష్ట్ర వ్యాప్తంగా ఐదుగురు సమగ్రశిక్షా ఉద్యోగులు మరణించారని, వారి కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా కూడా ఇవ్వలేదని, అలాగే సమగ్రశిక్ష పని చేసి పదవీ విరమణ, ప్రమాదం పాలైన ఉద్యోగుల, చనిపోయిన ఉద్యోగుల కోసం సమగ్ర శిక్షా అధికారులు ఎలాంటి సంక్షేమ నిధిని ఏర్పాటు చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉద్యోగులకు సంక్షేమ నిధిని ఏర్పాటు చేసే వరకు ఉద్యోగులే వెల్ఫేర్ ఫండ్ పొదుపు చేసుకోవాలని జిల్లా నాయకులు నిర్ణయించారని రామకృష్ణ, సింహాచలం వెల్లడించారు. దీనికి మండల ఉద్యోగులు అంతా సంఘీభావం తెలపాలని తెలియజేశారు. అలాగే ఉద్యోగులకు సంక్షేమ నిధి లేకపోవడం, గత ఏడేళ్ళుగా జీతాలు పెరగకపోవడం వంటి అంశాలు మండలంలో ఉన్న అన్ని శాఖల అధికారులకు, ఉద్యోగులకు తెలియజేస్తూ త్వరలో మండలంలో భిక్షాటన చేపట్టాలని నిర్ణయించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్షా లో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం 25 వార్త

## నీటి భద్రత, సాగునీటి సంఘాల బాధ్యతలపై అవగాహన



దత్తరాజేరు ఏప్రిల్ 13 ప్రభాతవార్త : నీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యతని వంద రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో జలధార జల హారతి అనే కార్యక్రమం పై ఎంపీడీవో కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ మరియు ఫీల్డ్ అసిస్టెంట్స్ కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీడీవో మాట్లాడుతూ భూగర్భ జలమట్టాలను పెంచడం మరియు సాగునీటి సంఘాలను బలోపేతం చేస్తూ నీటి పొదుపు వల్ల రైతులకు పంటలు పండి ఆదాయం సమకూరుతుందన్నారు అన్నారు సాగునీటి సంఘాలను బలోపేతం చేస్తూ నీటి పొదుపు మొదలగు విషయాలపై అవగాహన కల్పించామన్నారు ఈ కార్యక్రమంలో ఏపీఓ బి.వి.వి కామేశ్వరరావు ఇరిగేషన్ ఏఈ జి పైడినాయుడు పాల్గొన్నారు .

## ఫేస్ యాప్ రద్దు చేయాలని వినతి



సాలూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : ఫేస్ యాప్ ను రద్దు చేయాలని కోరుతూ మండల అభివృద్ధి అధికారి కి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ను పాత పద్ధతుల్లోనే పాత పద్ధతుల్లోనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ ఈశ్వరరావు ఆరుద్ర, బి ఈశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు .

## స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి : ఎమ్మెల్యే



పార్వతిపురం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో పురపాలక ఎన్నికలకు అందరూ సన్నద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే విజయ్ చంద్ర పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో పురపాలక సంఘ నాయకులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. పురపాలక సంఘంలో 40 వార్డులు ఉండేలా అధిష్టానాన్ని కోరినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం 36 వార్డులు ఉన్నాయని, వాటిని కనీసం 38కి పెంచాలని విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. ఈ ప్రక్రియ కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పురపాలక సంఘంలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం చేపట్టిన మరియు చేపట్టబోయే అభివృద్ధి పనులను ప్రజలకు చేరేలా ప్రతి నాయకుడు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని కోరారు. ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుల్లా పనిచేసి పురపాలక సంఘంలో విజయకేతనం ఎగరవేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే విజయ్ చంద్ర పిలుపునిచ్చారు.

## అమ్మవారి ఆశీస్సులతో అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే



కొత్తవలస, ఏప్రిల్ 13, (ప్రభాతవార్త): భక్తిభావం మనిషికి మానసిక ప్రశాంతతను ఇవ్వడమే కాకుండా, సమాజంలో ఐక్యతను పెంపొందిస్తుందని శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి అన్నారు. సోమవారం కొత్తవలస మండలం, అప్పన్నపాలెం పంచాయతీ పరిధిలోని దత్తి దన్నిపేట గ్రామాల మధ్య వేంచేసి ఉన్న శ్రీమరిడిమాంబ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ దేవతల అనుగ్రహం వల్ల గ్రామాల్లో పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని, భక్తులందరూ ఐక్యమత్యంతో ఆలయ పునర్నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. దాసరి కార్పొరేషన్ చైర్మన్ పొట్నూరు వెంకట రత్నాజీ, శిఠిదిళీ చైర్మన్ కోళ్ల వెంకట రమణ, మండల పార్టీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ తిక్కాన పైడిరాజు, టీడీపీ నాయకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తీవ్ర కాలుష్యం నుంచి కాపాడండి



కొత్తవలస, ఏప్రిల్ 13 (ప్రభాతవార్త) : ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడిన నేపథ్యంలో డంపింగ్ యార్డును వెంటనే తరలించాలని ఎస్.కోట నియోజకవర్గ జనసేన నాయకుడు సన్యాసి నాయుడు సోమవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కలిసి వినతి పత్రం సమర్పించారు. సన్యాసినాయుడు మాట్లాడుతూ రాజన్న కాలనీలో ప్రజలు దుర్వా సన, కాలుష్యం, వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నివాసాలకు అతి సమీపంలో డంపింగ్ యార్డు నిర్వ హించడం పూర్తిగా ప్రజా ఆరోగ్యానికి విరుద్ధమని స్పష్టం చేశారు. వెంటనే ఈ డంపింగ్ యార్డును జనావాసాలకు దూరంగా తరలించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మహిళా బిల్లు ఆవశ్యకతపై అవగాహన

నెల్లిమర్ల, ఏప్రిల్ 13, ప్రభాతవార్త స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మహిళా సాధికార సమితి కోఆర్డినేటర్ డాక్టర్. పి. జయలక్ష్మి అధ్యక్షతన శ్రీ శక్తి కార్యక్రమం జరిగింది. ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు నారీ శక్తి వందన నియం కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించే క్రమంలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు చదువుకొనుటలో ఉండేటువంటి అవకాశాలు, మహిళలకు ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలు మీద అవగాహన కల్పించుటకు, రాజకీయ నిర్ణయాల్లో మహిళల ఔచిత్యమైన పాత్ర గురించి చర్చించారు. విద్యార్థులు పాల్గొన్నారు.


यूनियन बैंक ऑफ इंडिया యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
**మెయిన్ బ్రాంచ్, రాజాం (04661)**
మెయిన్ రోడ్డు, రాజాం, విజయనగరం జిల్లా. ఫోన్ : 08941-252992
ఇ-మెయిల్ : ubin0804665@unionbankofindia.bank.in

### స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

[సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(1)]

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (రెండవ) యాక్ట్, 2002 (చట్టం నెం.54/2002) ప్రకారం **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మెయిన్ బ్రాంచ్ రాజాం (04661)** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002, అందలి రూలు 3 తో కలిపి చదవవలసిన సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **05.01.2026 తేదీన జారీచేసిన డిమాండ్ నోటీసు** మీకు అందిన తేది నుండి 60 రోజుల లోపు నోటీసులో పేర్కొనబడిన బకాయి **రూ.3,83,345.24 (అక్షరాల మూడు లక్షల ఎనభై మూడు వేల మూడు వందల నలభై ఐదు రూపాయల ఇరవై నాలుగు పైసలు మాత్రమే)** మొత్తమును తిరిగి చెల్లించవలసినదిగా **ఋణగ్రహీత & హామీదారు : 1) శ్రీమతి మందాది స్వాతి, W/o కమోదుల రాము,** డోర్ నెం.4-1, మెయిన్ వీధి, పోగిరి, శ్రీకాకుళం, ఆం.ప్ర-532 148 & డోర్ నెం. 6-106, మెయిన్ స్ట్రీట్, పొగిరి, శ్రీకాకుళం, ఆం.ప్ర-532 148. **2) శ్రీ కమోదుల రాము,** S/o **సూర్యనారాయణ లేటు,** డోర్ నెం.4-1, మెయిన్ వీధి, పోగిరి, శ్రీకాకుళం, ఆం.ప్ర-532148 వారిని కోరుతూ డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీత మరియు హామీదారు సదరు బకాయి మొత్తమును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని **10 ఏప్రిల్ 2026 వ తేదీన స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీత, హామీదారు మరియు యావన్మంది ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలు & హామీదారులును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తితో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తికి సంబంధించి ఎట్టి లావాదేవీలు జరిపిన అవి **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారికి చెల్లించవలిసిన బకాయి **తేది.09.04.2026 నాటికి రూ.3,75,178.06 (అక్షరాల మూడు లక్షల డెబ్బై ఐదు వేల నూట డెబ్బై ఎనిమిది రూపాయల ఆరు పైసలు మాత్రమే)** మరియు వడ్డీతో కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13, సబ్-సెక్షన్ (8) చట్ట ప్రకారము ఋణగ్రహీత'లు మరియు హామీదారు'లు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని కోరడమైనది.

**స్థిరాస్తి వివరములు:**

ప్రైమరీ సెక్యూరిటీ: బ్యాంకు ఆర్థిక సహాయంతో కొనుగోలు చేసిన 10 పాల పశువులతో పాటు, ఒక చిన్న మినీ డైరీ ఫామ్ కొరకు నిర్మించిన AC షీట్ల రూఫ్ షెడ్డు హైపోథికేషన్ చేయబడినది. కొల్లేటరల్ సెక్యూరిటీ: శ్రీకాకుళం జిల్లా, రాజాం మండలం (ప్రస్తుతం సిగడాం మండలం), పొగిరి గ్రామం, పోగిరి గ్రామ రెవెన్యూ పరిధి, పొగిరి గ్రామం, కొత్త పొగిరి వారి వీధి, సర్వే నెం.127P నందు విస్తీర్ణం 247.50 చ॥గ॥లులోని నిర్మించిన AC షీట్ రూఫ్ షెడ్ **శ్రీ కమోదుల రాము, S/o లేటు సూర్యనారాయణ గారి** పేరున కలదు. **హద్దులు: తూర్పు:** కామోదుల చైతన్య గారి ఖాళీ స్థలం, **దక్షిణం:** 15 అ॥ల ఉమ్మడి దారి, **పడమర:** దారి, **ఉత్తరం:** 7.5 అ॥ల వెడల్పు గల ఉమ్మడి దారి.

తేది : 10.04.2026
ప్రదేశం : విజయనగరం

సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

14-4pg10.qxd OK:14-4pg10.qxd 1/1/02 7:22 AM Page 1



## రోటర్‌డామ్ మారథాన్.. సావన్ జాతీయ రికార్డు




**న్యూఢిల్లీ:** ఎన్ఎన్ మారథాన్‌లో, భారతదేశపు అత్యంత సుదీర్ఘకాలంగా ఉన్న జాతీయ రికార్డును బద్దలు కొట్టి సావన్ బర్వాల్ చరిత్ర సృష్టించాడు. రోటర్‌డామ్‌లో జరిగిన ఎలైట్ రేసులో బర్వాల్ 2 గంటల 11 నిమిషాల 58 సెకన్ల సమయం నమోదు చేసి 20వ స్థానంలో నిలిచాడు. తద్వారా, 1978లో శివనాథ్ సింగ్ నెలకొల్పిన 2:12:00 పాత జాతీయ రికార్డును అధిగమించాడు. ఆ రికార్డు 48 సంవత్సరాలుగా నిలిచి, భారత అథ్లెటిక్స్‌లో అత్యంత పురాతన జాతీయ రికార్డుగా నిలిచింది. 27 ఏళ్ల సావన్‌రికార్డును రెండు సెకన్ల మేర మెరుగుపరిచి, పురుషుల మారథాన్ ఈవెంట్‌లో కొత్త మైలురాయిని అధిగమించి సుదీర్ఘ నిరీక్షణకు తెరదించాడు. పోటీతత్వం అధికంగా ఉన్న అంతర్జాతీయ వేదికపై బర్వాల్ స్థిరమైన వేగాన్ని కొనసాగించి ఒక సంచలన ఫలితాన్ని సాధించాడు. అతని ఈ కృషి, భారతదేశపు లాంగ్‌డిస్టెన్స్ రన్నింగ్ రంగంలో క్రమంగా జరుగుతున్న పురోగతిని ప్రతిబింబిస్తుంది. శివనాథ్ సింగ్ రికార్డు దశాబ్దాల పాటు చెక్కుచెదరకుండా ఉంది. దీనిని తరచుగా భారత అథ్లెటిక్స్‌లో అత్యంత కఠినమైన మైలురాళ్లలో ఒకటిగా పరిగణిస్తారు. ఈ విజయంతో బర్వాల్ మారథాన్‌లో ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పి, ప్రపంచ వేదికపై భారతీయ లాంగ్ డిస్టెన్స్ రన్నర్లకు నూతన ఉత్తేజాన్ని అందించాడు.




## ముంబై ఇండియన్స్ హ్యాట్రిక్ పరాజయాలు

### ప్లే ఆఫ్స్‌కు చేరాలంటే 7 మ్యాచ్‌లు గెలవాల్సిందే

**న్యూఢిల్లీ:** భారీ అంచనాలతో ఐపీఎల్ 2026 సీజన్‌ను ప్రారంభించిన ముంబై ఇండియన్స్ అందుకు తగ్గట్లుగానే శుభారంభం చేసింది. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో భారీ లక్ష్యాన్ని ఛేదించి 13 ఏళ్ల తర్వాత ఈ టోర్నీని ఘనంగా ప్రారంభించింది. దాంతో ముంబై ఇండియన్స్‌కు తిరుగులేదని అంతా అనుకున్నారు. జట్టు నిండా అంతర్జాతీయ స్టార్లు, నలుగురు వరల్డ్ టీమ్ కెప్టెన్లు ఉండటంతో ఈ టోర్నీలో ముంబై ఇండియన్సే విజేతగా నిలుస్తుందని 14 మంది స్టార్ స్పోర్ట్స్ ఎక్స్‌పర్ట్స్ అంచనా వేసారు. వారే కాదు ఏఐ టూల్స్ చాట్‌జీపీటీ, జెమీనై, గ్రోక్, మెటా ఏఐ అన్నీ టైటిల్ గెలిచే అవకాశాలు ముంబై కే ఉన్నాయని జోస్యం చెప్పాయి. కానీ ముంబై అనూహ్యంగా హ్యాట్రిక్ పరాజయాలను మూటగట్టుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో ఓడి పాయింట్స్ టేబుల్‌లో 8వ స్థానంలో నిలిచింది. జట్టు నిండా అంతర్జాతీయ స్టార్లు ఉన్నా పేలవ బౌలింగ్, చెత్త బ్యాటింగ్, లాకాఫ్ ప్లానింగ్ ముంబై ఇండియన్స్ పతనాన్ని శాసిస్తున్నాయి. వరల్డ్ బెస్ట్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఈ 4 మ్యాచ్‌ల్లో ఒక్క వికెట్ తీయకపోవడం గమనార్హం. టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ సూపర్ ఫామ్‌లో ఉన్నా గాయపడటం ఆ జట్టును ఆందోళనకు గురిచేస్తోంది. తిలక్ వర్మ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతుండటం కూడా ఆ జట్టుకు నష్టం చేస్తోంది. టోర్నీకి ముందు ముంబై ఈజీగా ప్లే ఆఫ్స్ చేరుతుందని చెప్పిన వారంతా, ఇప్పుడు ఆ జట్టు ఆటను చూసి నివ్వెరపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ముంబై పుంజుకొని ప్లే ఆఫ్స్ చేరుతుందా?

అంటే అవునని గట్టిగా చెప్పలేకపోతున్నారు. ఈ టోర్నీలో ముంబై 4 మ్యాచ్‌లే ఆడింది. ఇంకా 10 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఆ జట్టు ప్లే ఆఫ్స్ అవకాశాలు ఏం సంక్లిష్టంగా లేవు. చివరి 10 మ్యాచ్‌ల్లో 7 గెలిచినా ప్లే ఆఫ్స్ చేరుతుంది. 8 గెలిస్తే ఏ జట్టుతో సంబంధం లేకుండా టోర్నీలో ముందడుగు వేస్తోంది. ఐపీఎల్‌లో లీగ్ దశ ముగిసే సరికి టాప్4లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయన్న సంగతి తెలిసిందే.

టాప్4లో చోటు దక్కాలంటే ప్రతీ జట్టు కనీసం 8 విజయాలతో 16 పాయింట్స్ సాధించాలి. ముంబై ఇండియన్స్ ఇప్పటికే ఒక మ్యాచ్ గెలిచింది కాబట్టి మరో 7 గెలిస్తే సరిపోతుంది. ఓడిన మ్యాచ్‌ల్లో కూడా రన్‌రేట్ దెబ్బతినకుండా ప్రదర్శన చేయాలి. మరీ ముంబై తిరిగి పుంజుకుంటుందా? లేక తమ తడబాటు కొనసాగిస్తుందా? అనేది చూడాలి.



## రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్స్.. అమన్, ముకుల్‌కు రజతం

### 17 పతకాలతో ముగించిన భారత్

**న్యూఢిల్లీ:** ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్స్-2026లో భారత్ తన ప్రచారాన్ని చివరి రోజున రెండు రజత పతకాలు, ఒక కాంస్య పతకంతో ముగించింది. బిష్కెక్‌లో జరిగిన చివరి రోజు స్వర్ణం కోసం భారత్‌కు చెందిన ఇద్దరు రెజ్లర్లు పోటీపడినా, రెండు బౌట్‌లలోనూ విఫలమయ్యారు. 61 కేజీల ఫ్రీస్టైల్ ఫైనల్‌లో, అధిక స్కోరు నమోదైన పోరులో అమన్ సెహ్రావత్, ఉత్తర కొరియాకు చెందిన క్వాంగ్ మ్యాంగ్ కిమ్ చేతిలో 10-13 తేడాతో ఓడిపోయాడు. గతంలో 57 కేజీల విభాగంలో విజయం సాధించిన ఈ పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, అధిక బరువు విభాగంలో పోటీపడ్డాడు. అలాగే 86 కేజీల ఫైనల్‌లో ఇరాన్‌కు చెందిన కమ్రాన్ ఘాసెంపూర్ చేతిలో 0-7 తేడాతో ఓడిపోయిన ముకుల్ దహియా, భారత్ ఖాతాలో మరో రజత పతకాన్ని చేర్చాడు. ప్రచారాన్ని ముగించేందుకు దినేష్ కాంస్యం కైవసం చేసుకున్నాడు 125 కేజీల ఫ్రీస్టైల్ విభాగంలో కిర్గిజ్‌స్థాన్‌కు చెందిన అర్స్లాన్‌బెక్ తుర్దుబెకోవ్‌పై 12-1 తేడాతో ఆధిపత్య విజయం సాధించి కాంస్యం గెలుచుకోవడం ద్వారా భారత్‌కు చివరి పతకం లభించింది. ఫ్రీస్టైల్ మరియు మహిళల రెజ్లింగ్ జట్లు రెండూ బలమైన ప్రదర్శనను కనబరిచాయి. పురుషుల ఫ్రీస్టైల్ జట్టు రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, రెండు కాంస్య పతకాలతో గణనీయంగా రాణించగా, మహిళల జట్టు ఒక రజతం, నాలుగు కాంస్యాలను కైవసం చేసుకుంది.

## బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో.. ఆయుష్‌కు రజతం

**న్యూఢిల్లీ:** బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం గెలుచుకున్న భారత్ షట్లర్ ఆయుష్ శెట్టి 61 ఏళ్ల నిరీక్షణకు తెరదించాడు. చైనాలోని నింగ్బోలో జరిగిన ఈ ఛాంపియన్‌షిప్స్ 2026లో, పురుషుల సింగిల్స్ ఈవెంట్‌లో ప్రపంచ ఛాంపియన్ షి యుకి చేతిలో ఫైనల్‌లో ఓడిపోయిన తర్వాత ఆయుష్ శెట్టి రన్నరప్‌గా నిలిచి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ప్రపంచ ర్యాంకింగ్‌లో 25వ స్థానంలో ఉన్న 20 ఏళ్ల భారత ఆటగాడు, ప్రపంచ ర్యాంకింగ్‌లో రెండో స్థానంలో ఉన్న చైనా షట్లర్‌తో జరిగిన పోరులో 42 నిమిషాల్లో 21-8, 21-10 తేడాతో ఓడిపోయాడు. ఈ ఓటమి ఎదురైనప్పటికీ, ఖండాంతర ఛాంపియన్‌షిప్‌లలో పురుషుల సింగిల్స్ విభాగంలో రజత పతకం గెలిచిన గత 61 ఏళ్లలో తొలి భారతీయుడిగా నిలిచిన ఆయుష్ ప్రస్థానం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. 1965లో ఈ ఘనత సాధించిన దినేష్ ఖన్నా, ఈ ఈవెంట్‌లో స్వర్ణం గెలిచిన ఏకైక భారతీయుడిగా నిలిచారు. 2018లో హెచ్.ఎస్. ప్రణయ్ కాంస్యం గెలిచిన తర్వాత, ఆసియా ఛాంపియన్‌షిప్‌లలో పురుషుల సింగిల్స్‌లో భారతదేశానికి శెట్టి పతకమే మొదటిది.







## ఫిడే కాండిడేట్స్.. జూనియర్ చేతిలో వైశాలి ఓటమి

### దివ్య విఫలం, ప్రజ్ఞానంద మ్యాచ్ డ్రా

**న్యూఢిల్లీ:** ఫిడే కాండిడేట్స్ 2026లో జూనియర్ చేతిలో భారత్ గ్రాండ్ మాస్టర్ వైశాలి ఓటమి చెందగా, దివ్య దేశ్‌ముఖ్, ప్రజ్ఞానంద రమేష్‌బాబుల మ్యాచ్ డ్రాగా ముగిసింది. కేవలం రెండు రౌండ్లు మాత్రమే మిగిలి ఉండగా సైప్రస్‌లో జరిగిన మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లోని 12వ రౌండ్‌లో భారత క్రీడాకారిణి వైశాలి రమేష్‌బాబు, చైనా క్రీడాకారిణి జూ జినెర్ చేతిలో కీలక ఓటమిని చవిచూసి, పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి పడిపోయింది. వైశాలి కంటే జూనియర్ బాగా ఆడి 7 పాయింట్లతో స్కోరును సమం చేసింది. టోర్నమెంట్ తుది దశకు చేరుకుంటున్న తరుణంలో, మహిళల విభాగంలో 12వ రౌండ్‌లో మూడు నిర్ణయాత్మక ఫలితాలు వెలువడటంతో పోరాటం మరింత తీవ్రమైంది. టోర్నమెంట్‌లో తన తొలి విజయాన్ని నమోదు చేసుకున్న మాజీ ప్రపంచ ఛాంపియన్ టాన్ జోంగి చేతిలో దివ్య దేశ్‌ముఖ్ ఓడిపోయింది. 5 పాయింట్లతో దివ్య చివరి ఇద్దరు క్రీడాకారిణులలో ఒకరిగా ఉంది. ఇతర మ్యాచ్‌లలో, బిబిసారా అసౌబాయేవా కాటెరీనా లాగ్నోను ఓడించి 6.5 పాయింట్లతో పోటీలో నిలిచింది. అన్నా ముజిచుక్ అలెగ్జాండ్రా గోర్యాచ్కినాపై అద్భుతంగా ఆడినా కానీ ఆ ఊపును సద్వినియోగం చేసుకోలేకపోయింది. అలాగే ఓపెన్ సెక్షన్‌లో ప్రజ్ఞానంద రమేష్‌బాబు, ఆంద్రీ ఎసిపెంకో ఇద్దరూ డైనమిక్ ఓపెనింగ్‌తో బరిలోకి దిగడంతో అన్ని గేమ్‌లు డ్రాగా ముగిశాయి. దీంతో ప్రజ్ఞానంద 5 పాయింట్లతో ఏడవ స్థానంలో నిలిచాడు. హికారు నకమురాతో డ్రా చేసుకున్న జవోఖిర్ సిందరోవ్ 9 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, వెయ్ యిని ఓడించేందుకు చేరువైన అనీష్ గిరి 7 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. మరో మ్యాచ్‌లో మథియాస్ బ్లూబామ్, ఫాబియానో కరువానాతో డ్రా చేసుకున్నాడు.

# ఈక్విటీసూచీలకు పశ్చిమాసియా ఎఫెక్ట్!

## నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్,నిఫ్టీ

**ముంబయి, ఏప్రిల్ 13:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ఈక్విటీ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. ఇంట్రా డే కనిష్ఠాల నుంచి సూచీలు అనూహ్యంగా కోలుకున్నాయి. ముఖ్యంగా రక్షణ రంగ షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడం మార్కెట్‌కు కొంత ఊరటనిచ్చింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 702.68 పాయింట్లు నష్టపోయి 76,847.57 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 207.95 పాయింట్లు తగ్గి 23,842.65 వద్ద ముగిసింది. ట్రేడింగ్ ప్రారంభంలో భారీ నష్టాల్లోకి జారుకున్న సూచీలు, రెండో అర్ధభాగంలో ట్రేడింగ్ పుంజుకోవడంతో నష్టాలను చాలా వరకు తగ్గించుకోగలిగాయి. పశ్చిమాసియాలో పరిణామాలను ఇన్వెస్టర్లు నిశితంగా గమనిస్తుండటంతో మార్కెట్‌లో అప్రమత్తత కొనసాగింది. ఇది ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది. రంగాల వారీగా చూస్తే, ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా కనిపించింది. ఎఫ్ఎంసీజీ, ఐటీ రంగాల షేర్లు కూడా బలహీనంగా ఉన్నాయి. మెటల్ ఇండెక్స్ మిగతా రంగాలతో పోలిస్తే తక్కువ నష్టాలతో నిలిచింది. అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో నిఫ్టీ ఇండియా డిఫెన్స్ ఇండెక్స్ రాణించడం గమనార్హం. నిఫ్టీలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభపడగా, మారుతీ సుజుకీ, ఇండిగో, బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్ వంటి షేర్లు 4.6 శాతం వరకు నష్టపోయాయి. ప్రధాన సూచీల్లాగే మిడ్,స్మాల్‌క్యాప్‌లు కూడా నష్టాల్లోనే ముగిశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.54 శాతం, స్మాల్‌క్యాప్ 0.38 శాతం మేర నష్టపోయాయి. పశ్చిమాసియా చర్చలు విఫలం కావడంతో ముడిచమురుదరలు బ్యారెల్‌కు 100 డాలర్లకుపైగా పెరిగాయి. బిఎస్ఇలో మొత్తం ట్రేడింగ్‌లో 1790 షేర్లు పెరిగితే 2573 షేర్లు దిగజారాయి. 213 కంపెనీలు మాత్రం స్థిరంగా కొనసాగాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 93.39గా కొనసాగితే ఎంసిఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ జూన్ ఐదు సెటిల్‌మెంట్లు 0.70 శాతంపెరిగి రూ.1,51,591కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురుధరలు 7.19 డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 102. 39 డాలర్లుగా కొనసాగింది.



### డాలర్ వర్సెస్ రూపాయి 93.39

**ముంబయి,ఏప్రిల్ 13:** డాలరుతో రూపాయి మారకం విలువలు 56పైసలు క్షీణించి 93.39గా కొనసాగాయి. వారం ప్రారంభంలోనే అమెరికా ఇరాన్ చర్చలు విఫలం కావడంతో పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ముడిచమురుదరలు పెరుగుదలకు దోహదంచేసాయి. దీనితో డాలర్ చెల్లింపులు పెరగడంతో రూపాయి క్షీణతకు దారితీసింది. దీనికితోడు హార్ముజ్ జలసంధి ప్రారంభించడంపై నెలకొన్న సందిగ్ధత, అమెరికా ఇరాన్ ఓడరేవులను ముట్టడిస్తామన్న హెచ్చరికలు, దేశీయ ఈక్విటీల్లో విదేశీ మూలధన నిధులు విత్‌డ్రా వంటివి రూపాయి క్షీణతకు ఎక్కువ కారణం అయ్యాయి. ఇంటర్‌బ్యాంకు ఫారిన్ ఎక్స్ఛేంజి మార్కెట్ వద్ద డాలరుతో రూపాయి మారకం 93. 30వద్ద ప్రారంభం అయింది. ఒకదశలో 93.40 వద్దకు కూడా చేరింది. కొద్ది సేపటితర్వాత 93.25కి చేరింది. చివరకు ట్రేడింగ్‌ముగిసేనాటికి 93.39గా నమోదయింది. దీనితో ముగింపుస్థాయిలో 56 పైసలు క్షీణించింది. గతవారాంతంలో రూపాయి 32 పైసలు క్షీణించి 92.83గా నడిచింది. ఫోరెక్స్ మార్కెట్ మంగళవారం బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి కారణంగా సెలవు ఉంటుంది. మిరాయ్ అసెట్ షేర్‌ఖాన్ విశ్లేషకుడు అనూజ్‌చౌదరి మాట్లాడుతూ గ్లోబల్ మార్కెట్లలో ఉన్న రిస్కులు, అమెరికా ఇరాన్ చర్చలువిఫలంవంటివి దోహదం అయ్యాయన్నారు.



### 3.40%గా రిటైల్‌ద్రవ్యోల్బణం

**ముంబయి, ఏప్రిల్ 13:** భారత రిటైల్‌ద్రవ్యోల్బణం మార్చినెలలో 3.40శాతంగా ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వార్షిక పద్దతిలో అఖిలభారత వినియోగదారుల ధరలసూచీ ద్రవ్యోల్బణ లెక్కింపునకు 2024 ప్రామాణిక సంవత్సరంగా తీసుకున్నారు. ఈ లెక్కన చూస్తే మార్చినెలలో 3.40శాతంగా ఉందని కేంద్ర అర్థగణాంకమ ంత్రిత్వశాఖ ప్రకటించింది. మోస్పి డేటా ప్రకారం గ్రామీణప్రాంతాల ద్రవ్యోల్బణం 3.63శాతంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో దిగువస్థాయిలోనే అంటే 3.11శాతంగా ఉంది. ఆహారద్రవ్యోల్బణం మార్చినెలలో 3.87శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో అయితే 3.96శాతంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో 3.71శాతంగా నెలకొంది. కొన్ని నిత్యావసర ఆహార ఉత్పత్తులు ధరల్లో భారీ తగ్గుదలను నమోదుచేసాయి. ఉల్లిధరలు 27శాతం తగ్గితే ఆలుగడ్డలు 19శాతం, వెల్లుల్లి, పప్పుదినుసులు కందిపప్పు, శనగలు వంటివికూడా తగ్గినట్లు మోస్పి డేటా చెపుతోంది. ఆహార ఉత్పత్తుల్లో టమోటాలు, కాలిఫ్లవర్ ఉత్పత్తులు కూడా ధరలు కొంతమేర పెరిగాయి. ఇక వెండి,ఇతర ఆభరణాల ద్రవ్యోల్బణం భారీస్థాయిలో ఉంది 148శాతంగాఉ న్నట్లు తేలింది.

# ఎయిరిండియా ఉద్యోగులకు స్టాక్ ఆప్షన్స్!




వాణిజ్యం

ముంబయి, ఏప్రిల్ 13: ఎయిరిండియాను లాభాల బాట పట్టించేందుకు టాటా గ్రూప్ పురోభివృద్ధిలో ఉద్యోగులను భాగస్వాములను చేస్తూ, వారిలో ఉత్సాహం నింపేందుకు పెర్ఫార్మెన్స్ లింక్డ్ స్టాక్ ఆప్షన్స్ (పీఎస్ఓపీ) పథకాన్ని ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. దీనివల్ల ఉద్యోగుల ఉత్పాదకతను పెంచి, సంస్థ వృద్ధికి బాటలు వేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కొత్త పథకానికి పీఎస్ఓపీ 2026 అని పేరు పెట్టారు. ఫిబ్రవరి 13న జరిగిన సర్వసభ్య సమావేశంలో దీనికి ఆమోదం లభించింది. ఈ ప్లాన్ కింద పైలట్లు, ఇంజనీర్లు, సీనియర్ మేనేజ్‌మెంట్ సహా అర్హులైన ఉద్యోగులకు కంపెనీ స్టాక్ ఆప్షన్లు కేటాయిస్తారు. ఉద్యోగులు ఈ షేర్లను రూ.4 ముఖ విలువ నుంచి, కేటాయింపు సమయంలోని మార్కెట్ విలువ మధ్యలో కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. ఎయిరిండియా, దాని అనుబంధ సంస్థల్లో ప్రస్తుతం, భవిష్యత్తులో పనిచేసే అర్హులైన ఉద్యోగుల పనితీరుకు ప్రతిఫలం ఇవ్వడం, సంస్థ వృద్ధికి, లాభదాయకతకు దోహదపడేలా వారిని ప్రేరేపించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ప్రతిభావంతులను ఆకర్షించడం, నిలుపుకోవడం కూడా దీని లక్ష్యమని సమావేశ తీర్మానంలో పేర్కొన్నారు. ఏప్రిల్ 6న కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సమర్పించిన వివరాల ప్రకారం ఈ పథకం కింద కంపెనీ మొత్తం షేర్ క్యాపిటల్‌లో 0.25 శాతానికి సమానమైన సుమారు 22.71 కోట్ల స్టాక్ ఆప్షన్లను కొత్త షేర్లుగా జారీ చేయనున్నారు. షేర్ల కేటాయింపునకు 1 నుంచి 5 సంవత్సరాల వెస్టింగ్ పీరియడ్ ఉంటుంది. ఉద్యోగులు దీర్ఘకాలం సంస్థతో కొనసాగేలా టాటా ప్రోత్సహిస్తోంది. పనితీరు ఆధారంగానే షేర్ల కేటాయింపు ఉంటుంది. సంస్థ నిర్దేశించుకున్న అంతర్గత లక్ష్యాలలో 85 శాతం కంటే తక్కువ సాధిస్తే, ఉద్యోగులు కేవలం సగం షేర్లను మాత్రమే పొందే అవకాశం ఉంటుందని నివేదిక స్పష్టం చేసింది. ఎవరికి, ఎన్ని షేర్లు, ఏ ధరకు కేటాయించాలనేది నామినేషన్, రెమ్యూనరేషన్ కమిటీ నిర్ణయిస్తుంది. ఇప్పటికే దేశంలోని లిస్టెడ్ ఎయిర్‌లైన్స్ అయిన ఇండిగో, స్పైస్‌జెట్, అలాగే ప్రైవేటు సంస్థ ఆకాశ ఎయిర్‌లలో ఇలాంటి ఉద్యోగుల స్టాక్ ఆప్షన్ పథకాలు అమల్లో ఉన్నాయి. 2022 జనవరిలో ప్రభుత్వం నుంచి ఎయిరిండియాను టాటా గ్రూప్ కొనుగోలు చేసినప్పుడు కూడా దాదాపు 8,000 మంది ఉద్యోగులకు షేర్లను కేటాయించారు. ఎయిరిండియా సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ మార్చి 30న తన పదవికి రాజీనామా చేసినా, కొత్త వ్యక్తి బాధ్యతలు చేపట్టే వరకు కొనసాగనున్నారు. నాయకత్వ మార్పు సమయంలోనే కంపెనీ ఈ కీలక నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

## ఐదేళ్లకాలానికి సవరించిన 'కేఫ్' ముసాయిదా విడుదల!

**ముంబయి, ఏప్రిల్ 13:** దేశీయ ఆటోమొబైల్ పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. 2027 నుంచి 2032 మధ్య కాలానికి వర్తించే కార్పొరేట్ యావరేజ్ ఫ్యూయల్ ఎఫిషియెన్సీ కేఫ్ నిబంధనలను సడలిస్తూ కొత్త ముసాయిదాను విడుదల చేసింది. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీతో సంప్రదింపులు జరిపి విద్యుత్ మంత్రిత్వ శాఖ ఈ సవరించిన ముసాయిదాను సిద్ధం చేసింది. దశలవారీగా నిబంధనలను కఠినతరం చేసే విధానాన్ని ప్రభుత్వం ఎంచుకుంది. కేఫ్ 2027గా పిలిచే ఈ కొత్త నిబంధనలు 2027 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయి. 2032 ఆర్థిక సంవత్సరం వరకు క్రమంగా వీటిని కఠినతరం చేస్తారు. దేశ వాతావరణ, ఇంధన లక్ష్యాలకు అనుగుణంగా ఆటోమొబైల్ రంగాన్ని తీర్చిదిద్దే ప్రణాళికలో ఇది మూడో దశ. గతంలో 2025 సెప్టెంబర్‌లో విడుదల చేసిన ముసాయిదాతో పోలిస్తే తాజా ఫ్రేమ్‌వర్క్‌లో కంపెనీలకు మంచి వెసులుబాటు కల్పించారు. కొత్త ముసాయిదాలో ఉద్గారాల లెక్కింపునకు సంబంధించిన ఫార్ములాను మార్చారు. దీనివల్ల గతంలో ప్రతిపాదించిన దానికంటే వాహనాలు కొంచెం ఎక్కువ ఇంధనాన్ని వినియోగించుకోవడానికి వీలు కలుగుతుంది. బరువైన వాహనాలకు గతంలో ఉన్న ప్రయోజనాన్ని తగ్గిస్తూ, అన్ని రకాల వాహనాలకు దాదాపు ఒకే విధమైన నిబంధనలను తీసుకురావడం ఈ ముసాయి దాలోని మరో ముఖ్యమైన అంశం. ఈ కొత్త నిబంధనల్లో ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాలకు ప్రభుత్వం భారీగా ప్రోత్సాహం కల్పించింది. వీటికి సూపర్ క్రెడిట్స్ ఇచ్చారు. ఒక కంపెనీ ఫ్లీట్ ఉద్గారాలను లెక్కించేటప్పుడు ఒక ఎలక్ట్రిక్ లేదా హైబ్రిడ్ కారును ఒకటి కంటే ఎక్కువ వాహనంగా పరిగణిస్తారు. ప్లగ్‌ఇన్ హైబ్రిడ్, ఫ్లెక్స్‌ఫ్యూయల్ హైబ్రిడ్ వాహనాలకు ఇంకా అధిక మల్టిప్లయర్‌లు లభించనున్నాయి. ఇదే సమయంలో తయారీదారుల మధ్య క్రెడిట్ ట్రేడింగ్‌కు కూడా అనుమతి ఇచ్చారు. నిర్దేశిత లక్ష్యాలను మించి ఉద్గారాలను తగ్గించిన కంపెనీలు, తమ అదనపు క్రెడిట్లను లక్ష్యాలను చేరుకోలేని ఇతర కంపెనీలకు విక్రయించుకోవచ్చు. నిబంధనలు పాటించని పెద్ద కంపెనీలపై వందల కోట్ల రూపాయల జరిమానాలు విధించే అవకాశం ఉందని ముసాయిదా స్పష్టం చేస్తోంది. మరోవైపు ఏటా 1,000 కంటే తక్కువ యూనిట్లను ఉత్పత్తి చేసే చిన్న కంపెనీలకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు.

## రూ.144.5 కోట్లు తక్షణమే చెల్లిస్తే కుప్పకూలుతాం!

### ఢిల్లీ హైకోర్టుకు స్పైస్ జెట్ పిటిషన్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** కళానిధి మారన్, ఆయనకు చెందిన కేఏఎల్ ఎయిర్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో తమకు చాలాకాలంగా నడుస్తున్న వివాదంలో, రూ.144.5 కోట్లను తక్షణమే డిపాజిట్ చేయాలని ఒత్తిడి తెస్తే తాము కుప్పకూలుతామని స్పైస్ జెట్ ఎయిర్‌లైన్స్ ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. ఈ నగదు డిపాజిట్‌కు సంబంధించి సంస్థ చెల్లింపు గడువు ఏప్రిల్ 14వ తేదీతో ముగియనున్నది. ఈ నేపథ్యంలో స్పైస్ జెట్ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కారణంగా విమాన సర్వీసులకు ఆటంకం కలగడం, విమాన ఇంధన ధరలు పెరగడం వల్ల నగదు కొరత ఏర్పడిందని స్పైస్ జెట్ కోర్టుకు తెలిపింది. నగదుకు బదులు గురుగ్రామ్‌లో తమ కంపెనీకి ఉన్న ఎకరం వాణిజ్య భూమిని సెక్యూరిటీగా పెట్టుకోవాలని కోరింది. ఈ భూమిని అత్యవసరంగా విక్రయిస్తే 50 శాతం తక్కువ ధరకు అమ్మవలసి వస్తుందని, నష్టానికి ఆస్తులను అమ్ముకునేలా బలవంతం చేయవద్దని కోరింది. వాదనలు విన్న ఢిల్లీ హైకోర్టు తదుపరి విచారణను ఏప్రిల్ 15కు వాయిదా వేసింది. స్పైస్ జెట్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. 2015లో స్పైస్ జెట్ ఆర్థిక ఇబ్బందుల్లో కళానిధి మారన్ తన 58.46 శాతం షేర్లను స్పైస్ జెట్ వ్యవస్థాపకుడు.


### ధర సవరింపు ప్రకటన

బీడీల యొక్క ఉత్పత్తి ఖర్చు గణనీయంగా పెరిగినందున, మేము మా బీడీల యొక్క ధరలను **15-04-2026** నుండి ఈ క్రింది విధంగా సవరింపు చేయవలసిన ఒత్తిడి తప్పటంలేదు.

| పరిమాణం | 920 బీడీలు | 460 బీడీలు |
|---|---|---|
| టోకువ్యాపార కొనుగోలు ధర | రూ.940/- * | రూ.470/- * |
| చిల్లర వర్తక కొనుగోలు ధర | రూ.964/- * | రూ.482/- * |
| 23 బీడీల కట్ట ధర (వినియోగదారుని కొనుగోలు ధర) | రూ. 27/- * | |

* 18% GST కలుపుకొని

**మంగళూరు గణేశ్ బీడీ వర్క్స్**
హెడ్ ఆఫీస్, వినోబా రోడ్, మైసూరు - 570 005
ఫోన్: 0821-2420241, 2427172
e-mail: customercare@mgbw501.com


Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.